

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 249

బుధవారం 30-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పిల్లలకు మనం ఇవ్వగలిగిన విలువైన ఆస్తి చదువే.. పెద్ద చదువులు కూడా పేదలకు హక్కుగా మారాలి.. ప్రపంచంతో పోటీ పడే విధంగా పిల్లలకు శిక్షణ అందించాలి.. రాష్ట్రంలోని ప్రతి బిడ్డ చదువుకోవాలన్నదే నా ఆకాంక్ష .. అందుకే విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొని వచ్చాము.. - మీ ముఖ్యమంత్రి



జగనన్న విద్యా దీవెన

పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్..



క్రమం తప్పకుండా
ఏ త్రైమాసికం ఫీజు ఆ త్రైమాసికం
అయిన వెంటనే చెల్లిస్తూ...

గత ప్రభుత్వం అరకొరగా ఇచ్చే ఫీజుల్లో సైతం 2017 సం॥ నుండి పెట్టిన బకాయిలు రూ.1,778 కోట్లతో కలిపి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన క్రింద ఇప్పటి వరకు మన ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.12,401 కోట్లు..

జూలై-సెప్టెంబర్ 2022 త్రైమాసికానికి 11.02 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ. 694 కోట్లను నేడే అన్నమయ్య జిల్లా, మదనపల్లెలో బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

'జగనన్న విద్యా దీవెన'

పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో.. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న జగనన్న ప్రభుత్వం..

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ఏ రకమైన ఇబ్బందులున్నా టోల్ ఫ్రీ నెం **1902**ను సంప్రదించగలరు

'జగనన్న వసతి దీవెన'

ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా ఏటా రెండు వాయిదాలలో ఐటీఐ విద్యార్థులకు రూ. 10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ. 20 వేల చొప్పున ఆర్థికసాయం.... కుటుంబంలో ఎంత మంది చదువుతుంటే అంత మందికీ.. వారి తల్లుల ఖాతాల్లో సంవత్సరానికి రెండు దఫాల్లో నేరుగా జమ చేస్తున్న జగనన్న ప్రభుత్వం..

అర్హులందరికీ క్రమం తప్పకుండా కుల, మత, పార్టీ వివక్షలేకుండా, లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా పథకాలు అందిస్తూ..

ఇది విద్యా రంగంలో కేవలం సంస్కరణలపై మాత్రమే
జగనన్న ప్రభుత్వం గత మూడున్నరేళ్లలో చేసిన వ్యయం...

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందించిన మొత్తం రూ. కోట్లలో
జగనన్న అమ్మ ఒడి	44,48,865	19,617.53
జగనన్న విద్యా దీవెన	24,74,544	9,051.57
జగనన్న వసతి దీవెన	18,77,863	3,349.57
జగనన్న విద్యా కానుక	47,32,065	2,368.33
8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ట్యాబ్‌లు (ఈ డిసెంబర్ లో పంపిణీ... ఇక పై ప్రతి ఏటా 8వ తరగతిలోకి వచ్చే విద్యార్థులకు..)	5,18,740	685.87
జగనన్న గోరు ముద్ద	43,26,782	3,239.43
పాఠశాలల్లో "నాడు - నేడు" మొదటి దశ	15,715 (స్కూల్స్)	3,669.00
రెండో దశ	22,344 (స్కూల్స్)	8,000.00
మూడు దశల్లో రూ.16,450 కోట్ల వ్యయంతో మొత్తం 56,572 విద్యా సంస్థల్లో అభివృద్ధి పనులు..		
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	34,19,875	4,895.45
స్వేచ్ఛ (శానిటరీ నాప్ కిన్స్)	10,01,860	32.00
మొత్తం		54,908.75

★17 మెడికల్ కాలేజీలు, ఒక ఫిషరీస్ యూనివర్సిటీ, ఒక ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజ్ కి చేస్తున్న వ్యయం అదనం..

గత ప్రభుత్వం..

- ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు..
- అరకొరగా ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా సంవత్సరాల తరబడి జాప్యంతో, భారీగా బకాయిలు పెట్టిన పరిస్థితి..
- 2017-18, 2018 -19 సంవత్సరాలకైతే ఏకంగా రూ. 1,778 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ కాలేజీలకు బకాయిలు పెట్టిన దుస్థితి..
- భోజన, వసతి ఖర్చులు దేవుడెరుగు.. ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ సైతం అరకొరగా.. అదీ కళాశాలల ఖాతాల్లో జమ.. కొరవడిన పర్యవేక్షణ..

మన ప్రభుత్వం..

- పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు "జగనన్న విద్యా దీవెన" క్రింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్.. కుటుంబంలో ఎంత మంది చదువుతుంటే అంత మందికి.."జగనన్న వసతి దీవెన" క్రింద ప్రతి విద్యార్థికి భోజన, వసతి ఖర్చుల కోసం ఏడాదికి మరో రూ. 20,000 వరకు కుటుంబంలో ఎంత మంది చదువుతుంటే అంత మందికి ఆర్థిక సాయం..
- గత ప్రభుత్వ బకాయిలు దాదాపు రూ. 1,778 కోట్లతో కలిపి మన ప్రభుత్వం "జగనన్న విద్యా దీవెన" క్రింద రూ. 9,052 కోట్లు, "జగనన్న వసతి దీవెన" క్రింద రూ. 3,349 కోట్లు అందించింది.. ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం మన పిల్లల చదువులకు అందించిన మొత్తం ఆర్థిక సాయం అక్షరాలా రూ. 12,401 కోట్లు..
- కాలేజీల్లో జవాబుదారీతనం పెరిగేలా, తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పిస్తూ, తల్లుల సాధికారతకు పట్టం కడుతూ ఆర్థిక సాయం నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ..

జగనన్న ప్రభుత్వం అందిస్తున్న "జగనన్న విద్యా దీవెన", "జగనన్న వసతి దీవెన" పథకాలకు లిమిట్స్ లేవు. కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంత మందినీ చదివించండి. అందరికీ ఇస్తాం. ప్రతి అక్కకు, చెల్లెమ్మకు మంచి తమ్ముడిగా, అన్నగా.. పిల్లలకు మంచి మేనమామగా మన జగనన్న అందిస్తున్న కానుక ఇది..

తల్లులకు మనవి..

మీ ఖాతాల్లో జమ అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును వారం, పది రోజుల్లో కళాశాలలకు చెల్లించాలని విజ్ఞప్తి.. ప్రభుత్వం విడుదల చేసిన ఫీజు మీకు అందిన తర్వాత కూడా మీరు కళాశాలకు చెల్లించకపోతే, తదుపరి విడత నేరుగా కాలేజీలకే జమ చేయవలసి వస్తుంది..



శ్రీ. మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు

శ్రీ. బొత్స సత్యనారాయణ, విద్యా శాఖా మాత్యులు

గమనిక: "జగనన్న విద్యా దీవెన" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు 30 నవంబర్, 2022 నాడు ఉదయం 11 గంటలకు మదనపల్లెలో బటన్ నొక్కి ఫీజు రీయింబర్స్‌మెంట్ ను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్ లో వీక్షించవచ్చు..

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



లక్ష్మీప్రసన్న








సాంకేతిక రంగంలో యాంత్రికత కొన్నిరోజుల్లోనే పరిచయం అవుతుంది. రొటీన్ నుంచి భిన్నంగా ఆలోచించాలంటే.. మన అభిరుచే మనసుకు ఊరటనిస్తుంది. అలా ఎన్నుకున్న కళలు హార్ట్‌ఫుల్‌గా ఉంటే మరికొందరికి చేరువ చేస్తుంది. ఆదాయపు వనరులకు కొత్తదారులను వేస్తుంది. ఇంకొందరికి ఉపాధి మార్గం చూపుతుంది. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, మినియేచరిస్ట్ లక్ష్మీప్రసన్న నవతరానికి చూపుతున్న మార్గమూ ఇదే!

సృజనకు మినీ మార్గం

'ఖాళీ సమయంలో మొదలుపెట్టిన క్రియేటివ్ వర్క్ మరో ఆదాయ వనరుగా మారింది. మనసుకు నచ్చిన పనితో నలుగురిలో గుర్తింపూ వచ్చింది' అంటూ ఆనందంగా తన సృజనాత్మక వ్యాపకం గురించి వివరించింది లక్ష్మీప్రసన్న.

''సరదాగా మొదలుపెట్టిన వ్యాపకం మనకు తెలియకుండానే చాలామంది ఆప్తులను దగ్గర చేస్తుంది. నేను చేసే వర్క్ అలాంటిదే. చదివింది బీటెక్. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. కోవిడ్ టైమ్ వర్క్ ఫ్రమ్ హోమ్ కొన్ని అభిరుచులను నెరవేర్చుకోవడానికి కలిసొచ్చిందనే చెప్పాలి. కుట్లు, అల్లికలు చిన్నప్పటి నుంచి ఉన్న సరదా అభిరుచులే. అందులో భాగంగానే పాలిమర్ క్లేతో రకరకాల మినియేచర్ వస్తువుల మోడల్స్ తయారీ చేపట్టాను. వాటిలో పువ్వులు, పండ్లు, ఇంట్లోని వస్తువుల మోడల్స్... నా క్రియేటివిటీకి బాగా పనికి వచ్చాయి.

లెక్కలే.. లెక్కలు..

మినియేచర్ ఆర్ట్ వర్క్‌లో ప్రతి మోడల్‌కి ఓ షార్ట్ ఫామ్ అని చెప్పవచ్చు. ఉదాహరణకి .. యాభై మూడు ఇంచుల టీవీ మోడల్‌ని అర అంగుళంలో చూపడం. ప్రతిదీ అలాగే ఉంటుంది. అన్నీ ఎంచుకున్న డెకరేటివ్ ప్లేట్‌లో అమర్చాలంటే ప్రతి ఒక్కటి ఎంత పరిమాణంలో ఉండాలో ముందే లెక్కలేసుకొని, స్కేల్‌తో కొలిచి, ఆ తర్వాత క్లేను ఎంచుకుంటాను. మోడల్ చేశాక, బేక్ చేయడం, ఆ తర్వాత కలర్స్‌తో అలంకరించుకోవడం ... చాలా ఓర్పుతో కూడుకున్న పని. ఒక ఆర్డర్‌ని ఒప్పుకున్నానంటే అది పూర్తయ్యేదాకా నిద్ర పట్టదు.

అన్నప్రాశన.. పుట్టినరోజు

నేను ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు ఒక జ్ఞాపకంగా ఉండాలని నాకు నేనే ఒక స్క్రాప్ బుక్ తయారు చేసుకున్నాను. అలాగే బాబు పుట్టాక, వాడి ప్రతి వేడుక ఒక అందమైన జ్ఞాపకంగా నిలిచి పోవాలని క్లే మోడల్స్‌తో చాలా ప్రయోగాలు చేశాను. అందులో భాగంగానే పుట్టుకు వచ్చినవి ఈ క్లే మినియేచర్ ఆర్ట్.

ఆన్‌లైన్ ఆర్డర్..

క్రియేట్ చేసిన ప్రతి క్లే ఆర్ట్‌ను ఇన్‌స్టా పేజీలో ఉంచేదాన్ని. ఫొటో ఫ్రేమ్స్, పిల్లల అన్నప్రాశన, పుట్టినరోజు, సీమంతం వేడుకలకు రిటర్న్ గిఫ్ట్స్ కావాలంటూ ఆర్డర్స్ వచ్చాయి. మా ఆఫీసులో టీమ్ మెంబర్స్ కూడా నా గిఫ్ట్ ఆర్టికల్స్ చూసి చాలా బాగున్నాయని, వారూ ఆర్డర్స్ ఇచ్చేవారు. అలా, నెలలో 30 ఆర్డర్ల వరకైనా తీసుకుంటాను. సందర్భాన్ని బట్టి ఈ గిఫ్ట్ ఆర్టికల్స్ ధరలు ఉంటాయి. బల్క్ ఆర్డర్ అయితే, డిస్కౌంట్ ఇస్తుంటాను. నాకు సమయం సరిపోక కొన్ని ఆర్డర్స్‌ని కాదన్న రోజులు ఉన్నాయి. అయితే ఎంతో ఆశతో చేసిన ఆర్డర్స్ కాదనడం సరికాదనిపించింది. అందుకే ఈ వర్క్‌లో మా నాన్నతోపాటు మా కుటుంబ సభ్యులూ తమ సహాయాన్ని అందిస్తుంటారు. వారితో పాటు ఈ ఆర్ట్ వర్క్‌ని మరికొందరికి పరిచయం చేసే పనిలో ఉన్నాను. ఆన్‌లైన్ క్లాసులూ తీసుకుంటున్నాను.

నాకు తెలిసిన వారితో ఆర్డర్ ప్రైమరీ వర్క్ చేయిస్తూ, ఫినిషింగ్ వర్క్ చూస్తుంటాను. ప్రతి ఆర్ట్ పీస్ నాకు పూర్తి సంతృప్తిగా అనిపిస్తేనే బయటకు వెళుతుంది. లేదంటే, మళ్లీ మొదలు పెట్టాల్సిందే. వారం మొత్తం ఉద్యోగంలోనూ, బాబుతో బిజీగా ఉన్నా.. వారాంతాల్లోనూ, ఖాళీ సమయాలు నా మినియేచర్ ప్రపంచంలో నిమగ్నమవుతుంటాను'' అని వివరించింది ఈ ఆర్టిస్ట్.

అభిరుచిని ఆదాయవనరుగా మార్చుకోవడంలో ఈ తరం ముందుంటుందడానికి లక్ష్మీప్రసన్న ఉదాహరణగా నిలుస్తోంది.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

నేచురల్ క్లెన్సర్లు






- మేని నిగారింపుకు, చర్మ లావణ్యాన్ని ఇనుమడింపచేసుకోవడానికి దోహదం చేసే కొన్ని సహజసిద్ధమైన క్లెన్సర్‌లు, ప్యాక్‌లను ఇంట్లో మనం రోజూ వాడే వాటితోనే చేసుకోవచ్చు.
- గుడ్డులోని తెల్లసొనలో తేనె కలిపి ముఖానికి మర్దన చేస్తే ఎండకు నల్లబడిన ముఖచర్మం తిరిగి మామూలవుతుంది.
- బార్లీ పొడిలో తేనె, పెరుగు, బాదం కలిపి ముఖానికి పట్టించి ఐదు నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి.
- టొమాటో రసానికి తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేసి పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడగాలి.
- శనగపిండిలో క్యారట్ రసం కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడగాలి.
- రెండు టీ స్పూన్ల టొమాటో రసానికి నాలుగు టీ స్పూన్ల పెరుగు కలిపి ముఖానికి ప్యాక్ వేయాలి.
- రెండు టీ స్పూన్ల క్యాబేజ్ రసంలో చిటికెడు ఈస్ట్ లేదా పుల్లటి పెరుగు కలిపి ముఖానికి పట్టించాలి.

మెడకు మెరుపు..

ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు క్లెన్సింగ్ మిల్క్‌లో ముంచిన కాటన్‌తో మెడను తుడిచి, ఆ తర్వాత టీ స్పూన్ కీరా దోసకాయ రసంలో టీ స్పూన్ ఆపిల్ వెనిగర్ కలిపిన మిశ్రమాన్ని మెడకు పట్టించాలి. ఉదయం చన్నీటితో కడిగేయాలి. ఇలా కనీసం మూడు వారాల పాటు చేస్తే క్రమంగా మెడ మీద నలుపు వదులుతుంది. ఆపిల్ వెనిగర్ చర్మాన్ని టైట్ చేస్తుంది, కీరదోస చర్మాన్ని కోమలంగా మారుస్తుంది.

కేశాలకు పండంటి ప్యాక్

రెండు కివి పండ్లను తీసుకోవాలి. వీటికి తొక్కతీసి ముక్కలుగా కట్ చేసి బ్లెండర్‌లో వేసి కొద్ది నీళ్లు పోసి పేస్టు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు, జుట్టుకు అప్లై చేసి అరగంట తరువాత నీళ్లతో కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఇలా చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గడంతోపాటు, కేశాలు ఆరోగ్యంగా పొడవుగా పెరుగుతాయి. కివీలోని విటమిన్ ఈ, సీ లు జుట్టు పెరుగుదలకు తోడ్పడతాయి. కివి గుజ్జు, కొబ్బరి నూనె కలిపి వారానికి రెండు మూడుసార్లు హెయిర్ ప్యాక్ వేసుకుంటే మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయి.



పూజారమ్మ

సరస్వతీ పరమేశ్వర్ బాగావలే... అతి సాధారణ మహిళ. సమాజం స్త్రీ కోసమే నిర్మించిన ఆంక్షల వలయాన్ని ఛేదించింది. ఇందుకోసం ఆమె పోరాటం చేయలేదు. అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని స్వీకరించింది. చేపట్టిన బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తోంది. అంబా ఆరోగ్యభవాని ఆలయంలో పూజాదికాలు నిర్వర్తిస్తోంది.

అమ్మ పిలిపించుకుంది

సరస్వతి పరమేశ్వర్ వయసు 36. ముగ్గురు పిల్లలు, భర్తతో కలిసి ఆలయం ప్రాంగణంలోనే జీవిస్తోంది. రోజూ ఉదయాన్నే ఆలయం ఆవరణ శుభ్రం చేయడం, స్నానాదికాలు పూర్తి చేసుకున్న తర్వాత ఆరోగ్యభవాని విగ్రహంతో సహా ఆలయం లోపల శుభ్రం చేయడం, విగ్రహాలను అలంకరించడం, ఆ తర్వాత వంట చేసుకుని వచ్చి ఆరగింపు సేవ చేయడంతో శుభోదయ సేవలు పూర్తవుతాయి. సాయంత్రం ఐదు గంటలకు మరోసారి పూజ చేసి, చపాతీలు చేసుకుని వచ్చి పటిక బెల్లంతో నివేదన చేస్తానని చెప్పింది. ''నాలుగేళ్ల కిందట కొందరు ఊరి పెద్దలు వచ్చి ఆలయంలో పూజాదికాలు ఎవరు చేస్తారని అడిగారు. అప్పటి వరకు పూజలు చేస్తున్న పూజారి బాగా వృద్ధులయ్యారు. వాళ్ల పిల్లలు వచ్చి తాము నివసించే పట్టణానికి తీసుకెళ్లిపోయారు. ఇక ఆయన కుటుంబం నుంచి పూజ చేయడానికి ఎవరూ లేరు. దాంతో మరొకరిని నియమించడానికి అందరినీ అడిగారు. అప్పుడు నేను ఆడవాళ్లు కూడా రావచ్చా అని అడిగాను. ఆ తర్వాత వాళ్లలో వాళ్లు మాట్లాడుకుని 'అమ్మవారే స్వయంగా నిన్ను పిలిపించుకుంటుందేమో...' అని నన్ను పూజారిగా నియమించారు.


ఆరోగ్య భవాని ఆలయంలో పూజలు చేస్తున్న సరస్వతీ పరమేశ్వర్ బాగావలే

భూగర్భంలో మరో ఆలయం

మరాఠీ యూ ట్యూబర్‌లు వచ్చి ఈ ఆలయాన్ని వీడియోలు తీసుకుంటున్నారు. ఈ ఆలయంలో ఈ మాత కింద భూగర్భంలో మరో గుడి ఉంది. ఇక్కడ ఉన్న జాలీ తొలగించి మెట్ల నుంచి కిందకు వెళ్తే కనిపిస్తుంది. భూగర్భంలో ఉన్న ప్రతిమలు ఇక్కడ కనిపిస్తాయి చూడండి'' అంటూ సీసీ టీవీ చూపించింది. 'భక్తులు కిందకు వెళ్లి చూడవచ్చు' అని మెష్ అమర్చిన ఉడెన్ ఫ్రేమ్‌ను తొలగించింది. కిందకు దిగితే అక్కడ మరో చిన్న ఆలయమే ఉంది. అందులో పూజాదికాలు కూడా సరస్వతి చేతుల మీదుగానే జరుగుతాయి. తనకు సాధ్యం కాని రోజుల్లో తన కూతురు పూజ చేస్తున్నట్లు చెప్పిందామె.

ఇక్కడ ఏ ఉద్యమమూ జరగలేదు, కానీ ఒక అవసరం సమాజపు ఆధిపత్య గిరిగీతను తుడిచివేసింది. సరస్వతి పూజ చేస్తున్న ఆలయం మహారాష్ట్ర, బీడ్ జిల్లాలో ఉంది. మనకు సులభంగా తెలియాలంటే... ద్వాదశ జ్యోతిర్లింగం పర్లి వైద్యనాథ్ ఆలయం ఆధారంగా చెప్పుకోవాలి. వైద్యనాథ ఆలయం ఉన్న పర్లి పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో చాందాపూర్ గ్రామంలో ఉంది సరస్వతి చేతుల మీదుగా పూజలందుకుంటున్న ఆరోగ్యభవాని ఆలయం.

– వాకా మంజులారెడ్డి

చిత్తములన్నీ చిత్రరచనలై

● ఏఐ ఇమేజ్ జనరేషన్

యూత్ పల్స్

చిన్నప్పుడెప్పుడో మనందరికీ దగ్గరైన కళ... చిత్రకళ. మట్టిపలకల నుంచి తడిమట్టి వరకు అన్నీ మన కాన్వాసులే! కొందరి దగ్గర అది శాశ్వతంగా ఉండిపోయిందిగానీ, కొందరి విషయంలో మాత్రం వచ్చినట్లే వచ్చి వెళ్లిపోయింది. అలాంటి వారికి యువతరంలో మళ్లీ ఇప్పుడు దగ్గరవుతోంది. దీనికి కారణం ఏఐ ఇమేజ్ జనరేటర్ సాంకేతికత...




నిన్నటి వైపు చూస్తే...

'100 పర్సెంట్ లైఫ్ లైక్' నినాదంతో 'త్రీపీ ఎఏ' సాంకేతికత ఆసక్తి రేకెత్తించింది. 'ఈ ఫొటోలలో ఏది అసలు? ఏది కాదు?' అంటూ పరీక్ష పెట్టి ఆశ్చర్యపరిచింది.

నేడు చూస్తే...

యువతరంలో చాలామందికి ఏఐ ఆర్ట్ అనేది కాస్త సరదా. ఇంకాస్త స్ట్రెస్‌బస్టర్.

రేపు?

ఆశ్చర్యానందాలతో మొదలైన సాంకేతిక చిత్రకళ అక్కడే ఆగిపోతుందా? వ్యక్తిగత అభిరుచికి మాత్రమే పరిమితమైపోతుందా? 'కాదు' అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

'డాల్–ఇ' స్ఫూర్తితో తొలిసారిగా అమెరికాలో 'ఆర్టిఫిషియల్ ఆర్ట్ గ్యాలరీ' ఏర్పాటయింది. ఇటీవల శాన్‌ఫ్రాన్సిస్కోలో ఏఐ జెనరేటెడ్ ఆర్ట్‌వర్క్స్‌ను అమ్మకానికి పెట్టారు. వీటికి మంచి స్పందన రావడం విశేషం. వ్యక్తులే కాదు 'మిక్స్‌ప్యానల్'లాంటి మొబైల్ అండ్ వెబ్ ఎనలటిక్స్ సంస్థలు కూడా పాల్గొన్నాయి. 'మిక్స్‌ప్యానల్' రూపొందించిన మానవ ఆకారంలోని పుష్పం ఆకట్టుకుంది. 'కొలరాడో స్టేట్ ఫెయిర్స్ ఫైన్ ఆర్ట్ పోటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించిన చిత్రానికి మొదటి బహుమతి లభించింది. ఏఐ ఆర్ట్‌ను ఆర్ట్‌ఫామ్‌గా గుర్తించని వారిలో సంప్రదాయ చిత్రకారులతోపాటు ఎంతోమంది సోషల్ మీడియా యూజర్లు కూడా ఉన్నారు. అగ్రశ్రేణి విజువల్ మీడియా, ఫొటో సప్లై కంపెనీ గెట్టీ ఇమేజెస్ ఏఐ–సాంకేతికతతో సృష్టించిన ఇమేజ్‌లను తమ ప్లాట్‌ఫామ్‌లలో అనుమతించబోమని స్పష్టంగా చెప్పేసింది.

'డిజిటల్ ఆర్ట్ వల్ల హద్దులు చెరిగిపోయాయి. ప్రయోగాలు చేయడానికి అందరికీ అవకాశం ఏర్పడింది' అనేవాళ్లు కూడా ఉన్నారు. ఏఐ ఆర్టిస్ట్‌ల పక్కన 'ఇమాజినేషన్ ట్రాన్స్‌లేటర్' అనే విశేషణం కూడా వచ్చి చేరింది!

టెక్స్ట్–టు–ఇమేజ్ ఆర్ట్ వల్ల భవిష్యత్ ఆర్ట్ మార్కెట్‌లో ఎలాంటి మార్పులు చోటు చేసుకోబోతున్నాయనే విశ్లేషణలతో పాటు, హాని కలిగించే కంటెంట్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా జోరుగా చర్చ జరుగుతుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లాంటి సంస్థ కూడా ఈ అంశంపై దృష్టి సారించింది.

అమెరికాకు చెందిన సోషల్ క్రియేటివ్ కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్, ఆన్‌లైన్ ఫొటో అండ్ వీడియో ఎడిటింగ్ అప్లికేషన్ 'పిక్‌సార్ట్' యువతరాన్ని దృష్టిలో పెట్టుకొని ఏఐ ఇమేజ్ జనరేటర్, ఏఐ రైటర్ టూల్స్ ఇటీవల లాంచ్ చేసింది. దీనివల్ల రకరకాల స్టిక్కర్లు, టూల్స్, ఫిల్టర్స్, ఫాంట్స్... మొదలైన వాటితో ఏఐ ఇమేజ్ క్రియేషన్‌కు అవకాశం ఏర్పడుతుంది.

'తమలోని సృజనను ఆవిష్కరించుకోవాలనుకునేవారికి సరైన మాధ్యమం ఇది. కొత్తగా వచ్చిన వారితోపాటు సీనియర్లకు కూడా ఇది ఎంతో ఉపయోగపడుతుంది' అని చెబుతోంది కంపెనీ.

'డాల్–ఇ2' లాంటి ఇమేజ్ జనరేటర్స్ తక్కువ సమయంలో కోరుకున్న థీమ్‌ను చిత్రాల రూపంలో అందిస్తాయి. శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా(యూఎస్) కేంద్రంగా పనిచేసే ఆర్టిఫిషియల్ రీసెర్చ్ కంపెనీ 'ఓపెన్ ఏఐ' దీన్ని రూపొందించింది. గత సంవత్సరం ఆకట్టుకున్న 'డాల్–ఇ'కి ఇది కొనసాగింపుగా వచ్చింది.

'ఎలిఫెంట్ టీ పార్టీ' 'హిమాలయాల్లో పిల్లి' పేర్లతో 'డాల్–ఇ' సృష్టించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి.

'డాల్–ఇ'తో ఫొటోలను కార్టూన్ రూపంలోకి మలచవచ్చు. లండన్‌కు చెందిన అంకుర సంస్థ 'స్టెబిలిటీ ఎఐ' డాల్–ఇ తరహాలోనే 'స్టేబుల్ డిఫ్యూజన్'ను ఆవిష్కరించింది. టెక్స్ట్ ప్రాంప్ట్‌తో సెకండ్ల వ్యవధిలోనే 512×512 పిక్సెల్ ఇమేజ్‌లను ఇది సృష్టించగలదు. అయితే 'డాల్–ఇ'తో పోల్చితే దీనిలో భద్రతా ప్రమాణాలు మృగ్యం అనే మాట అక్కడక్కడా వినబడుతోంది. ఫ్యాషన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పత్రిక 'కాస్మోపాలిటన్' తొలిసారిగా ఎఐ–జెనరేటెడ్ ముఖచిత్రంతో అందరినీ ఆశ్చర్యపరిచింది.

స్ఫూర్తి

యాకమ్మ ఒక గొప్ప వెలుగు


యాకమ్మ

తాళ్లపల్లి యాకమ్మ ఇంట్లో ఎవరూ చదువుకోలేదు. కథలు అంటే తెలియదు. మహబూబాబాద్ దళితవాడలో అర్థాకలితో పెరిగిన యాకమ్మ తల్లిదండ్రుల్ని కోరింది ఒక్కటే - చదివించమని. ఇంటర్‌లో పెళ్లయినా ఆ తర్వాత పిల్లలు పుట్టినా యాకమ్మ చదువు మానలేదు. తెలుగులో పిహెచ్‌డి చేసింది. ఎం.ఏ సంస్కృతం చేసింది. ఆ సమయంలో కథలు చదివి తన బతుకు గోస కూడా కథలుగా రాయాలనుకుంది. రెండు కథాసంపుటాలు, ఒక నవల వెలువరించింది. 'చదువుకుంటే ఏమవుతుందో నన్ను చూసైనా నా జాతి ఆడపిల్లలు తెలుసుకోవాలని నా తపన' అంటున్న యాకమ్మ పరిచయం.

'దళిత ఆడపిల్లలు బాగా చదువుకోవాలి. ఉద్యోగాలు తెచ్చుకోవాలి. ఆర్థికంగా గట్టిగా నిలబడాలి. ఆ తర్వాత రాజకీయ అధికారం కోసం ప్రయత్నించి పదవులు పొంది దళితుల కోసం, పేదల కోసం పని చేయాలి' అంటారు యాకమ్మ.

ఆమె 'కెరటం' అనే దళిత నవల రాశారు. అందులోని మల్లమ్మ అనే దళిత మహిళ పాత్ర అలాగే ప్రస్థానం సాగిస్తుంది. కష్టపడి చదువుకుని, ఉద్యోగం పొంది, ఆ తర్వాత సవాళ్లను ఎదుర్కొని సర్పంచ్ అయ్యి, ఆ తర్వాత ఎం.ఎల్.ఏ. అవుతుంది. 'ప్రజలు' ఎప్పుడూ ప్రజలుగానే ఉండిపోవడం ఏ కొద్దిమంది మాత్రమే ఎం.ఎల్.ఏనో ఎం.పినో అవ్వాలనుకోవడం ఎందుకు అని యాకమ్మ ప్రశ్న.

యాకమ్మది వరంగల్ జిల్లా మహబూబాబాద్. అక్కడికి దగ్గరగా ఉన్న అన్నారంలోని యాకూబ్ షా వలీ దర్గాలో మొక్కుకుంటే పుట్టిందని తల్లిదండ్రులు యాకమ్మ అని పేరు పెట్టారు. ఇంటికి పెద్ద కూతురు యాకమ్మ. ఇంకో చెల్లి. తండ్రి మాదిగ కులవృత్తిని నిరాకరించి దొర దగ్గర జీతానికి పోయేవాడు. తల్లి కూలి పని చేసేది. ఇద్దరూ కూడా తమకు పుట్టిన ఇద్దరు ఆడపిల్లలు తమలాంటి జీవితం కాకుండా మంచి జీవితం చూడాలని అనుకునే వారు. ముఖ్యంగా తల్లి అబ్బమ్మ తన కూతుళ్లను బాగా చదివించాలనుకునేది. యాకమ్మ కూడా అందుకు తగ్గట్టే చదువును ఇష్టపడేది. అక్కడ పదోతరగతి దాటితే పెళ్లి చేయడం ఆనవాయితీ. యాకమ్మ ఇంటర్‌కు రాగానే పెళ్లి చేయాలని తల్లిదండ్రులు అనుకున్నారు. యాకమ్మ తల్లిదండ్రులను, భర్తను అడిగింది ఒక్కటే– పెళ్లయ్యాక కూడా చదువు కొనసాగించేందుకు అనుమతి ఇవ్వమని.

మంచినీళ్లు తాగి

పెళ్లయ్యాక అత్తగారింట యాకమ్మకు చదువు వీలయ్యేది కాదు. భర్త వీరాస్వామి డ్రైవర్‌గా పని చేసేవాడు. అతని తోబుట్టువుల రాకపోకలు ఉండేవి. సంపాదన చాలక తినడానికి కూడా ఉండేది కాదు. తల్లిదండ్రులు ఇచ్చిన రెండు జతల బట్టలతోనే కాలేజీకి వెళ్లి డిగ్రీ పూర్తి చేసింది యాకమ్మ. లంచ్‌బెల్‌లో స్నేహితురాళ్లు లంచ్ చేస్తుంటే దూరంగా చెట్టు కింద కూచుని మంచినీళ్లు తాగి మళ్లీ తరగతులకు వచ్చేది. ఆకలి ఉన్నా చదువు ఆపలేదు. ఇద్దరు పిల్లలు పుట్టినా చదువు ఆపలేదు.

తెలుగులో పీహెచ్‌డీ

యాకమ్మ కాకతీయ యూనివర్సిటీలో పి.జి. ఆ తర్వాత ద్రవిడ యూనివర్సిటీ నుంచి పి.హెచ్.డి. చేసింది. తెలుగు పండిట్‌గా ఉద్యోగం రావడంతో పిల్లలకు పాఠాలు చెప్పాలంటే సంస్కృతం కూడా తెలిసి ఉండాలని సంస్కృతంలో పి.జి. చేసింది. ఆ సమయంలోనే తన గైడ్ బన్న ఐలయ్య ద్వారా సాహిత్యం తెలిసింది. కథలు చదివే కొద్దీ తన జీవితంలోనే ఎన్నో కథలు ఉన్నాయి ఎందుకు రాయకూడదు అనిపించింది. కాని ఎలా రాయాలో తెలియదు. అయినా సరే ప్రయత్నించి రాసింది. 'కథలు రాస్తున్నాను' అని వారికీ వీరికీ చెప్తే 'ఈమె కూడా పెద్ద రచయితనా? ఈమెకు ఏం రాయవచ్చు' అని హేళన చేశారు. కానీ వాళ్లే ఆ తర్వాత ఆమె రచనలను అంగీకరించారు.



రెండు సంపుటాలు


యాకమ్మ 2018 నుంచి రాయడం మొదలుపెట్టింది. కథ వెంట కథ రాసింది. 'మమతల మల్లెలు', 'రక్షణ' అనే రెండు సంపుటాలు వెలువరించింది. ఆ తర్వాత దళిత నవల 'కెరటం' రాసింది. తన జీవితం నుంచి తాను చూసిన జీవితాల నుంచి కథలను వెతికింది. వెతలు తెలిపింది. కోవిడ్ నేపథ్యంలో వరుసపెట్టి కథలు రాసి 'దుఃఖ నది' అనే సంకలనం తెచ్చింది. వెక్కిరించిన వాళ్లు, వివక్ష చూపిన వారు మెల్లగా సర్దుకున్నారు. వరంగల్ జిల్లా మొత్తం ఇప్పుడు యాకమ్మ అంటే 'కథలు రాసే యాకమ్మేనా' అని గుర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు పిలుస్తున్నారు. అవార్డులు ఇస్తున్నారు. ఇదీ యాకమ్మ ఘనత.



యాకమ్మ కుమార్తె ఎం.బి.బి.ఎస్ చేస్తోంది. కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. భర్త అనారోగ్యం వల్ల పని తగ్గించుకున్నాడు. ఇంటిని, ఉద్యోగాన్ని చూసుకుంటూనే కథను విడవకుండా సాధన చేస్తోంది యాకమ్మ. చదువుకుంటే జీవితాలు మారతాయని తనను చూసి తెలుసుకోండి అని అట్టడుగు వర్గాల ఆడపిల్లలకు ఆమె మాటల ద్వారానో కథల ద్వారానో చెప్తూనే ఉంటుంది. 'ఆడపిల్లలు చదువుకోవాలి. సమాజాన్ని మార్చాలి. పెళ్లి పేరుతోనో డబ్బులేదనో వారిని చదువుకు దూరం చేయొద్దు' అంటుంది యాకమ్మ.

ఆమె చీకట్లను తరిమికొట్టడానికి విద్యను, సాహిత్యాన్ని ఉపయోగిస్తోంది. యాకమ్మ ఒక గొప్ప వెలుగు.

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే
రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 249

బుధవారం 30-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
177	55
62,682	18,618

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,987	▽	62
డోజోన్స్	33,747	▽	102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,512	▲	38
డాక్స్	14,355	▽	28
షాంఘై	3,150	▲	71
నికాయ్	28,028	▽	140

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	52,775	▽	77
బంగారం (99.5 స్వచ్ఛత)	52,564	▽	76
వెండి (కిలో)	61,685	▽	425

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.85	82.52
€	యూరో	ఒకటి	83.27	86.24
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	96.48	99.74
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.07	59.93
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.68	56.53
S$	సింగపూర్ డాలర్	ఒకటి	58.54	60.44
SAR	సౌదీ రియాల్	ఖాతాలనుబట్టి	20.80	22.47
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాలనుబట్టి	21.35	23.15
¥	చైనా యువాన్	ఖాతాలనుబట్టి	10.28	12.30

అదానీ చేతికి 'ధారావి' ప్రాజెక్టు

- రూ.5,069 కోట్లతో అత్యధిక బిడ్
- సర్కారు ఆమోదంతో అవార్డు ఖరారు



ముంబై: ప్రపంచంలోనే అతిపెద్ద మురికివాడగా పేరొందిన, ముంబైలోని ధారావి పునర్‌నిర్మాణ ప్రాజెక్ట్ కాంట్రాక్టు అదానీ గ్రూప్ చేతికి వెళ్లనుంది. రూ.5,069 కోట్లను కోట్ చేసి అత్యధిక బిడ్డర్‌గా నిలిచింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్‌ఎఫ్ రూ.2,025 కోట్లకు కోట్ చేసింది. ఈ వివరాలను ప్రాజెక్టు సీఈవో ఎస్‌వీఆర్ శ్రీనివాస్ వెల్లడించారు. ''259 హెక్టార్ల పరిధిలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. కాంట్రాక్టు పొందిన సంస్థ ఏడేళ్లలో 6.5 లక్షల మందికి ఆవాసం సమకూర్చాల్సి ఉంటుంది. వీరంతా ఇప్పుడు ధారావిలో 2.5 చదరపు కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.20,000 కోట్లు. తొలి దశలో అదానీ గ్రూపు రూ.5,069 కోట్లను ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపించింది. దీన్ని ఏడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది'' అని శ్రీనివాస్ తెలిపారు. వివరాలను ప్రభుత్వానికి పంపిస్తున్నామని, పరిశీలన అనంతరం తుది అనుమతి ఇస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు పొందిన సంస్థ 6.5 లక్షల మందికి నివాసం ఏర్పాటు చేయడంతోపాటు, మిగిలిన స్థలంలోని నివాస గృహాలను అధిక ధరలకు విక్రయించుకోవచ్చు. అలాగే, వాణిజ్య స్థలం కూడా అందుబాటులోకి వస్తుంది.

ఫిబ్రవరిలో వైజాగ్ టెక్ సమ్మిట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మరో ప్రపంచస్థాయి సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో పల్సస్ గ్రూపు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16, 17 తేదీల్లో వైజాగ్ టెక్ సమ్మిట్–2023 జరుగనుంది. వివిధ దేశాలకు చెందిన ఆవిష్కర్తలు, మేధావులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. పల్సస్ గ్రూప్ సీఈవో శ్రీనుబాబు గేదెల ఇప్పటివరకూ 3,000లకు పైగా అంతర్జాతీయ సదస్సులను విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో వైజాగ్ టెక్ సమ్మిట్ బాధ్యతలు స్వీకరించారు. ఈవెంట్ పోస్టర్‌ను ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ మినిస్టర్ ఆఫ్ కమర్షియల్ అఫైర్స్ జోనాథన్ హీమర్, యుఎస్ కాన్సులేట్ ప్రిన్సిపల్ కమర్షియల్ ఆఫీసర్ ఆండ్రూ ఎడ్లెఫ్‌సెన్ ఆవిష్కరించారు.

ఎయిరిండియాలో విస్తారా విలీనం

- సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా
- 2024 మార్చి కల్లా డీల్ పూర్తి
- టాటా గ్రూప్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీ ఏవియేషన్ మార్కెట్లో భారీ కన్సాలిడేషన్‌కు తెర తీస్తూ ఎయిరిండియాలో విస్తారాను విలీనం చేయనున్నట్లు టాటా గ్రూప్ మంగళవారం ప్రకటించింది. ఒప్పందం ప్రకారం ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా దక్కనుంది. ఈ డీల్ 2024 మార్చి నాటికి పూర్తి కాగలదని భావిస్తున్నారు. ప్రస్తుతం విస్తారాలో టాటా గ్రూప్‌నకు 51 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు (ఎస్‌ఐఏ) 49 శాతం వాటాలు ఉన్నాయి. ఈ కన్సాలిడేషన్‌తో దేశ, విదేశ రూట్లలో అత్యధికంగా సర్వీసులు నడిపిస్తున్న భారీ ఎయిర్‌లైన్స్‌గా ఎయిరిండియా ఆవిర్భవిస్తుందని టాటా గ్రూప్ తెలిపింది. అంతర్జాతీయ రూట్లకు సంబంధించి దేశీయంగా అతి పెద్ద సంస్థగాను, దేశీ రూట్లలో రెండో పెద్ద సంస్థగాను ఎయిరిండియా ఉంటుందని వివరించింది. విలీనానంతరం సంస్థ చేతిలో 218 విమానాలు ఉంటాయి. విలీన ఒప్పందం కింద ఎయిరిండియాలో రూ. 2,058.5 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఎస్‌ఐఏ తెలిపింది. తద్వారా తమకు ఎయిరిండియాలో 25.1 శాతం వాటా లభిస్తుందని, అలాగే అన్ని కీలక మార్కెట్ విభాగాల్లోనూ తమకు గణనీయంగా చోటు దక్కుతుందని పేర్కొంది.



కీలక మైలురాయి ..

ఎయిరిండియాను ప్రపంచ స్థాయి ఎయిర్‌లైన్‌గా తీర్చిదిద్దే క్రమంలో రెండు సంస్థల విలీనం కీలక మైలురాయి వంటిదని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. 'ఎయిరిండియా ఇటు నెట్‌వర్క్‌ను, అటు విమానాలను పెంచుకోవడంపై, కస్టమర్లకు అందించే సర్వీసులు మెరుగుపర్చుకోవడంపై, భద్రత.. విశ్వసనీయత.. సమయ పాలనను మెరుగుపర్చుకోవడంపై ప్రధానంగా దృష్టి పెడుతోంది' అని ఆయన చెప్పారు. టాటా గ్రూప్‌తో సంబంధాలను మరింత పటిష్టపర్చుకునేందుకు, దేశీ ఏవియేషన్ మార్కెట్ వృద్ధిలో పాలు పంచుకునేందుకు ఈ విలీనం చక్కని అవకాశం కాగలదని ఎస్‌ఐఏ సీఈవో గోహ్ చూన్ ఫోంగ్ తెలిపారు. విలీన ప్రక్రియ పూర్తయ్యే వరకు కార్యకలాపాలు యథాప్రకారం కొనసాగుతాయని విస్తారా సీఈవో వినోద్ కణ్ణన్ చెప్పారు. ఎయిరిండియా రూపాంతరం చెందే ప్రయత్నాలకు విలీన ఒప్పందం మరింత ఊతమివ్వగలదని సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు.

మరిన్ని పెట్టుబడులు ..

ఎయిరిండియా భారీ విస్తరణ, కార్యకలాపాల నిర్వహణ కోసం అవసరమైతే 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో ఎస్‌ఐఏ, టాటా సన్స్ మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నాయి. 'విలీనానంతరం మాకు ఉండే 25.1% వాటా ప్రకారం మేము అదనంగా రూ.5,020 కోట్ల వరకూ ఇన్వెస్ట్ చేయాల్సి రావచ్చు. విలీనం పూర్తయ్యాకే చెల్లించాల్సి ఉంటుంది' అని ఎస్‌ఐఏ తెలిపింది.

టాటా గ్రూప్‌లో నాలుగు ఎయిర్‌లైన్స్..

టాటా గ్రూప్‌లో ప్రస్తుతం ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్‌ఏషియా ఇండియా, విస్తారా అని నాలుగు విమానయాన సంస్థలు ఉన్నాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను ఈ ఏడాది జనవరిలోనే కొనుగోలు చేసింది. ఎయిర్‌ఏషియా ఇండియా 2014లో, విస్తారా 2015లో, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 2005లో కార్యకలాపాలు ప్రారంభించాయి. ప్రస్తుతం విస్తారా, ఎయిరిండియా దేశీయంగా అతి పెద్ద ఎయిర్‌లైన్స్ జాబితాలో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అక్టోబర్‌లో రెండింటి మార్కెట్ వాటా కలిపి 18.3 శాతంగా ఉంది. ఎయిర్ ఏషియాతో కలిపితే 25.9 శాతంగా ఉంది. ఎయిరిండియాలో విలీనంతో విస్తారా బ్రాండ్ కనుమరుగు కానున్నట్లు తెలుస్తోంది.

ఎనిమిదేళ్ల విస్తారా..

తాము స్థాపించిన ఎయిరిండియా.. ప్రభుత్వం చేతికి చేరాక, టాటా గ్రూప్ దశాబ్దాల పాటు తిరిగి విమానయాన రంగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నాలు కొనసాగించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించేందుకు 1994లో ప్రయత్నించినా కుదరలేదు. ఆరేళ్ల తర్వాత ఎయిరిండియాలో వాటాలు కొనుగోలు చేసి ఏవియేషన్‌లోకి ప్రవేశిద్దామనుకున్నా సాధ్యపడలేదు. చివరికి 2012లో ఏవియేషన్‌లో విదేశీ పెట్టుబడులపై పరిమితులను సడలించడంతో మళ్లీ ఎస్‌ఐఏతోనే జత కట్టి ఎట్టకేలకు 2015లో విస్తారా విమానయాన సంస్థను ఏర్పాటు చేసింది. తద్వారా విమానయాన మార్కెట్లోకి తిరిగి ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం విస్తారా దేశీ, విదేశీ రూట్లలో 41 ప్రాంతాలకు రోజూ 260 పైగా ఫ్లైట్లు నడుపుతోంది. 54 విమానాలు, దాదాపు 4,500 మంది ఉద్యోగులు ఉన్నారు.

ఏఏఏఐ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్ కుమార్



ప్రశాంత్ కుమార్ | కే శ్రీనివాస్

హైదరాబాద్: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) ప్రెసిడెంట్‌గా 'గ్రూప్‌ఎం మీడియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ దక్షిణాసియా సీఈవో ప్రశాంత్ కుమార్ ఎన్నికయ్యారు. ఏఏఏఐ ఏజీఎంలో ఈ ఎన్నిక జరిగింది. 2022–23 ఏడాదికి గాను ఏఏఏఐ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్ కుమార్ సేవలు అందించనున్నారు. అలాగే, హవాస్ గ్రూప్ ఇండియా సీఈవో రాణా బరువా ఏఏఏఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ప్రెసిడెంట్‌గా పనిచేసిన అనుప్రియా ఆచార్య ఏఏఏఐ బోర్డులో ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ఏడాది పాటు సేవలు అందించనున్నారు. విషన్ దాస హర్దాసాని (మ్యాట్రిక్స్ పబ్లిసిటీస్), కునాల్ లలాని (క్రేయాన్స్ అడ్వర్టైజింగ్), రోహన్ మెహతా (కినెక్ట్ ప్రైవేటు లిమిటెడ్), చంద్రమౌళి ముత్తు (మైత్రి అడ్వర్టైజింగ్), శ్రీధర్ రామసుబ్రమణియన్ (బీహైవ్ కమ్యూనికేషన్స్), శశిధర్ సిన్హా (ఇనీషియేటివ్ మీడియా), కే శ్రీనివాస్ (శ్లోకా అడ్వర్టైజింగ్, ఎండీ–సీఈవో), వివేక్ శ్రీవాస్తవ (ఇన్నోసియన్ వరల్డ్‌వైడ్ కమ్యూనికేషన్స్) సభ్యులుగా ఎన్నికైనట్లు ఏఏఏఐ ఓ ప్రకటనలో తెలిపింది.

డిసెంబర్ 1 నుండి రిటైల్ డిజిటల్ రూపాయి

- నాలుగు నగరాల్లో పైలట్ ప్రాజెక్టు
- తర్వాత హైదరాబాద్ సహా 9 నగరాలకు విస్తరణ: ఆర్‌బీఐ



ముంబై: హోల్‌సేల్ లావాదేవీల కోసం డిజిటల్ రూపాయిని ప్రవేశపెట్టిన దాదాపు నెల రోజులకు రిటైల్ యూజర్ల కోసం కూడా రిజర్వ్ బ్యాంక్ ఈ–రూపీని అందుబాటులోకి తెస్తోంది. తొలి దశలో డిసెంబర్ 1 నుండి 4 నగరాల్లో రిటైల్ డిజిటల్ రూపీని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ మంగళవారం తెలిపింది. ముంబై, న్యూఢిల్లీ, బెంగళూరు, భువనేశ్వర్ ఈ జాబితాలో ఉన్నాయి. వీటి తర్వాత హైదరాబాద్‌తో పాటు మరో తొమ్మిది నగరాల్లో ఈ–రూపీని అందుబాటులోకి తేనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ముందుగా ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో, పరిమిత స్థాయిలో యూజర్లకు దీన్ని అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొంది. బ్యాంకుల మధ్య టోకు లావాదేవీల కోసం రిజర్వ్ బ్యాంక్ ఈ–రూపీని తొలిసారిగా నవంబర్ 1న ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. 'ఇది చట్టబద్ధంగా చెల్లుబాటయ్యే డిజిటల్ టోకెన్ రూపంలో ఉంటుంది. పేపర్ కరెన్సీ, నాణేల డినామినేషన్‌లో మధ్యవర్తి సంస్థల (బ్యాంకుల) ద్వారా పంపిణీ అవుతాయి' అని ఆర్‌బీఐ పేర్కొంది. యూజర్లు తమ మొబైల్స్, డివైజ్‌లలో డిజిటల్ వాలెట్ల ద్వారా డిజిటల్ రూపీని భద్రపర్చుకోవచ్చని, ఆ వాలెట్ల ద్వారా చెల్లింపు లావాదేవీలను నిర్వహించవచ్చని పేర్కొంది.

పాత కార్ల విక్రయాల్లోకి కియా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కియా సీపీవో పేరుతో సర్టిఫైడ్ ప్రీ–ఓన్డ్ కార్ల వ్యాపారంలోకి వాహన తయారీ సంస్థ కియా ఇండియా ఎంట్రీ ఇచ్చింది. హైదరాబాద్‌సహా 14 నగరాల్లో 15 ఔట్‌లెట్లను తెరిచింది. ఈ కేంద్రాల్లో యాజమాన్య బదిలీ, కస్టమర్లకు అనుకూలంగా రుణ సౌకర్యంతో వినియోగదార్లు తమ పాత కార్ల విక్రయం, కొనుగోలు లేదా మార్పిడి చేసుకోవచ్చు. డిసెంబర్ నాటికి 30 ఔట్‌లెట్లను ప్రారంభిస్తామని కంపెనీ చీఫ్ సేల్స్ ఆఫీసర్ మైన్ సి సోన్ తెలిపారు.



కొనసాగిన రికార్డుల ర్యాలీ

63 వేలకు చేరువలో సెన్సెక్స్

ముంబై: వరుసగా ఆరో రోజూ లాభాలు కొనసాగడంతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ మంగళవారమూ కొనసాగింది. ఐటీ, మెటల్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల రాణించడంతో సెన్సెక్స్ 177 పాయింట్లు పెరిగి 62,682 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 383 పాయింట్లు బలపడి 62,887 వద్ద తాజా జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 55 పాయింట్లు ర్యాలీ చేసి 18,600 స్థాయిపైన 18,618 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 115 పాయింట్లు దూసుకెళ్లి 18,678 వద్ద సరికొత్త శిఖరాన్ని తాకింది. సెప్టెంబర్ క్వార్టర్ జీడీపీ డేటా విడుదల (నేడు) నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా సూచీలు పరిమిత స్థాయిలో ట్రేడయ్యాయి. రియల్టీ, ఆటో, ప్రభుత్వ రంగ బ్యాంక్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చైనాలో కోవిడ్ లాక్‌డౌన్ ఆంక్షల సడలింపుతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లోంచి తేరుకొని లాభాల బాటపట్టాయి. విదేశీ ఇన్వెస్టర్లు నికర కొనుగోలుదారులుగా కొనసాగుతున్నారు.



- గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకోవచ్చనే అంచనాలతో ఎఫ్ఎంసీజీ షేర్లు భారీ ర్యాలీ చేశాయి. డాబర్, హెచ్‌యూఎల్, మారికో, జీసీపీఎల్ షేర్లు 6 నుంచి 2.5% పెరిగాయి.

భవిత

జాబ్ పాయింట్

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్-6511 పోలీస్ ఉద్యోగాలు

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్.. మొత్తం 6511 పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 411 సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులు కాగా.. 6100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 6511(ఎస్‌ఐ–411, కానిస్టేబుల్ 6100)

అర్హతలు

» ఎస్‌ఐ పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 2022, జూలై1వ తేదీ నాటికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతోపాటు డిగ్రీ చదివి ఉండాలి. **వయసు:** 21–27ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోసడలింపు లభిస్తుంది.

» కానిస్టేబుల్ పోస్టులకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు హాజరై ఉండాలి. **వయసు:** 18–24ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోసడలింపు లభిస్తుంది.

» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెయిన్ పరీక్షల్లో మెరిట్ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

ముఖ్య తేదీలు

» **కానిస్టేబుల్ దరఖాస్తులకు చివరి తేది:** 28.12.2022

» **ఎస్‌ఐ దరఖాస్తు తేదీలు:** 14.12.2022 నుంచి 18.01.2023 వరకూ

» **పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 22.01.2023

» **ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 19.02.2023

» **వెబ్‌సైట్:** https://slprb.ap.gov.in

ఇండియన్ నేవీలో 1400 అగ్నివీర్ పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్(సీనియర్ సెకండరీ రిక్రూట్) ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది. దీనికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1400

» **అర్హత:** మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కెమిస్ట్రీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్‌లో ఏదో ఒక సబ్జెక్టుతో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 01.05.2002 నుంచి 31.10.2005 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.

» **కనిష్ట ఎత్తు ప్రమాణాలు:** పురుషులు 157 సెం.మీ, స్త్రీలు 152 సెం.మీ. ఉండాలి.

» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష(సీబీఈ), రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **శిక్షణ:** అగ్నివీర్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్‌ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది మేలో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.35,000, నాలుగో ఏడాది రూ.40,000 ఉంటుంది.

» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లిష్ భాషల్లో మొత్తం 100 బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమేటిక్స్, జనరల్ అవేర్‌నెస్.. నాలుగు విభాగాల్లో ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.

» **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 08.12.2022

» **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు చివరితేది:** 17.12.2022

» **శిక్షణ ప్రారంభం:** 2023 మే నెలలో

» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

నైపిడ్, సికింద్రాబాద్‌లో 31 ఉద్యోగాలు

సికింద్రాబాద్‌లోని నైపిడ్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజబిలిటీస్(దివ్యాంగజన్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31

» **పోస్టుల వివరాలు:** లెక్చరర్, రిహాబిలిటేషన్ థెరపిస్ట్, జూనియర్ అకౌంటెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, క్లర్క్ తదితరాలు.

» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2/ఎస్‌ఎస్‌ఎల్‌సీ/ఎంబీబీఎస్/బ్యాచిలర్స్ డిగ్రీ/బీకామ్/బీఈడీ/బీఆర్‌ఎస్/ఎండీ/ఎంఈడీ/పీజీ డిప్లొమా/మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.22,000 నుంచి రూ.70,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ/రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఎన్‌ఐఈపీఐడీ, మనోవికాస్ నగర్, సికింద్రాబాద్–500009 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 07.12.2022.

» **వెబ్‌సైట్:** niepid.nic.in

'సమకాలీనం'పై పట్టు.. సక్సెస్‌కు తొలి మెట్టు!

కరెంట్ అఫైర్స్.. లేదా సమకాలీన అంశాలు.. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో సుపరిచితమైన విభాగం! సివిల్స్, గ్రూప్1, గ్రూప్ 2, గ్రూప్ 3, పోలీస్, బ్యాంకింగ్ మొదలు గ్రూప్ 4 వరకూ.. అన్ని ఉద్యోగ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ కీలకంగా మారుతోంది. ఆయా పోటీ పరీక్షల్లో.. కోర్ అంశాల కలయికతో కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పోలీస్, గ్రూప్స్ పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ కొనసాగుతున్న సంగతి తెలిసిందే!! ఈ నేపథ్యంలో.. గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ ప్రాధాన్యం, వాటిపై పట్టు సాధించడమెలాగో తెలుసుకుందాం..



» ఉద్యోగ నియామక పరీక్షల్లో కీలకంగా మారుతున్న కరెంట్ అఫైర్స్

» గ్రూప్–1 మొదలు గ్రూప్–4 వరకు కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం

» ముఖ్య అంశాల గుర్తింపే కీలకం అంటున్న సబ్జెక్ట్ నిపుణులు

కరెంట్ అఫైర్స్.. తన చుట్టూ జరుగుతున్న పరిణామాలపై అభ్యర్థులకున్న అవగాహన తెలుసుకునేందుకు ఉద్దేశించిన విభాగం ఇది. గ్రూప్–1 నుంచి గ్రూప్–4 వరకూ..అదే విధంగా సివిల్ సర్వీసెస్, ఎస్ఎస్‌సీ సీజీఎల్, సీహెచ్‌ఎస్‌ఎల్ వంటి పోటీ పరీక్షల్లో దాదాపు 30 నుంచి 40 శాతం మేరకు కరెంట్ అఫైర్స్ సంబంధిత ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించాలనుకునే వారికి సామాజిక, సమకాలీన పరిణామాలపై ఉన్న అవగాహనను పరీక్షించేందుకు ఉద్దేశించిన విభాగమే కరెంట్ అఫైర్స్ అంటున్నారు నిపుణులు.

కోర్ + సమకాలీనం

కొంతకాలంగా కరెంట్ అఫైర్స్ నుంచి అడుగుతున్న ప్రశ్నల తీరు మారుతోంది. నేరుగా కరెంట్ అఫైర్స్ సంబంధిత ప్రశ్నలు మాత్రమే కాకుండా.. కోర్ అంశాలతో సమ్మిళితం చేస్తూ కూడా అధిక సంఖ్యలో ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో కొత్త బిల్లులు లేదా ఆర్డినెన్స్‌లు తెస్తున్న విషయం తెలిసిందే. సదరు బిల్లులకు సంబంధించి సమకాలీన పరిణామం, దాని నేపథ్యం,బిల్లు ప్రవేశపెట్టేందుకు దారితీసిన పరిస్థితుల గురించి తెలిస్తేనే.. సమాధానం ఇవ్వగలిగేలా కరెంట్ అఫైర్స్ విభాగం నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు తాజా పరిణామాలతోపాటు కోర్ సబ్జెక్ట్‌లోని మూల భావనలపైనా అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

విస్తృత విభాగం

కరెంట్ అఫైర్స్ అనేది ఒక సముద్రం లాంటిది. ప్రతి రోజు ఎన్నో కొత్త పరిణామాలు సంభవిస్తుంటాయి. జాతీయం,అంతర్జాతీయం,సైన్స్, స్పోర్ట్స్.. ఇలా ఏ విభాగాన్ని తీసుకున్నా.. ప్రతిరోజు అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో పరీక్షల కోణంలో ముఖ్యమైనది ఏదో గుర్తించడం ఎలా.. అనే ప్రశ్న అభ్యర్థులకు ఎదురవుతోంది. ఇలాంటి అభ్యర్థులు విస్తృత ప్రాధాన్యం, ఎక్కువ ప్రభావం చూపే సంఘటనలపై అధికంగా దృష్టి కేంద్రీకరించాలి. జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతీయ సంఘటనలను పరిగణనలోకి తీసుకోవాలి. నిర్దేశిత అంశం నేపథ్యాన్ని పరిశీలించాలి. అలాగే ఆర్థిక, సామాజిక,విద్య, పరిపాలన ప్రాధాన్యం కలిగిన జాతీయ అంశాలను ముఖ్యమైనవిగా పరిగణించాలి.

అంతర్జాతీయ అంశాలు

అంతర్జాతీయ పరిణామాల్లో ప్రతి అంశాన్ని చదవాల్సిన అవసరం లేదు. ముఖ్యమైన వాటిపై దృష్టి పెడితే సరిపోతుంది. ఉదాహరణకు.. సదస్సులు, సమావేశాలకు సంబంధించి ప్రతిదానికి తేదీలు గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు. ఆయా సదస్సుల్లో విడుదల చేసిన డిక్లరేషన్లను, 'వాటి థీమ్'ను నోట్ చేసుకోవాలి. అదే విధంగా ఆయా సదస్సుల నిర్వహణ ఉద్దేశం తెలుసుకోవాలి.

మన దేశానికి, ఇతర దేశాలకు మధ్య ఇటీవల కాలంలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలు, ఒప్పందాలకు అభ్యర్థులు ప్రాధాన్యం ఇవ్వాలి. వీటితో మన దేశానికి ఒనగూరే ప్రయోజనాలు, అంతర్జాతీయంగా లభించే గుర్తింపు వంటి అంశాలను తెలుసుకోవాలి. వాస్తవానికి కరెంట్ అఫైర్స్ విభాగంలో..'జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలు' అని సిలబస్‌లో పేర్కొంటున్నారు. ఆ 'ప్రాధాన్యం' ఉన్న అంశాలను గుర్తించే నేర్పును అభ్యర్థులు సొంతం చేసుకోవాలి. అంతర్జాతీయంగా, జాతీయంగా జరిగే ప్రతి సమావేశాన్ని, లేదా సంఘటనను చదువుకుంటూ వెళ్లకుండా.. అవి చూపే ప్రభావం, వాటి ప్రయోజనం, ఉద్దేశం ఆధారంగా ప్రాధాన్యం ఇవ్వాలి.

నివేదికలు, గణాంకాలు

తాజాగా విడుదలయ్యే నివేదికలు,గణాంకాలకు సంబంధించి ప్రాంతీయ ప్రాధాన్యమున్న అంశాలపై ముందుగా దృష్టిపెట్టాలి. తర్వాత ఆ నివేదికలను విడుదల చేసిన సందర్భాన్ని గుర్తించాలి. ఉదాహరణకు..కోవిడ్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదికల్లో.. మహమ్మారి కారణంగా మన దేశంపై పడిన ప్రభావం, జీవనోపాధి, వలస కూలీల పరిస్థితులు, వ్యాక్సినేషన్ వంటి కీలక అంశాలను చదివితే సరిపోతుంది. ఇలా చదివే సమయంలో సంబంధిత గణాంకాలను నోట్స్‌లో రాసుకోవాలి. ఇది ప్రిపరేషన్ చివర్లో, పరీక్షకు ముందు రివిజన్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

కాల పరిమితి

పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి అంతకుముందు ఏడాది కాలంలోని అన్ని ముఖ్య పరిణామాలపై పట్టు సాధించాలని పోటీ పరీక్షల నిపుణులు సూచిస్తున్నారు. ఉదాహరణకు వచ్చే ఏడాది జనవరి 8న నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం అభ్యర్థులు ఈ ఏడాది డిసెంబర్ 15 నుంచి అంతకుముందు ఏడాది కాలంలోని పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని చెబుతున్నారు.

పుస్తకాల ఎంపిక

కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్‌లో పుస్తకాల ఎంపిక కూడా కీలకంగా నిలుస్తోంది. వాస్తవానికి ప్రస్తుతం కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి విస్తృతమైన మెటీరియల్ మార్కెట్లో అందుబాటులో ఉంది. అది కొత్త అభ్యర్థులను ఆందోళనకు గురి చేయడం సహజం. కాబట్టి అభ్యర్థులు గత కొన్నేళ్ల ప్రశ్నపత్రాలను పరిశీలించి.. ట్రెండ్ తెలుసుకోవాలి. దీనికి అనుగుణంగా సమకాలీన పరిణామాలున్న పుస్తకాలను ఎంచుకోవాలి.

చదవడమూ భిన్నంగా

ప్రామాణిక పుస్తకాలను సేకరించాక.. ఆయా కరెంట్ టాపిక్స్‌ను చదవడంలోనూ విభిన్నంగా వ్యవహరించాలి. చాలామంది అభ్యర్థులు సదరు అంశాలను మూసధోరణితో, నవలగానో లేదా కథగానో చదువుకుంటూ ముందుకు వెళతారు. దీని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఒక అంశం చదవడం ప్రారంభించినప్పుడే.. ఆ టాపిక్ ఉద్దేశం, ప్రాధాన్యతల గురించి తెలుసుకోవాలి. ముఖ్యాంశాలను, ఘట్టాలను, కీలక తేదీలను షార్ట్ నోట్స్‌లో రాసుకోవాలి. దాన్ని తరచూ రివైజ్ చేస్తుండాలి.

పేపర్ రీడింగ్.. ప్రత్యేక పద్ధతి

కరెంట్ అఫైర్స్ విషయంలో ఎక్కువ మంది అభ్యర్థులు దినపత్రికలపై ఆధారపడుతుంటారు. ప్రతి రోజు పేపర్ చదువుతూ ముఖ్య సంఘటనల గురించి అవగాహనకు ప్రయత్నిస్తుంటారు. పేపర్ రీడింగ్ విషయంలోనూ ప్రత్యేక దృక్పథంతో వ్యవహరించాలి.సమకాలీన అంశాలపై ప్రచురితమయ్యే ఎడిటోరియల్స్, ఇతర ముఖ్యమైన వ్యాసాలు చదివేటప్పుడు వాటి ఉద్దేశాన్ని గుర్తించాలి. ఆ తర్వాత వాటి సారాంశాన్ని ముఖ్యమైన పాయింట్ల రూపంలో నోట్స్‌లో రాసుకోవాలి. ముఖ్యమైన పాయింట్లను గుర్తించే నైపుణ్యం పెంచుకోవాలి.

సొంత నోట్స్

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ముఖ్య సంఘటనలను సొంత నోట్స్‌లో రాసుకోవాలి. ఒక టాపిక్‌కు సంబంధించిన ముఖ్యాంశాలను రాసుకునే క్రమంలో..భవిష్యత్తుల్లో పునశ్చరణకు ఉపయోగపడేలా రూపొందించుకోవాలి. పుస్తకంలో లేదా న్యూస్ పేపర్స్‌లో కనిపించే సమాచారం మొత్తాన్ని నోట్స్‌లో పొందుపర్చకుండా.. వాటికున్న ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుని సంక్షిప్తంగా రాసుకోవాలి.

మెమొరీ టెక్నిక్స్

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. మెమొరీ టెక్నిక్స్‌ను పాటించడం. ప్రతి అభ్యర్థికి తనకంటూ సొంత మెమొరీ టెక్నిక్స్ ఉంటాయి. కొందరు విజువలైజేషన్ టెక్నిక్స్, కొందరు మైండ్ మ్యాపింగ్(మనసులోనే ఆయా అంశాలను ముద్రించుకునే విధానం) వంటివి అనుసరిస్తారు. మరికొందరికి ఆయా అంశాలను టేబుల్స్, గ్రాఫ్స్‌లో రూపంలో రాసుకుని సులువుగా జ్ఞప్తికి తెచ్చుకునే లక్షణం ఉంటుంది. అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉండే విధానాన్ని ఆచరణలో పెట్టాలి. ఇలా.. సమకాలీన ప్రాధాన్యం ఉన్న అంశాలు,కోర్ టాపిక్స్‌తో అనుసంధానం, మంచి పుస్తకాల ఎంపిక, పేపర్ రీడింగ్ వరకూ.. అడుగడుగునా శాస్త్రీయంగా ప్రిపరేషన్ సాగిస్తే ఈ విభాగంలో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

పోటీ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్.. ముఖ్యాంశాలు

- ప్రతి పోటీ పరీక్షలోనూ కీలక విభాగంగా కరెంట్ అఫైర్స్. • దాదాపు అన్ని పరీక్షల్లోనూ 30 నుంచి 40 శాతం వెయిటేజీ.
- ఆయా పరిణామాలపై నోట్స్, కాన్సెప్ట్స్ అప్రోచ్‌తో పట్టు సాధించే అవకాశం.
- కోర్ అంశాలతో సమన్వయం చేసుకుంటూ చదవాల్సిన ఆవశ్యకత.
- న్యూస్ పేపర్ రీడింగ్, ఎడిటోరియల్స్ చదవడం ఎంతో ప్రధానం.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 249

బుధవారం 30-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



20 ఏళ్ల తర్వాత..

ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించిన సెనెగల్ - 11లో



పోర్చుగల్ ముందుకు..

వరుసగా రెండో విజయంతో ప్రీక్వార్టర్ ఫైనల్లోకి రొనాల్డో జట్టు - 11లో



సరిహద్దు వెంట డ్రోన్ల కలకలం

డ్రోన్ల ద్వారా డ్రగ్స్ సరఫరాకు యత్నించిన పాక్ కుట్రను భారత సైన్యం భగ్నం చేసింది. సరిహద్దు వెంట 2 పాక్ డ్రోన్లను కూల్చేసింది.

వివరాలు 6లో



స్వేచ్ఛా వాణిజ్యానికి సై

భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుకు కట్టుబడి ఉన్నట్లు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ పునరుద్ఘాటించారు.


వివరాలు 6లో



ఢిల్లీలో డేంజర్ బెల్స్

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రజలను కలవరపెడుతోంది. నగరంలో వాయు నాణ్యత వేగంగా క్షీణిస్తోంది.

వివరాలు 6లో



షర్మిల అరెస్టు.. బెయిల్

టీఆర్ఎస్ దాడిని నిరసిస్తూ ప్రగతి భవన్ ముట్టడికి యత్నించిన వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలను పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 12లో

న్యూస్‌రీల్

ఏపీలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో వైద్యం



పేదలకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మెరుగైన, ఆధునిక వైద్యాన్ని చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారని.. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఏపీలో 16 చోట్ల హెల్త్ హబ్‌లు ఏర్పాటు చేయాలని, వీటిలో 50 శాతం పడకలను ఆరోగ్యశ్రీ పథకానికి కేటాయిస్తున్నట్టు వెల్లడించారు.

వివరాలు 3లో ▸

రేపటి నుంచి మోస్తరు వర్షాలు!



రాష్ట్రంలో దిగువస్థాయి నుంచి వీస్తున్న ఈశాన్య, తూర్పు గాలుల ప్రభావంతో రానున్న గురువారం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. డిసెంబర్‌లో అండమాన్‌లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

వివరాలు 12లో ▸

టీచర్లు.. టీచింగ్‌కే

గురువుల సేవలు ఇక పూర్తిగా విద్యకే పరిమితం

విద్యేతర కార్యక్రమాల నుంచి మినహాయింపు

- అత్యుత్తమ బోధన దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం
- జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యాశాఖ ఉత్తర్వులు
- విద్యా సంస్కరణలతో మూడేళ్లుగా మారిపోయిన పరిస్థితులు
- విద్యాదీవెన, విద్యా కానుక, అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియంతో చదువులకు సర్కారు భరోసా
- నాడు–నేడు స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పీఎంశ్రీ పాఠశాలల ఏర్పాటు
- ఫౌండేషనల్ స్కూళ్ల విధానంతో సమగ్ర విద్యా విధానం.. 3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లతో బోధన
- 3,726 మంది మిగులు టీచర్ల మ్యాపింగ్ హైస్కూళ్లకు సర్దుబాటు
- కర్నూలు జిల్లాకు కొత్తగా 1,876 పోస్టుల మంజూరు
- తమను విద్యేతర కార్యక్రమాల నుంచి మినహాయించాలని దీర్ఘకాలంగా కోరుతున్న టీచర్లు



సాక్షి, అమరావతి: విద్యారంగ సంస్కరణలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇటు విద్యార్థులకు అటు ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనం చేకూర్చేలా మరో కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల సమగ్ర పురోభివృద్ధికి వీలుగా ప్రభుత్వ టీచర్లకు విద్యేతర కార్యక్రమాలను అప్పగించరాదని నిర్ణయించింది. ఈమేరకు ఉపాధ్యాయులను పూర్తిగా విద్యా కార్యక్రమాలకే పరిమితం చేస్తూ పాఠశాల విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ఉపాధ్యాయులను విద్యేతర కార్యక్రమాల నుంచి తప్పిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ (పాఠశాల విద్య) జీవో 185 జారీ చేశారు. రాష్ట్ర ఉచిత, నిర్బంధ విద్యా హక్కు 2010 చట్టాన్ని సవరిస్తూ ఈ ఉత్తర్వులు వెలువరించారు. తాజా ఉత్తర్వులతో బోధనాభ్యసన ప్రక్రియ, విద్యా సంబంధిత కార్యక్రమాలు సమగ్రంగా కొనసాగి విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. స్కూళ్లలో బోధనేతర కార్యక్రమాల బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాల సంక్షేమ, విద్యా అసిస్టెంట్లకు ఇప్పటికే అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.34 లక్షల మంది సచివాలయాల ఉద్యోగులను నియమించిన

మిగతా 2వ పేజీలో ▶

461 స్టాఫ్ నర్సు పోస్టులకు నోటిఫికేషన్

- దరఖాస్తుల సమర్పణకు డిసెంబర్ 6 వరకు గడువు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఇప్పటికే వైద్య శాఖలో 46 వేలకు పైగా పోస్టులు భర్తీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



- వివరాలు 2లో

నేడు జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల

- మదనపల్లెలో నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్
- జూలై–సెప్టెంబర్ త్రైమాసికం నిధుల విడుదల
- 11.02 లక్షల మంది విద్యార్థులకు రూ.694 కోట్ల మేర ప్రయోజనం
- ఇప్పటివరకు విద్యా, వసతి దీవెన పథకాల కింద రూ.12,401 కోట్లు

2లో

కొత్త సీఎస్‌గా జవహర్ రెడ్డి

నేటి సాయంత్రం బాధ్యతల స్వీకారం



- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌తోపాటు సీఎం ముఖ్య కార్యనిర్వాహకునిగా డాక్టర్ సమీర్‌శర్మ
- రాష్ట్ర డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా విజయకుమార్.. సీఎం ప్రత్యేక సీఎస్‌గా పూనం మాలకొండయ్య
- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రవీణ్ ప్రకాశ్..
- రహదారులు–భవనాలు, రవాణా శాఖ కార్యదర్శిగా ప్రద్యుమ్న
- పలువురు ఐఏఎస్ అధికారులూ బదిలీ

2లో

వివేకా హత్యకేసు విచారణ తెలంగాణకు బదిలీ

సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు విచారణను తెలంగాణకు బదిలీ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. సంబంధిత పత్రాలు, చార్జిషీటు, అనుబంధ చార్జిషీటు హైదరాబాద్ సీబీఐ కోర్టుకు బదిలీ అవుతాయని, సీబీఐ దర్యాప్తు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా త్వరగా పూర్తిచేయాలని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. పిటిషనర్లు మృతుడి కుమార్తె, భార్య అయినందున విచారణ నిష్పక్షపాతంగా జరగాలని కోరుకోవడం వారి ప్రాథమిక హక్కు అని, ఈ నేపథ్యంలో ఇది ఏపీ నుంచి వేరే రాష్ట్రానికి బదిలీ చేయదగిన కేసుగా భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

ప్రజల ఆకాంక్షల మేరకే వికేంద్రీకరణ



- ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే సుప్రీంకోర్టు ఉత్తర్వులు
- ఈ ఉత్తర్వులపై నోరు మెదపని చంద్రబాబు, టీడీపీ నేతలు
- సుప్రీంకోర్టు ఉత్తర్వులను వక్రీకరించిన పచ్చ పత్రికలు
- టీడీపీని నడుపుతున్నది బాబు కాదు.. పచ్చపత్రికలే
- సుప్రీం కోర్టు ఇచ్చే తుది తీర్పుకు లోబడి మూడు రాజధానుల చట్టం తెస్తాం
- అమరావతికి భూములు ఇచ్చిన ఒక్క రైతుకూ అన్యాయం చేయం
- వివేకా హత్య కేసులో నిందితులెవరో తేల్చి.. కఠినంగా శిక్షించాలనే మేం కోరుకుంటున్నాం
- వివేకా కుటుంబ సభ్యులను బాబు లొంగదీసుకున్నారు
- మాపై నిందలు మోపేందుకు కుట్రలు పన్నారు
- ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల

3లో

క్లుప్తంగా

4న విశాఖకు ఉప రాష్ట్రపతి



సాక్షి, విశాఖపట్నం: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ డిసెంబర్ 4వ తేదీన విశాఖలో పర్యటించనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు 4వ తేదీ సాయంత్రం ఆర్కే బీచ్‌లో నిర్వహించే నేవీ డే విన్యాసాల్ని తిలకిస్తారు. అనంతరం సంప్రదాయంగా నిర్వహించే 'టీ' పార్టీలో పాల్గొంటారు. అక్కడి నుంచి ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. ఆ తర్వాత ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్తారు.

జపాన్ ఎంయూఎఫ్‌జీ బ్యాంక్‌తో ఎంవోయూ

సాక్షి, అమరావతి: జపాన్, తూర్పు ఆసియా దేశాల కంపెనీల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్‌కు ఆకర్షించడంలో భాగంగా ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ) మంగళవారం జపాన్‌కు చెందిన ఎంయూఎఫ్‌జీ బ్యాంక్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ప్రపంచంలోని అతి పెద్ద బ్యాంకుల్లో జపాన్ ఎంయూఎఫ్‌జీ ఒకటిగా ఉంది. జపాన్‌తో పాటు ఇతర దేశాల్లో 40 కార్యాలయాలున్నాయి. జపానిస్ కంపెనీల పెట్టుబడులు ఏపీలో ఆపరేట్ చేసేందుకు జపాన్ ఎంయూఎఫ్‌జీ బ్యాంకు సహకారం అందిస్తుంది. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్, ఫార్మాస్యూటికల్, లాజిస్టిక్ రంగాల్లో వాణిజ్య ప్రమోషన్, పెట్టుబడులు సమీకరించడానికి ఏపీఈడీబీ, జపాన్ ఎంయూఎఫ్‌జీ బ్యాంకు కలిసి పనిచేస్తాయి. అవగాహన ఒప్పందంపై ఏపీఈడీబీ సీఈవో జి.సుజన, ఇండియా ఎంయూఎఫ్‌జీ హెడ్ కెనిచిరో కవాసే సంతకాలు చేశారు.

'విద్యేతర విధుల నిర్ణయం'పై హర్షం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులను విద్యేతర విధులలో నియమించకుండా ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని ఏపీ ఎస్టీయూ అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరహరి, ఎన్వీ రమణయ్య, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ మంగళవారం పేర్కొన్నారు. బోధనేతర పనులకు ఇతర సిబ్బందిని ప్రభుత్వం నియమిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

స్కూళ్ల రికార్డుల్లో మార్పులకు అనుమతిలేదు

సాక్షి, అమరావతి: పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన పలు వివరాలను రికార్డుల్లో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మార్పు చేయడానికి వీల్లేదని పాఠశాల విద్యాశాఖ అన్ని స్కూళ్ల హెడ్మాస్టర్లకు ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసింది. పాఠశాలల్లోని విద్యార్థుల పేర్లు, ఇతర వివరాలను రికార్డుల్లో నమోదు చేసిన అనంతరం కొన్ని చోట్ల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా మార్పులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అందులో పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారి, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల అనుమతి ఉంటేనే రికార్డుల్లోని వివరాలను సవరించాల్సి ఉంటుందని పేర్కొంది.

607 పోస్టులకు రోస్టర్ పాయింట్ల మార్పు

సాక్షి, అమరావతి: పరిమిత నియామకం చేపట్టినప్పటికీ అభ్యర్థులు లభించక మిగిలిపోయిన 607 పోస్టులకు వైద్యశాఖ రోస్టర్ పాయింట్లు మార్చింది. ఈమేరకు మంగళవారం వైద్యశాఖ కార్యదర్శి నవీన్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వీటిలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు 563, అనస్తీసియా, ఈసీజీ టెక్నీషియన్, ఈఎంటీ వంటి ఇతర పోస్టులు 44 ఉన్నాయి.

వనరుల సద్వినియోగం

2023 - 24 బడ్జెట్ ప్రతిపాదనలపై కసరత్తు

- 12లోగా ఆన్‌లైన్‌లో పంపాలని ఆర్థిక శాఖ మార్గదర్శకాలు
- నేడు అన్ని శాఖల ఉన్నతాధికారులతో ప్రాథమిక సమావేశం
- ప్రాథమిక సదుపాయాల కల్పనకు పెద్దపీట
- ఇళ్లు, తాగునీరు, విద్య, ఆరోగ్యం, రోడ్లు, రవాణా రంగాలకు ప్రాధాన్యం
- పారిశ్రామికీకరణ లక్ష్యాలను సాధించేలా మూలధన వ్యయం
- నవరత్నాల పథకాలకు తగినన్ని నిధుల కేటాయింపు
- మహిళలు, పిల్లల కోసం చేపట్టిన పథకాలకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు
- జీతాలేతర వ్యయాల్లో 20 శాతం ఆదా చేసేలా ప్రతిపాదనలు



సాక్షి, అమరావతి: అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టేలా 2023 - 24 ఆర్థిక ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్థిక శాఖ అన్ని శాఖలకు సూచించింది. ప్రాథమిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు, తాగునీరు, విద్య, ఆరోగ్యం, రహదారులు, రవాణా రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందిస్తోందని తెలిపింది. ఈ నేపథ్యంలో బడ్జెట్ ప్రతిపాదనలు అందుకు అనుగుణంగా ఉండాలని సూచించింది. వేగంగా పారిశ్రామీకరణ ద్వారా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచి లక్ష్యాలను సాధించేలా క్యాపిటల్ వ్యయం ప్రతిపాదనలు ఉండాలని పేర్కొంది. 2022-23 బడ్జెట్ అంచనాల సవరణ ప్రతిపాదనలను వాస్తవికంగా రూపొందించాలని సూచించింది. ఈమేరకు ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు సమర్పించేందుకు మార్గదర్శకాలతో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాధిపతులు, బడ్జెట్ అంచనాల అధికారులు బడ్జెట్ ప్రతిపాదనల అంచనాలను డిసెంబర్ 10లోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. సంబంధిత శాఖల కార్యదర్శులు తమ అభిప్రాయాలను జోడించి డిసెంబర్ 12లోగా ఆర్థికశాఖకు ఆన్‌లైన్‌లో పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2023 - 24 బడ్జెట్ అంచనాల రూపకల్పనకు సంబంధించి ఆర్థిక శాఖ బుధవారం అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ప్రాథమిక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

మార్గదర్శకాలు ఇవీ

- నవ రత్నాలు, కేంద్ర పథకాలకు తగినన్ని నిధులు కేటాయింపులు ఉండేలా బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలి. నవరత్నాల పథకాల వారీగా శాఖాధిపతులు ఆన్‌లైన్‌లో నమూనా పత్రంలో బడ్జెట్ అంచనా ప్రతిపాదనలు చేయాలి. మేనిఫెస్టోలోని పథకాల అమలు వివరాలతో బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలను చేయాలి. సామాజిక పెన్షన్లు, సబ్సిడీలకు తగినన్ని నిధులు ప్రతిపాదించాలి.
- కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్ర అభివృద్ధి పథకాలు, విదేశీ సాయంతో అమలు చేస్తున్న పథకాల వివరాలను ఆన్‌లైన్‌లో సంబంధిత పద్దుల్లో బడ్జెట్ కేటాయింపులను ప్రతిపాదించాలి.
- బడ్జెట్ అంచనా ప్రతిపాదనలు వాస్తవిక వ్యయం, అవసరాల ఆధారంగా ఉండేలా తగిన కసరత్తు చేయాలి. ఊహాజనితంగా, వాస్తవికతకు దూరంగా ప్రతిపాదనలు ఉండకూడదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలు, వచ్చే ఆర్థిక ఏడాది బడ్జెట్ ప్రతిపాదనల మధ్య భారీ వ్యత్యాసం ఉంటే అందుకు సహేతుక కారణాలను కచ్చితంగా వివరించాలి.
- పరిపాలనా వ్యయానికి సంబంధించి అద్దెలు, వాహనాలు, కార్యాలయాల నిర్వహణ సంబంధిత బడ్జెట్ ప్రతిపాదనలను గత మూడేళ్ల వాస్తవ గణాంకాలతో పంపించాలి.
- నీటి చార్జీలు, విద్యుత్ చార్జీలను రెండుగా విభజించి కొత్త పద్దు కింద ప్రతిపాదించాలి. విద్యుత్ చార్జీలను ఇంధన శాఖ బడ్జెట్‌లో పొందుపరచాలి. ప్లీడర్ ఫీజులు, న్యాయాధికారుల గౌరవ వేతనాలను న్యాయశాఖలో ప్రతిపాదించాలి.
- నిష్ప్రయోజన వ్యయాలను నివారించడంతో పాటు జీతాలేతర వస్తువులపై వ్యయాన్ని విశ్లేషించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో కనీసం 20% తగ్గించేలా అంచనా ప్రతిపాదనలుండాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉప ప్రణాళికలు రూపొందించాలి.
- మహిళలు, పిల్లల కోసం అమలు చేసే పథకాలకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపు ప్రతిపాదనలు చేయాలి
- ప్రస్తుత పన్ను రేట్లు, చార్జీల ప్రకారమే ఆదాయ రాబడుల అంచనా ప్రతిపాదనలు చేయాలి. పన్నేతర ఆదాయంపై దృష్టి సారించాలి. పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- కన్సల్టెంట్లు, ఔట్‌సోర్సింగ్, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను పరిమితం చేయాలి. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఎటువంటి నియామకాలు చేపట్టరాదు.
- అత్యవసర వాహనాలు మినహా ఎటువంటి వాహనాలు కొనుగోలు చేయరాదు.

నేడు జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల

- మదనపల్లెలో నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం

సాక్షి, అమరావతి: జగనన్న విద్యాదీవెన పథకం కింద విద్యార్థులకు జూలై–సెప్టెంబర్ త్రైమాసికం నిధులను సీఎం వైఎస్ జగన్ బుధవారం విడుదల చేయనున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.694 కోట్లు జమ చేస్తారు. దీనివల్ల మొత్తం 11.02 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. మొత్తం మీద ఇప్పటివరకు ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద రూ.12,401 కోట్లు విడుదల చేసింది. ఆర్థిక స్తోమత లేక ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంటును అమలు చేస్తోంది. తల్లిదండ్రులపై భారం పడకుండా కాలేజీలకు ఎంత మొత్తం ఫీజు ఉన్నా ఆ మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ ఫీజులను ప్రతి త్రైమాసికం క్యాలెండర్ ప్రకారం విడుదల చేయడంతో కాలేజీల యాజమాన్యాలకూ ప్రయోజనం చేకూరుతోంది.

గత ప్రభుత్వ హయాంలో అప్పులపాలైన తల్లిదండ్రులు..

గత ప్రభుత్వం హయాంలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయలేదు. కాలేజీల్లో ఫీజు రూ.లక్షల్లో ఉన్నా కేవలం రూ.35,000 మాత్రమే ఇచ్చి అప్పటి టీడీపీ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. పైగా ఆ అరకొర మొత్తాన్ని కూడా సకాలంలో చెల్లించేది కాదు. దీంతో తల్లిదండ్రులు అప్పుల పాలయ్యారు. అనేకమంది విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇలా గత ప్రభుత్వం 2017 నుంచి పెట్టిన బకాయిలు దాదాపు రూ.1,778 కోట్లతో కలిపి జగనన్న విద్యా దీవెన కింద రూ.9,052 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద రూ. 3,349 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. ఈ నిధులతో కలిపి ఇప్పటివరకు ఈ రెండు పథకాల కింద రూ.12,401 కోట్లు సాయమందించింది. ఇంత పెద్దమొత్తంలో పేద విద్యార్థుల చదువుల కోసం వెచ్చించిన మరో ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేకపోవడం గమనార్హం. పేద విద్యార్థులు ఉన్నత చదువులు నిరాటంకంగా అభ్యసించేందుకు ఎలాంటి పరిమితులు విధించకుండా ఈ పథకాలను అందిస్తుండటం విశేషం.

ఎప్పటి నిధులు అప్పుడే జమ..

ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. పేద విద్యార్థులు భోజనం, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా జగనన్న వసతి దీవెన పథకం కింద ఏటా 2 వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించేవారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు.



అలీ కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన ముఖ్యమంత్రి

గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన ప్రభుత్వ సలహాదారు (ఎలక్ట్రానిక్ మీడియా), సినీనటుడు అలీ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్ హాజరయ్యారు. వధువు మహమ్మద్ ఫాతిమా రమేజున్, వరుడు షేక్ షహయాజ్‌లను ముఖ్యమంత్రి ఆశీర్వదించారు. గుంటూరు వచ్చిన ముఖ్యమంత్రికి హెలిప్యాడ్ వద్ద మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, కిలారు రోశయ్య, ఉండవల్లి శ్రీదేవి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు స్వాగతం పలికారు.

- సాక్షి ప్రతినిధి, గుంటూరు

కొత్త సీఎస్‌గా జవహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుత సీఎస్ డా. సమీర్‌శర్మ బుధవారం మధ్యాహ్నం పదవీ విరమణ చేయనున్నారు. అదేరోజు సాయంత్రం సీఎస్‌గా జవహర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారు. 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన జవహర్‌రెడ్డి ప్రస్తుతం సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కోవిడ్ సమయంలో జవహర్‌రెడ్డి వైద్య, ఆరోగ్య,, కుటుంబ సంక్షేమ శాఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కోవిడ్ కట్టడిలో కీలకపాత్ర పోషించారు. అనంతరం టీటీడీ ఈవోగా పనిచేశారు. 2024 జూన్ వరకు జవహర్‌రెడ్డి సర్వీసులో ఉంటారు.

సమీర్‌శర్మకు మరో పోస్టింగ్

సీఎస్‌గా బుధవారం పదవీ విరమణ కానున్న డా. సమీర్‌శర్మను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌తో పాటు సీఎం ముఖ్య కార్యనిర్వాహకునిగా (చీఫ్ ఎగ్జిక్యూటివ్) ప్రభుత్వం నియమించింది. సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలోనూ ఐఏఎస్ అధికారుల వార్షిక పనితీరును మదింపుచేసి సీఎంకి నివేదికలు అందిస్తారు. రాష్ట్ర జీఎస్‌డీపీ పెరగడానికి అవసరమైన చర్యలపై సీఎంకు ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలి. సీఎంవోలో ఆయన పనిచేస్తారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్ల పాటు సమీర్‌శర్మ ఆ పదవిలో కొనసాగుతారు. బుధవారం పదవీ విరమణ చేస్తున్న మరో ఐఏఎస్ అధికారి విజయకుమార్‌ను ఏపీ రాష్ట్ర డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియమించారు. పలువురు ఐఏఎస్ అధికారులను కూడా సర్కారు బదిలీ చేసింది.

- వ్యవసాయ, పశుసంవర్థక శాఖ ప్రత్యేక సీఎస్‌గా పనిచేస్తున్న పూనం మాలకొండయ్యను సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. మత్స్య, డెయిరీ డెవలప్‌మెంట్ అదనపు బాధ్యతల నుంచి కూడా ఆమెను రిలీవ్ చేశారు.
- రహదారులు–భవనాలు, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రవీణ్ ప్రకాశ్‌ను పాఠశాల విద్యా శాఖ ముఖ్యకార్యదర్శిగా బదిలీ చేశారు. ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక సీఎస్‌గా పనిచేస్తున్న బి.రాజశేఖర్ సెలవుపై వెళ్తున్నారు. సెలవు నుంచి వచ్చిన తరువాత తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు.
- అటవీ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డికి వ్యవసాయ శాఖ, పశు సంవర్థక, మత్స్య శాఖ ప్రత్యేక సీఎస్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రద్యుమ్నను రహదారులు–భవనాలు, రవాణా శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న రాహుల్ పాండేను వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనర్‌గా బదిలీ చేశారు. మార్క్‌ఫెడ్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతల్లో రాహుల్ పాండే కొనసాగుతారు. మహమ్మద్ దివాన్‌ను గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు.

461 స్టాఫ్ నర్సు పోస్టులకు నోటిఫికేషన్

- దరఖాస్తుల సమర్పణకు డిసెంబర్ 6 వరకు గడువు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఇప్పటికే వైద్య శాఖలో 46 వేలకు పైగా పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలియజేసింది. ప్రభుత్వాస్పత్రుల్లోని 461 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నాలుగు జోన్‌ల వారీగా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. బుధవారం నుంచి డిసెంబర్ 5 వరకు http://cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని డిసెంబర్ 6వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా వైద్య, ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి 42 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, విభిన్న ప్రతిభావంతులకు 10 ఏళ్ల పాటు వయోపరిమితి నుంచి సడలింపు ఉంటుంది. ఓసీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుమును రూ.500గా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రూ.300గా నిర్దేశించారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని వైద్య శాఖ తెలిపింది. కోవిడ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ తదితర ఇతర వెయిటేజీలు వర్తిస్తాయని పేర్కొంది. భవిష్యత్‌లో ఖాళీ అయ్యే నర్సింగ్ పోస్టుల భర్తీకి అనుగుణంగా ఈ నోటిఫికేషన్ మెరిట్ లిస్టును వచ్చే ఏడాది ఆగస్టు వరకు పరిగణనలోకి తీసుకుంటారు. ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు తావివ్వకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 2019 నుంచి 46 వేలకు పైగా పోస్టుల భర్తీని ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కాంట్రాక్ట్ పద్ధతిలో 461 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది.

ఉపాధి కూలీల వేతనాల కోసం రూ.386.81 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం మరో రూ.386.81 కోట్లను మంగళవారం విడుదల చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఐదు విడతల్లో రూ.3,675.10 కోట్లను ఉపాధి కూలీలకు వేతనాలుగా చెల్లించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. తాజాగా ఆరో విడతగా మంజూరు చేసిన రూ.386.81కోట్లతో కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ.4061.91 కోట్లను మంజూరు చేసినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలను ఎప్పటికప్పుడు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.



టీచర్లు.. టీచింగ్‌కే

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల మెరుగైన నిర్వహణకు వారి సేవలను వినియోగించుకుంటోంది. తద్వారా టీచర్లు పూర్తిగా బోధనపైనే దృష్టి కేంద్రీకరించేలా చేసి వారి దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిష్కరించింది.

విద్యా సంస్కరణలతో..

విద్యా సంస్కరణలతో ఏపీలో మూడేళ్లుగా పరిస్థితులు సమూలంగా మారిపోయిన విషయం తెలిసిందే. విద్యాదీవెన, విద్యా కానుక, అమ్మ ఒడి, ఫౌండేషన్ స్కూళ్లు, ఇంగ్లీషు మీడియంతో పిల్లల చదువులకు సర్కారు భరోసా కల్పిస్తోంది. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా అతి పెద్ద ఎడ్యుకేషనల్ టెక్ కంపెనీ బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.24 వేలతో స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఉచితంగా అందుబాటులోకి తెస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 4.7 లక్షల మంది విద్యార్థులకు రూ.500 కోట్లతో ఒక్కొక్కరికి దాదాపు రూ.12 వేల విలువ చేసే ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తోంది. 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌ను ప్రత్యేక యాప్ ద్వారా ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు తరగతి గదుల్లో టీవీలు, డిస్‌ప్లే బోర్డుల ద్వారా పాఠ్యాంశాలను సులభంగా గ్రహించేలా చర్యలు తీసుకుంది. ప్రాథమిక స్కూళ్లలో ఇంగ్లీష్ ల్యాబ్‌లను నెలకొల్పి 11 వేల స్మార్ట్ టీవీలను పంపిణీ చేసింది. ప్రభుత్వ స్కూళ్లను దశలవారీగా సీబీఎస్ఈతో అనుసంధానిస్తోంది. తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తూ ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేపట్టడంతోపాటు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ద్విభాషా పాఠ్య పుస్తకాలు (బై లింగ్యువల్) అందచేస్తోంది. మనబడి నాడు – నేడు ద్వారా 56,572 ప్రభుత్వ విద్యా సంస్థల్లో రూ.16,450 కోట్లతో దశలవారీగా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ తీర్చిదిద్దుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లోని సంక్షేమ, విద్యా సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఈ పనుల్లో నాణ్యత పరిశీలన బాధ్యతలను అప్పగించింది. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ బడులు, కళాశాలల్లో టాయ్‌లెట్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు తొలిసారి ప్రత్యేకంగా నిధులు కేటాయించిన ఘనత ఏపీదే. రాష్ట్రవ్యాప్తంగా 44,472 ప్రభుత్వ స్కూళ్లలో 45,313 మంది ఆయాలను నియమించి గౌరవ వేతనం చెల్లిస్తోంది. నాడు – నేడు స్ఫూర్తితో దేశవ్యాప్తంగా 14,500 పీఎంశ్రీ స్కూళ్లను ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇక ఆర్థిక స్తోమత కారణంగా ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అమలు చేస్తోంది. క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు విడుదల చేస్తోంది. జగనన్న విద్యాకానుక కింద బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్కులు, వర్కు బుక్కులు, బ్యాగు, 3 జతల యూనిఫారం, షూ, సాక్సులతోపాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీని కూడా ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న సంగతి తెలిసిందే. విద్యార్థుల సంపూర్ణ వికాసానికి విద్యతో పాటు మంచి పౌష్టికాహారం కూడా ఎంతో అవసరం. దీన్ని గుర్తించి జగనన్న గోరుముద్ద ద్వారా రోజుకో మెనూతో పోషక విలువలున్న ఆహారాన్ని మధ్యాహ్న భోజనంలో అందిస్తోంది. పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కారాదనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది.

ఏ అవసరం వచ్చినా..

టీచర్లను విద్యేతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తుండటం వల్ల బోధనాభ్యసన కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వ యంత్రాంగానికి ఏ అవసరం వచ్చినా టీచర్లకే బాధ్యతలు కేటాయించడం వల్ల పిల్లలకు పాఠాలు చెప్పేవారు లేకుండా పోతున్నారు. కొంతమంది టీచర్లు ఇతర విభాగాలకు డిప్యుటేషన్లపై వెళ్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు కార్పొరేషన్ల చైర్మన్ల పీఏలుగా కూడా టీచర్లు పనిచేసిన పరిస్థితి గతంలో నెలకొంది. ఇలా మొత్తం టీచర్లలో 5 శాతం మంది పాఠశాలలకు దూరం కావడం బోధనపై ప్రభావం చూపుతోంది. ఇదే అంశంపై సుప్రీంకోర్టు ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది. విద్యాహక్కు చట్టం ప్రకారం టీచర్లకు విద్యేతర కార్యక్రమాలను అప్పగించరాదని, ఇతర విధుల్లో ఉంటున్న వారిని వెనక్కు రప్పించాలని గడువు విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖ గతేడాది ఇతర శాఖల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వారిని వెనక్కు రప్పించి పాఠశాలల్లో బోధనకు పునర్నియామకం చేసింది.

ఇన్నాళ్లకు..

తమకు విద్యేతర కార్యక్రమాలు అప్పగించవద్దని టీచర్లు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇతర బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో లక్ష్యాల మేరకు బోధనాభ్యసనను కొనసాగించలేకపోతున్నామని నివేదించినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

ప్రయోజనం ఇలా..

ప్రతి విద్యార్థిపైనా దృష్టి

టీచర్లు పాఠశాలల్లో విద్యా కార్యక్రమాల్లో నిమగ్నం కావడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందుతుంది. టీచర్లు తమ బాధ్యతను సమగ్రంగా నిర్వర్తించడానికి వీలుంటుంది. తరగతిలో ఒక్కో విద్యార్థి అభ్యసనం ఎలా ఉంది? లోపాలు ఏమిటి? అనే అంశాలపై దృష్టి సారించి లోపాలను సరిదిద్దడంపై టీచర్లు దృష్టి సారించగలుగుతారు. పాఠశాలల్లో బోధనాభ్యసన కార్యక్రమాలు మెరుగుపడటం ఉన్నత ప్రమాణాలు సాధించేందుకు దారితీస్తుంది. ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే ఫౌండేషనల్ స్కూళ్ల విధానం తెచ్చిన విషయం తెలిసిందే.

స్కూళ్ల మ్యాపింగ్

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందించడానికి వీలుగా ఫౌండేషన్ విద్యతో సహా ఆరంచెల స్కూళ్ల విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. 3, 4, 5 తరగతులను కిలోమీటర్ పరిధిలోని ప్రీ–హైస్కూళ్లు, హైస్కూళ్లతో మ్యాపింగ్ చేపట్టింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లతో బోధించేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 4,943 ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలలను 3,557 ప్రీ–హైస్కూల్, ఉన్నత పాఠశాలలకు మ్యాపింగ్ చేశారు. జీవో117 ప్రకారం ఇలా మ్యాపింగ్ అయిన హైస్కూళ్లు, ప్రీ హైస్కూళ్లలో 7,928 మంది సబ్జెక్ట్ టీచర్లు అదనంగా అవసరమని గుర్తించారు. ఈ మేరకు సబ్జెక్టు టీచర్ల నియామకానికి వీలుగా 3,095 ఇతర సబ్జెక్టు పోస్టులను అవసరమైన సబ్జెక్టు పోస్టులుగా మార్పు చేశారు. ఇవే కాకుండా 3,993 పోస్టులను సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంటు పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో 287 స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్, గ్రేడ్–2 హెడ్మాస్టర్ పోస్టులుగా, 3,706 ఎస్జీటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. సబ్జెక్టు టీచర్ పోస్టులుగా కన్వర్ట్ అయిన, అప్‌గ్రేడ్ చేసినపోస్టుల్లో టీచర్లను నియమిస్తున్నారు.

మ్యాపింగ్‌తో మిగులు టీచర్ల సర్దుబాటు

3, 4, 5 తరగతులు హైస్కూళ్లకు అనుసంధానంతో మిగులు టీచర్లను మ్యాపింగ్ అయిన స్కూళ్లలో నియమించడం ద్వారా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ జాగ్రత్తలు తీసుకుంది. స్కూళ్ల పునర్విభజన కసరత్తు తర్వాత ఫౌండేషన్ ప్లస్, ప్రీ–హైస్కూల్, హైస్కూల్‌లో మిగులు ఉన్నట్లు గుర్తిస్తే తాత్కాలికంగా అవసరమైన స్కూళ్లకు సర్దుబాటు చేస్తోంది. పదోన్నతులు, ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు ఆర్టీఈ నిబంధనల ప్రకారం స్కూల్ కాంప్లెక్స్‌లో లేదా అదే మండలంలో సర్దుబాటు చేస్తున్నారు. దీని ప్రకారం ఇప్పటికే 3,726 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లను తాత్కాలికంగా అవసరమైన ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేశారు. దీనికి సంబంధించి స్పష్టమైన సూచనలు ఉన్నప్పటికీ పలుచోట్ల సరిగా అమలు చేయకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నట్లు విద్యాశాఖ గుర్తించి దృష్టి సారించింది.

బోధనకు వెళ్లకుంటే చర్యలు తప్పవు

బోధనకు ఆటంకం లేకుండా ఉండాలని ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాలు ఇస్తున్నప్పటికీ కొన్ని చోట్ల బోధనకు టీచర్లు విముఖత చూపుతున్నారని, కొన్ని చోట్ల సమన్వయం లోపం వంటి సమస్యలతో బోధన అందడం లేదన్న వార్తలు వస్తున్నాయి. మంగళవారం దీనిపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈఓలు, ఆర్జేడీలతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెబెక్స్ సమావేశం నిర్వహించారు. పలు హైస్కూళ్లలో అవసరమైన సంఖ్యలో టీచర్లను నియమించినా బోధన చేయడం లేదన్న అంశం ప్రస్తావనకు వచ్చింది. కృష్ణా జిల్లాలోని ఓ హైస్కూలులో 3నుంచి 10వ తరగతి వరకు 19 మంది టీచర్లను నియమించినా కింది తరగతులకు బోధన చేపట్టడం లేదని ఆర్జేడీ వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా వ్యవహరించే వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పట్టణ, ఉపపట్టణ ప్రాంతాల్లో మిగులుగా ఉన్న టీచర్లను మారుమూల ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలన్నారు.

కర్నూలుకు 1,876 పోస్టుల మంజూరు

కర్నూలు జిల్లాలో తీవ్ర సమస్యగా మారిన టీచర్ల కొరతను పరిష్కరించేలా ప్రభుత్వం అదనపు టీచర్ పోస్టులను మంజూరు చేసింది. జిల్లాకు ఏకంగా పలు కేటగిరీల్లో 1,876 పోస్టులను కేటాయించింది. ఇతర జిల్లాల్లో మిగులు పోస్టులను ఈ జిల్లాకు మళ్లించడం ద్వారా సమస్యను పరిష్కరించింది.

రాష్ట్ర విద్యాహక్కు చట్టంలో అదనపు అంశాలు

ఉపాధ్యాయులకు విద్యేతర కార్యక్రమాలను అప్పగించకుండా ఏపీ ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కొన్ని అంశాలను జోడించింది. ఏపీ ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం 2011 మార్చి 3న విడుదలైన జీవో 20లో వీటిని చేర్చింది. ఆ జీవోలో ప్రస్తుతం 29 రూల్స్ ఉండగా 30వ రూల్‌గా 'డిప్లాయ్‌మెంట్ ఆఫ్ టీచర్స్ ఫర్ నాన్ ఎడ్యుకేషనల్ పర్పసెస్' (టీచర్లను విద్యేతర కార్యక్రమాల్లో నియమించడం) కింద దీన్ని పొందుపరిచింది.

- తరగతి గదిలో పిల్లల విద్యా సంబంధిత సామర్థ్యాలను మెరుగుపరచడానికి వీలుగా ఉపాధ్యాయులు బోధన కార్యకలాపాల్లో తమ సమయాన్ని పూర్తిగా కేంద్రీకరించాలి. ఉత్తమ బోధనకు అంకితం కావాలి.
- ఉపాధ్యాయులు సాధ్యమైనంత వరకు పాఠశాలల్లో బోధన, ఇతర విద్యా సంబంధిత కార్యకలాపాలు మినహా మరే ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఇతర విధుల్లో వారిని నియమించరాదు.
- ఏదైనా అనివార్య పరిస్థితులు తలెత్తిన సందర్భాల్లో ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది అందరినీ మోహరించిన తర్వాత మాత్రమే ఉపాధ్యాయులను విద్యేతర కార్యక్రమాల్లో నియమించాలి. సెక్షన్ 27 నిబంధనలకు అనుగుణంగా విద్యాహక్కు చట్టం మరింత బలోపేతం.


శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మేజర్ పంచాయతీ అచ్యుతాపురంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పల్నాడు జిల్లా కొప్పకొండలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

గడప గడపకు మన ప్రభుత్వం


ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా తరుణవాయిలో మహిళలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


పశ్చిమగోదావరి జిల్లా కేశవరంలో మహిళా కూలీలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

క్లుప్తంగా

విపత్తు నిర్వహణ ప్రణాళికలు తయారు చేయండి

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్

సాక్షి, అమరావతి: ప్రతి జిల్లాలో అక్కడి పరిస్థితుల ఆధారంగా విపత్తు నిర్వహణ ప్రణాళిక తయారు చేయాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు సూచించారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించే విషయంపై 26 జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మాట్లాడుతూ 2005 విపత్తుల నిర్వహణ చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆమోదం కోసం పంపించాలని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ముందు 13 జిల్లాల విపత్తు నిర్వహణ ప్రణాళికలు ఉన్నాయన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళిక-2009 మార్గదర్శకాల ఆధారంగా ఇప్పుడు నూతన జిల్లాలతో కలిపి మొత్తం 26 జిల్లాలకు అక్కడ స్థితిగతులు, భౌగోళిక పరిస్థితులు, జీవన ప్రమాణాల ఆధారంగా విపత్తుల ప్రమాద స్థాయిని తగ్గించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విపత్తుల సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సి.నాగరాజు, విపత్తుల శాఖ ఏఎస్ శివచంద్రరావు, పరిపాలనాధికారి జి.శ్రీనివాస్, యూనిసెఫ్ కన్సల్టెంట్ అమల్‌కృష్ణ, యూనిసెఫ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎకో టూరిజం పార్క్‌లపై సత్వరమే దృష్టి పెట్టండి

అటవీ శాఖాధికారుల సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఫారెస్ట్ డివిజన్ పరిధిలో ఒక ఎకో పార్క్‌ను ఏర్పాటు చేయాలని అటవీ, ఇంధన, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం అటవీ శాఖాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సోమశిల బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకో టూరిజం పార్క్ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. స్థానికంగా ఉన్న ప్రజాసంఘాలు, సంస్థల సహకారంతో ఎకో పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. అటవీ ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే సంస్థల నుంచి కూడా సహకారాన్ని తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జూ పార్క్‌లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, కొత్త జంతువులను జూలలో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం డైరెక్టర్, క్యూరేటర్ వంటి కీలక పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, అటవీ దళాల అధిపతి వై.మధుసూదనరెడ్డి, పీసీసీఎఫ్ ఆర్పీ ఖజూరియా, డీఎఫ్‌వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆ తీర్పు పునఃసమీక్ష కుదరదు

- ఉపాధి హామీ బకాయిల తీర్పుపై ప్రభుత్వ పిటిషన్ల కొట్టివేత

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ కింద చేసిన పనులకు సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు హైకోర్టు నిరాకరించింది. పునఃసమీక్ష నిమిత్తం ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. ఆ తీర్పును పునఃసమీక్షించేందుకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధి హామీ పనుల బిల్లులు చెల్లించకపోవడంపై హైకోర్టులో దాదాపు వెయ్యివరకు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారించిన జస్టిస్ దేవానంద్.. బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో తీర్పు చెప్పారు. ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ ప్రభుత్వం అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేసింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గతంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ నివేదికలను కోర్టుముందు ఉంచలేకపోయామన్నారు. ఆ నివేదికల ప్రకారం ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలిపారు. అందువల్ల వాటిని పరిగణనలోకి తీసుకుని, అక్టోబర్‌లో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి తిరస్కరించారు.

బీసీలు నిన్ను నమ్మరు బాబూ : మారేష్

సాక్షి, అమరావతి: బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేసిన వ్యక్తి చంద్రబాబు అని, మరోసారి బాబును బీసీలు నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేరని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అన్నారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో 25 బీసీ కుల సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మారేష్ మాట్లాడుతూ పద్నాలుగేళ్లపాటు ముఖ్యమంత్రిగా చేసిన బాబు బీసీలకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలన బీసీలకు స్వర్ణయుగమని, 139 బీసీ కులాలకు న్యాయం చేస్తున్నారని చెప్పారు.

అంగన్‌వాడీలకు ఫ్లేవర్డ్ పాలు!

చాకోలెట్, వెనీలా, మ్యాంగో, రోజ్, ఇలాచి ఫ్లేవర్లలో పాలు

- తొలి దశలో తొమ్మిది జిల్లాల్లో అమలు
- నెలకు పది లక్షల లీటర్లు సరఫరా
- డిసెంబర్ నెలాఖరు నుంచి కార్యాచరణ



సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు రంగు, రుచి, చిక్కదనంతో కూడిన పాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రోజుకు ఒక ఫ్లేవర్‌తో కూడిన పాలను అందించాలని నిర్ణయించింది. డిసెంబర్ నెలాఖరు నుంచి ఈ మేరకు కార్యాచరణ మొదలుకానుంది. రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో తొలి దశలో 5,466 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. చాక్లెట్, రోజ్, వెనీలా, మామిడి, యాలకుల రుచి (ఫ్లేవర్)తో కలిపిన పాలు సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కొక్కరికీ రోజుకు 200 మిల్లీ లీటర్లు చొప్పున సాధారణ పాలు (టెట్రా ప్యాక్) అందిస్తున్నారు. తొలి దశలో అమూల్ ద్వారా ఫ్లేవర్డ్ మిల్క్ రోజుకు 200 మిల్లీ లీటర్ల చొప్పున అందించనున్నారు. ఇప్పటికే అమూల్ సంస్థ మదనపల్లె, అచ్యుతాపురం, నూజివీడు, జి.కొత్తపల్లి, ఒంగోలు డెయిరీ ప్లాంట్ల ద్వారా రాష్ట్రంలోని 11,583 అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు 19,44,990 లీటర్ల పాలు సరఫరా చేస్తోంది.

ప్రయోగాత్మకంగా ఫ్లేవర్డ్ మిల్క్ సరఫరా ఇలా...

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	ఫ్లేవర్డ్ మిల్క్ (లీటర్లు)
అనకాపల్లి	548	7,263
అన్నమయ్య	847	1,44,882
చిత్తూరు	223	37,767
ఏలూరు	1,932	3,99,655
కృష్ణా	359	57,842
ఎన్టీఆర్	362	60,700
విశాఖపట్నం	8	2,222
ప్రకాశం	1,076	1,54,369
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	111	12,710

వాటిలో తొలి దశలో 5,466 అంగన్‌వాడీ కేంద్రాలకు 9,67,410 లీటర్ల ఫ్లేవర్డ్ మిల్క్ సరఫరా చేయాలని నిర్ణయించారు. మరో 6,117 అంగన్‌వాడీ కేంద్రాలకు 9,77,580 లీటర్ల సాధారణ పాలను సరఫరా చేయనున్నారు.

డిసెంబర్ నెలాఖరు నుంచి పంపిణీ



రాష్ట్రంలో ప్రస్తుతం అమూల్ ద్వారా ఫ్లేవర్డ్ పాలు సరఫరాను తొమ్మిది జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ నెలాఖరు నుంచి ఫ్లేవర్డ్ మిల్క్ సరఫరా ప్రారంభించాలని కసరత్తు చేస్తున్నాం. రానున్న మూడు నెలల్లో రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు మామూలు పాలకు బదులు ఫ్లేవర్డ్ మిల్క్ సరఫరా చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం.

–బాబు.ఎ, ఎండీ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

రోజుకో ఫ్లేవర్



రాష్ట్రంలో అంగన్‌వాడీల ద్వారా అయిదు రకాల ఫ్లేవర్ పాలు సరఫరా చేస్తాం. వాటిలో రోజుకు ఒక ఫ్లేవర్ చొప్పున అందిస్తాం. ఏ రోజు ఏ ఫ్లేవర్ పాలు సరఫరా చేయాలనేది కూడా క్యాలెండర్ ఇస్తాం. రంగు, రుచి, చిక్కదనం కలబోతగా అందిస్తున్న ఈ పాలు సాధారణ పాల కంటే బలవర్ధకంగా ఉంటాయి.

– ముద్దాడ రవిచంద్ర, ముఖ్య కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ

బడుగు, బలహీనవర్గాల కాలనీల్లో కొత్తగా 1,400 ఆలయాలు

- ఆలయ నిర్మాణానికి రూ.8 లక్షలు..
- విగ్రహాలకు రూ.2 లక్షలు చొప్పున ఇస్తాం
- సమీక్షలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీనవర్గాల కాలనీల్లో కొత్తగా 1,400 ఆలయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు దేవదాయ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కొత్త ఆలయాల నిర్మాణంపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ.. ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. ఇందులో ఆలయ నిర్మాణానికి రూ.8 లక్షలు, విగ్రహాలకు రూ.2 లక్షలు ఇస్తామని తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 1,060 ఆలయాలు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. మరో 330కు పైగా ఆలయాల నిర్మాణానికి సమరసతా సంస్థ ముందుకొచ్చిందని చెప్పారు. ఏడాదిలోపే ఆయా ఆలయాల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. నిర్మాణంలో కాంట్రాక్టర్లు ఉండరని.. ఆలయ నిర్మాణానికి ఇచ్చే రూ.పది లక్షలకు అదనంగా మరి కొంత మొత్తం కలిపి దాతలు, గ్రామస్తులు ముందుకొస్తే వారికే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. దేవదాయ శాఖ ముందుగా డిజైన్ చేసిన ప్రకారమే ఆలయ నిర్మాణం ఉండాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీని ఓడించే సత్తా పవన్‌కు లేదు..

పవన్‌కళ్యాణ్ మాటలు, చేష్టలు చూస్తే ఆయన పిచ్చి పరాకాష్టకు చేరినట్లు అనిపిస్తోందన్నారు. 'ఆయనకు ఎవరి మీద అక్కసు వెళ్లగక్కాలో తెలియదు. నోటికి వచ్చినట్లు ఏదో మాట్లాడతాడు. మాది విప్లవసేన అంటాడు. ఒక సందర్భంలో ఆయన మాట్లాడే మాటలకు, నాలుగైదు రోజుల తర్వాత మాట్లాడినదానికి సంబంధమే ఉండదు. ఎవరో ఏదో చెబితే అది అమలు చేయడం, ఎవరి కోసమో పనిచేయడం ఆయన విధానం. పార్టీ మీటింగ్‌లో పెద్ద పెద్ద కేకలు వేస్తూ మాట్లాడతాడు.. అంతలోనే చిరునవ్వులు నవ్వుతాడు. ఇలాంటివన్నీ పిచ్చివాళ్ల లక్షణాలు' అని కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. ఒక్కోసారి పవన్‌కళ్యాణ్ వ్యవహార శైలి చూస్తే జనసేన ఒక ఉగ్రవాద సంస్థ అని ఆయనకు ఆయనే చెబుతున్నట్లు ఉంటుందన్నారు. జనసేన ఒక పిచ్చి పార్టీ అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీని ఓడించే సత్తా పవన్‌కు లేదన్నారు. ఆయన పార్టీ పెట్టింది ఆయన గెలవడం కోసమేనా అని నిలదీశారు.

ఏపీలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్యం



సీఐఐ సమావేశంలో మంత్రి రజిని తదితరులు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని
- ప్రముఖ ఆస్పత్రులు, వైద్య సంస్థల యాజమాన్యాలతో ఢిల్లీలో భేటీ
- పెట్టుబడులకు రాష్ట్రంలో సానుకూల వాతావరణం

సాక్షి, అమరావతి : పేదలకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మెరుగైన, ఆధునిక వైద్యాన్ని చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారని.. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 16 చోట్ల హెల్త్ హబ్‌లు ఏర్పాటు చేయాలని, వీటిలో 50 శాతం పడకలను ఆరోగ్యశ్రీ పథకానికి కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆస్పత్రుల ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆమె పలు ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సంస్థల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వివరించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కనీసం 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఎవరైతే ముందుకు వస్తారో వారికి ఉచితంగా 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వమే అందిస్తోందన్నారు. ఈ ఆస్పత్రుల్లో 50 శాతం పడకలను ఆరోగ్యశ్రీకి కేటాయించడం ద్వారా పేదలకు ప్రపంచ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే వీలు కలుగుతుందని తెలిపారు. పెట్టుబడులు పెట్టే వారికి ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ప్రభుత్వముంటుందన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులిచ్చేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని వివరించారు. హెల్త్ హబ్‌లు, సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్లు, ఎంఆర్ఐ, సీటీ, క్యాత్ ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ల ఏర్పాటు, వాటి నిర్వహణకు సంబంధించిన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి కోరారు. పేదలకు రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనుకుంటున్న ప్రభుత్వ యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర అధికారులు ఎంటీ కృష్ణబాబు, నవీన్‌కుమార్, ప్రముఖ హాస్పటల్స్, ఫార్మా కంపెనీల అధినేతలు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకే వికేంద్రీకరణ

ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజల ఆకాంక్షల మేరకే పరిపాలన, అభివృద్ధిని వికేంద్రీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మరింత పకడ్బందీగా బిల్లు తేవడానికే ఆనాడు మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్నామన్నారు. కానీ, లేని చట్టంపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని, ఆ తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని తెలిపారు. అభివృద్ధిని ఒకే చోట కేంద్రీకరించాలని ఎలా చెబుతారని, రాజధానిపై నిర్ణయం, నిర్మాణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ప్రభుత్వం చేయాల్సిన పనిని హైకోర్టు ఎలా చేస్తుందని వ్యాఖ్యానించిందన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు నోరు మెదపడంలేదని, ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఆ ఉత్తర్వులను వక్రీకరిస్తూ అవాస్తవాలను అచ్చేశాయని చెప్పారు. తద్వారా టీడీపీకి అజెండాను ఇచ్చాయన్నారు. దీన్నిబట్టి చూస్తేనే టీడీపీని నడుపుతున్నది చంద్రబాబు కాదని, పచ్చ పత్రికలేనన్నది మరోసారి స్పష్టమైందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చే తుది తీర్పు మేరకు అందరూ మెచ్చేలా మూడు రాజధానుల చట్టాన్ని తెస్తామని చెప్పారు. గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చి ఉండకపోతే ఈ పాటికే మూడు రాజధానుల చట్టాన్ని తెచ్చేవారమని తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు. ప్రధానమైన శాసన రాజధాని, దానికి సంబంధించిన మిగతా సంస్థలు అమరావతిలోనే ఉంటాయన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత జరిగే అభివృద్ధితో రైతులు కూడా లబ్ధి పొందుతారన్నారు. చంద్రబాబు దాష్టీకాలకు పాల్పడి రైతుల నుంచి భూమిని లాక్కుని.. ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చనే రియల్ ఎస్టేట్ భ్రమ కల్పించారని దుయ్యబట్టారు. 40 ఏళ్లు పట్టే అభివృద్ధిని మూడు, నాలుగేళ్లలో చూపిస్తామంటూ నమ్మబలికారని మండిపడ్డారు.

చంద్రబాబు, పచ్చ పత్రికలు కరోనా వైరస్‌లు

వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణను తెలంగాణ సీబీఐ కోర్టుకు బదిలీ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాజధానిపై సుప్రీం కోర్టు ఉత్తర్వులపై మాట్లాడని చంద్రబాబు.. వివేకా హత్య కేసులో సుప్రీం కోర్టు తీర్పుపై మాత్రం నోటికొచ్చినట్లు ట్వీట్ చేశారంటూ మండిపడ్డారు. 2019లో వైఎస్ అవినాష్ రెడ్డి విజయం కోసం వివేకా ప్రచారం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ చిన్నాన్న అయిన వివేకా హత్య కేసులో నిందితులెవరో తేల్చి, కఠినంగా శిక్షించాలని కోరుకుంటున్నామన్నారు. చంద్రబాబు రాజకీయంగా సీఎం జగన్‌ను ఎదుర్కోలేక, వివేకా కుటుంబ సభ్యులు కొందరిని లొంగదీసుకుని, వ్యక్తిగత విషయాలను రాజకీయం చేసి నిందలు మోపాలని కుట్ర చేస్తున్నారన్నారు. చంద్రబాబు, ఆయన్ని నడుపుతున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి కరోనా వైరస్‌లని, వ్యవస్థలను నాశనం చేస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్‌ను నాదెండ్ల భాస్కర్‌రావు, ఆ తర్వాత చంద్రబాబు వెన్నుపోటు పొడిచినప్పటి నుంచి ఇదే రీతిలో ఈ కరోనా వైరస్‌లు వ్యవస్థలపై దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, సీఎం వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిలమ్మను హైదరాబాద్‌లో తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు.

ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టు షాక్

- కోర్టు ధిక్కార పిటిషన్ కొట్టివేత
- సీఎస్ చర్యలు ఉద్దేశపూర్వక ఉల్లంఘన కిందకు రావు
- తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి : సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టు షాకిచ్చింది. సస్పెన్షన్ కాలానికి జీతభత్యాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం చెల్లించడంలేదంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సమీర్ శర్మపై వెంకటేశ్వరరావు దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌ను మంగళవారం కొట్టేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారం తుది దశకు చేరుకోనందువల్ల సీఎస్ చర్యలను ఉద్దేశపూర్వక ఉల్లంఘనగా పరిగణించడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. తరువాతి కాలంలో సీఎస్ చర్యలు ఉద్దేశపూర్వక ఉల్లంఘన కిందకు వస్తాయని వెంకటేశ్వరరావు భావిస్తే తగిన పిటిషన్ దాఖలు చేసేందుకు ఈ తీర్పు అడ్డంకి కాదని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. ఏబీ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై జస్టిస్ సోమయాజులు ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. ఏబీ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టేసి, జీత భత్యాలు చెల్లించాలని ఆదేశించిందన్నారు. సుప్రీం కోర్టు కూడా సస్పెన్షన్‌ను ఎత్తివేసిందన్నారు. అయినా సస్పెన్షన్ కాలానికి జీతభత్యాలు చెల్లించడంలేదని, ఇది కోర్టు ఆదేశాల ఉల్లంఘనే అని చెప్పారు. ఈ వాదనలను సమీర్ శర్మ తరఫు న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి తోసిపుచ్చారు. నిఘా పరికరాల కొనుగోళ్లలో అక్రమాల వ్యవహారంలో వెంకటేశ్వరరావుపై నమోదైన కేసు విచారణ తుది దశలో ఉందన్నారు. సుప్రీం కోర్టు కేసు పూర్వాపరాల ఆధారంగా ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టేయలేదని, సస్పెన్షన్ రెండేళ్లకు మించి ఉండరాదన్న నిబంధనను మాత్రమే అనుసరించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయన్ని సర్వీసులోకి తీసుకుందని, అంతమాత్రాన జీత భత్యాలన్నీ చెల్లించాలని ఓ హక్కుగా కోరడానికి వీల్లేదన్నారు. విచారణ ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగికి పూర్తిస్థాయి జీతభత్యాలు చెల్లించాలా లేదా అన్నది ప్రభుత్వ విచక్షణ అని చెప్పారు. వెంకటేశ్వరరావుపై విచారణ ముగిసి, నిర్ణయం వెలువడిన తరువాత, సస్పెన్షన్ సమర్థనీయం కాదని ప్రభుత్వం భావిస్తేనే తగిన ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. కాబట్టి సీఎస్ చర్యలు ఉద్దేశపూర్వక ఉల్లంఘన కిందకు రావన్నారు. మహేశ్వరరెడ్డి వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. సస్పెన్షన్ 'ఎంత మాత్రం సమర్థనీయం కాదు' అన్న మాటలకు ఎంతో విలువ ఉందని ధర్మాసనం తెలిపింది. సుప్రీంకోర్టు, ప్రభుత్వం వెంకటేశ్వరరావు సస్పెన్షన్ 'ఎంత మాత్రం సమర్థనీయం కాదు' అని తేల్చలేదని, ఆరోపణల నుంచి విముక్తి ప్రసాదించలేదని తేల్చి చెప్పింది. వెంకటేశ్వరరావుపై విచారణ తుది దశలో ఉందని, దీన్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు నివేదించారని, తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని గుర్తు చేసింది. వెంకటేశ్వరరావు పూర్తి జీతభత్యాలకు అర్హులా కాదా అన్న విషయాన్ని ఈ దశలో.., ముఖ్యంగా కోర్టు ధిక్కార వ్యాజ్యంలో తేల్చడం సాధ్యం కాదని చెప్పింది.

విద్యార్థుల జీవితాలతో నారాయణ ఆడుకున్నారు

- స్వీయ ప్రయోజనాలు, లబ్ధి కోసమే ప్రశ్నపత్రం లీక్
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- తీర్పు వాయిదా వేసిన న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు

సాక్షి, అమరావతి : పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ చేయడం ద్వారా నారాయణ విద్యా సంస్థ, దాని అధిపతి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎంతో మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఇలాంటి వారి పట్ల న్యాయస్థానం మెతక వైఖరి అవలంబించకూడదని అన్నారు. తీవ్ర నేరానికి పాల్పడిన నారాయణకు రిమాండ్ తిరస్కరించి, బెయిల్ మంజూరు చేయడం ద్వారా మేజిస్ట్రేట్ తప్పు చేశారని, పరిధి దాటి వ్యవహరించారని, మినీ ట్రయల్ నిర్వహించారని తెలిపారు. ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. సెషన్స్ కోర్టు ఉత్తర్వుల్లో ఈ కోర్టు జోక్యం చేసుకుంటే, మేజిస్ట్రేట్ల తప్పులను సమర్థించినట్లవుతుందని తెలిపారు. అందువల్ల మేజిస్ట్రేట్ ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ నారాయణ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పును రిజర్వ్ చేశారు. నారాయణ ఈ నెల 30వ తేదీలోపు లొంగిపోవాలంటూ సెషన్స్ కోర్టు నిర్దేశించిన గడువును తీర్పు వెలువరించేంత వరకు పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేస్తూ చిత్తూరు సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పొంగూరు నారాయణ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు మంగళవారం మరోసారి విచారణ జరిపారు. ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నారాయణకు బెయిల్ రద్దు ఉత్తర్వులు తాత్కాలికమైనవి కావని, మధ్యంతర ఉత్తర్వులని వివరించారు. అందువల్ల వాటిపై రివిజన్ పిటిషన్ దాఖలు చేయాలే తప్ప, క్వాష్ పిటిషన్ కాదని అన్నారు. ఈ సందర్భంగా చట్ట నిబంధనలను, పలు తీర్పులను వివరించారు. నిబంధనల ప్రకారమే బెయిల్ మంజూరు చేయాలి తప్ప, ఫలానా సెక్షన్ వర్తించదని రిమాండ్ సమయంలో మినీ ట్రయల్ నిర్వహించడానికి వీల్లేదని, ప్రస్తుత కేసులో మేజిస్ట్రేట్ ఇలాంటి ట్రయల్ నిర్వహించారని, దీనిపైనే తమ ప్రధాన అభ్యంతరమని తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ వెనుక ఉన్న కుట్రను ఛేదించాలని, అందుకు నారాయణను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన బాధ్యత దర్యాప్తు అధికారులపై ఉందన్నారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వుల వల్ల దర్యాప్తునకు విఘాతం కలిగిందన్నారు. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న వ్యవహారమైనందువల్ల నారాయణ చర్యలను తేలిగ్గా తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. నారాయణ తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.


నూతన డైరెక్టర్లతో మంత్రి దాడిశెట్టి రాజా

రూ.1,700 కోట్లతో రెండోదశ రోడ్ల పునరుద్ధరణ

- మంత్రి దాడిశెట్టి రాజా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండో దశ రోడ్ల పునరుద్ధరణ పనులను రూ.1,700 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు ఆర్ అండ్ బీ శాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు(రాజా) చెప్పారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థలో నియమితులైన 14 మంది డైరెక్టర్లలో 13 మంది మంగళవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. మరో డైరెక్టర్ అష్రఫ్ వ్యక్తిగత కారణాలతో ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. సమావేశంలో మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధి పనులను చేపట్టిందని వివరించారు. మొదటి దశలో రూ.2 వేల కోట్లతో 8 వేల కిలోమీటర్ల మేర రోడ్ల పునరుద్ధరణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని చెప్పారు.



ప్రేమ అనేది
అర్థం చేసుకోవడంలోంచి జనిస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, నవంబర్, 30

ఆట మారుతుందా?

బరిలో ఆట కన్నా బాసు హోదాలో సీటు ముఖ్యమని పేరుబడ్డ మన క్రీడాసంస్థల్లో మార్పు వస్తోందంటే అంతకన్నా ఇంకేం కావాలి! ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడోత్సవాల లాంటి అంతర్జాతీయ వేదికలపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించే అథ్లెట్లను ఎంపిక చేసే ప్రతిష్ఠాత్మక క్రీడాసంఘానికి క్రీడా నిపుణులే సారథ్యం వహిస్తున్నారంటే సంతోషమేగా! ఎప్పుడో 95 ఏళ్ళ క్రితం ఏర్పాటైన పేరున్న క్రీడాసంఘం 'ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్' (ఐఓఏ)కు తొలిసారిగా ఓ మహిళా క్రీడాకారిణి పగ్గాలు చేపట్టనుండడం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. గతంలో పలు వివాదాలకు గురైన ఐఓఏకు డిసెంబర్ 10న ఎన్నికలు. నామినేషన్ల తుది గడువు ఆదివారం ముగిసేసరికి, ప్రసిద్ధ మాజీ అథ్లెట్ పీటీ ఉష ఒక్కరే అధ్యక్ష పదవికి బరిలో ఉండడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈసారి ఐఓఏ కార్యవర్గంలో ఈ పరుగుల రాణితో పాటు ప్రసిద్ధ ఆటగాళ్ళ ఎన్నిక ఖాయంగా కనిపిస్తోంది. భారత క్రీడాంగణంలో ఇది నూతన ఉషోదయం అనిపిస్తోంది.

అవినీతి, ఆశ్రితపక్షపాతం, రాజకీయ పార్టీలకు ఆలవాలంగా మన దేశంలోని క్రీడాసమాఖ్యలు అపకీర్తిని సంపాదించుకున్నాయి. ఆ కుళ్ళు కంపుతో, అందరూ ప్రక్షాళనకు ఎదురుచూస్తున్న వేళ ఐఓఏకు తొలిసారిగా ఒక మహిళ, ఒక ఒలింపిక్ ప్లేయర్, ఒక అంతర్జాతీయ పతక విజేత పగ్గాలు చేపట్టడం నిజంగానే చరిత్ర. వాస్తవానికి, పాలనాపరమైన అంశాలను తక్షణం పరిష్కరించుకోవాలనీ, లేదంటే సస్పెన్షన్ వేటు తప్పదనీ అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) సెప్టెంబర్‌లోనే ఐఓఏకు తుది హెచ్చరిక చేసింది. డిసెంబర్ లోగా ఎన్నికలు జరపాలని గడువు పెట్టింది. గతంలో పదేళ్ళ క్రితం ఐఓసీ ఇలాగే సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం. తాజా హెచ్చరికల పర్యవసానమే ఈ ఎన్నికలు. కొత్తగా కనిపిస్తున్న మార్పులు. ఆసియా క్రీడోత్సవాల్లో నాలుగుసార్లు ఛాంపియన్, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలైన 58 ఏళ్ళ ఉషకు ఇప్పుడు ఈ కిరీటం దక్కడం ముదావహం.

ఈసారి ఐఓఏ కార్యవర్గ (ఈసీ) ఎన్నికల నామినేషన్లలో ఆసక్తికరమైన అంశాలేమిటంటే – గడచిన ఈసీలో ఉన్నవారెవరూ ఈసారి నామినేషన్ వేయలేదు. అలాగే, ఈసీలో సగం మందికి పైగా క్రీడాకారులున్నారు. మొత్తం 15 మంది సభ్యుల ప్యానెల్‌లో పీటీ ఉష కాక లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణపతక విజేత – షూటర్ గగన్ నారంగ్ (ఉపాధ్యక్షుడు) సహా మరో అరడజను మంది ఆటగాళ్ళకు చోటు దక్కింది. మల్లయోధుడు యోగేశ్వర్ దత్, విలువిద్యా నిపుణురాలు డోలా బెనర్జీ, అథ్లెట్ల నుంచి బాక్సింగ్ రాణి మేరీ కోమ్, అంతర్జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ ఆటగాడు ఆచంట శరత్ కమల్ తాజా ప్యానెల్‌లో ఉండడం విశేషం. డిసెంబర్ 10న ఎన్నికలతో కార్యవర్గం తుదిరూపు తేలనుంది. స్వయంగా క్రీడాకారులూ, ఆటల్లో నిపుణులూ ఈసారి ఐఓఏ కార్యవర్గానికి అభ్యర్థులు కావడం ఆహ్వానించదగ్గ పరిణామమే. రేపు ఎన్నికైన తర్వాత వారి ఆటలో నైపుణ్యం, అనుభవం భారత క్రీడా రంగ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి పనికొస్తాయి. అనేక దశాబ్దాలుగా ఏదో ఒక పదవిలో కూర్చొని సంస్థను ఆడిస్తున్న బడాబాబులకూ, 70 ఏళ్ళు దాటిన వృద్ధ జంబూకాలకూ ఐఓఏ రాజ్యాంగంలో సవరణల పుణ్యమా అని ఈసారి కార్యవర్గంలో చోటు లేకుండా పోయింది. చివరకు సెక్రటరీ జనరల్ రాజీవ్ మెహతా అండగా నిలిచిన వర్గానికి సైతం బరిలో నిలిచిన కొత్త ఈసీ ప్యానెల్‌లో స్థానం దక్కకపోవడం విశేషమే.

నిజానికి, ఆటల విషయంలో నిర్ణయాత్మకమైన క్రీడా సంఘాల్లో అథ్లెట్లకు ప్రధానంగా స్థానం కల్పించాలని కోర్టులు చిరకాలంగా చెబుతున్నాయి. జాతీయ క్రీడా నియమావళి, ఐఓసీ నియమావళి సైతం సంఘాల నిర్వహణలో ఆటగాళ్ళకే పెద్దపీట వేయాలని చెబుతున్నాయి. దేశంలోని క్రీడా సంఘాలకు పెద్ద తలకాయ లాంటి ఐఓసీలో ఇప్పటి దాకా అలాంటి ప్రయత్నాలు జరిగిన దాఖలాలు లేవు. సుప్రీమ్ కోర్ట్ మాజీ జడ్జి ఎల్. నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఈసారి ఐఓసీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక సంఘానికి ఆయన కొత్త రాజ్యాంగం సిద్ధం చేశారు. ఇక, ఈ సంఘంలోని మొత్తం 77 మంది సభ్యుల ఎలక్టోరల్ కాలేజ్‌లో దాదాపు 25 శాతం మాజీ అథ్లెట్‌లే. వారిలోనూ పురుషుల (38) సంఖ్య కన్నా స్త్రీల (39) సంఖ్య ఎక్కువ కావడం విశేషం. అందివచ్చిన అవకాశాన్ని పరుగుల రాణి ఉష, బృందం ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటారో?

రానున్న రోజుల్లో ఐఓఏ రోజువారీ నిర్వహణలో వీరందరి మాటా మరింతగా చెల్లుబాటు కానుంది. అయితే, అధికారంతో పాటు అపారమైన బాధ్యతా వీరి మీద ఉంది. అథ్లెట్లకు అండగా నిలుస్తూ, దేశంలో క్రీడాసంస్కృతిని పెంచి పోషించాల్సిందీ వారే. అనేక దశాబ్దాలుగా రాజకీయాల్లో తలమునకలైన దేశ అత్యున్నత క్రీడాసంఘంలో అది అనుకున్నంత సులభం కాదు. విభిన్న వర్గాలుగా చీలి, వివాదాల్లో చిక్కుకొన్న వారసత్వం ఐఓఏది. అలాగే దేశంలో ఇతర జాతీయ క్రీడా సమాఖ్యలు, పాత ఐఓఏ సభ్యులు, కొత్త రాజ్యాంగంలో ఓటింగ్ హక్కులు కోల్పోయిన రాష్ట్ర శాఖలతో తలనొప్పి సరేసరి. వీటన్నిటినీ దాటుకొని రావాలి. అనేక ఆటలతో కూడిన ప్రధాన క్రీడోత్సవాలకు ఎంట్రీలు పంపే పోస్టాఫీస్‌లా తయారైన సంఘాన్ని గాడినపెట్టాలి. మరో ఏణ్ణర్థంలో జరగనున్న 2024 ప్యారిస్ ఒలింపిక్స్‌కు భారత ఆటగాళ్ళను సిద్ధం చేయాలి. ఉష అండ్ టీమ్ ముందున్న పెను సవాలు. కేంద్రం, క్రీడాశాఖ అండదండలతో ఈ మాజీ ఆటగాళ్ళు తమ క్రీడా జీవితంలో లాగానే ఇక్కడా అవరోధాలను అధిగమించి, అద్భుతాలు చేస్తారా?

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.సప్తమి ప.1.37 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.12.12 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.7.01 నుండి 8.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.24 నుండి 12.09 వరకు **అమృత ఘడియలు:** తె.4.04 నుండి 5.32 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

వారి పోరాటం ఫలించాలంటే...

విశ్లేషణ



రామిన్ జహాన్‌బెగ్లూ

పోలీసుల కస్టడీలో మాసా అమీనీ మరణించిన ఘటన అనంతరం పెల్లుబికిన నిరసనలు ఇరాన్‌లో ఇంకా కొనసాగుతున్నాయి. విద్యార్థులు, యువతులు కీలక పాత్ర పోషిస్తుండగా, ఇరాన్ సమాజంలోని సకల వర్గాల ప్రజలు ఈ నిరసన ప్రదర్శనల్లో చేరుతున్నారు. మరోవైపు వేలాదిమంది నిరసనకారులను అరెస్టు చేయడంతోపాటు జర్నలిస్టులు, డాక్టర్లు, లాయర్లు వంటివారిపై కూడా ప్రభుత్వం నిర్బంధం విధించింది. ఇరాన్ భద్రతా బలగాల చేతిలో ఇప్పటివరకూ 326 మంది చనిపోయారు. నిరసనకారులకు క్షమాభిక్ష పెట్టరాదని పార్లమెంట్ తీర్మానం చేసింది. ఇరాన్ సమాజం మొత్తం ఏకమై సాగిస్తున్న ఈ చిరస్మరణీయ పోరాటానికి భారత్‌తో సహా ప్రపంచ దేశాల సంఘీభావం అవసరం.

సెప్టెంబర్ 16న మాసా అమీనీ అనే 22 ఏళ్ల కుర్దిష్ ఇరానియన్ యువతి పోలీసుల కస్టడీలో మరణించిన ఘటన ఇరాన్‌లో రగిలించిన ప్రదర్శనలు పదో వారంలోకి ప్రవేశించాయి. నార్వే కేంద్రంగా పనిచేసే ఇరాన్ మానవ హక్కుల ఎన్జీవో (ఐహెచ్ఆర్ఎన్జీఓ) ప్రకారం, పట్టణాల్లో దీనిపై తిరుగుబాటు ప్రారంభమైనప్పటినుంచి ఇరాన్ భద్రతా బలగాల చేతిలో 326 మంది చనిపోయారు. ఇందులో 40 మంది పిల్లలు. వీరు కారులో ఉండటమో, దారిపక్కన నిలుచుని ఉండటమో జరిగింది.

పోలీసులచే హత్యకు గురైన పిల్లల జాబితాలో ఇటీవల చేరిన అబ్బాయి పేరు కియాన్ పిర్‌ఫాలక్. తొమ్మిదేళ్ల కియాన్ ఇరాన్‌లోని ఐజేహ్ నగరానికి చెందినవాడు. అనేక ఇతర కేసుల్లో జరిగిన విధంగానే భద్రతా బలగాలు తమ కుమారుడిని లాక్కెళ్తారనే భయంతో అతడి దేహాన్ని ఐసుతో కప్పి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఇరాన్ వ్యాప్తంగా పౌరుల హత్యలు జరుగుతున్నప్పటికీ, షియా సంప్రదాయం ప్రకారం 40వ రోజున చనిపోయినవారి స్మృతిలో ప్రదర్శనకారులు తిరిగి వీధుల్లోకి వచ్చారు.

ఒకవైపు ప్రజాగ్రహం, ఆందోళనలు కొనసాగుతుండగానే, ఇంత వరకూ అరెస్టయిన 13,000 మంది నిరసనకారులకు దేశ న్యాయ వ్యవస్థ ఎలాంటి క్షమాభిక్ష పెట్టరాదని ఇరాన్ పార్లమెంటులోని 290 మంది ఎంపీల్లో 227 మంది డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానియన్ మానవ హక్కుల కార్యకర్తల ప్రయత్నాలు, నిరసనకారులకు మద్దతుగా కెనడా, బ్రిటన్, యూరోపియన్ కౌన్సిల్ సంకేతాత్మకంగా ఆంక్షలు అమలు చేసినప్పటికీ ఇవేవీ ఇరాన్ అధికారులపై ఎలాంటి ప్రతికూల ప్రభావాన్ని కలిగించలేదు. ఇరాన్ ప్రజల తలరాత పట్ల భారతీయులతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు పూర్తిగా ఉదాసీనంగా ఉంటున్నారు. ప్రతిరోజూ మృతి చెందుతున్న నిరసనకారుల సంఖ్య పెరుగుతూ వస్తూండగా, అరెస్టయిన వారిని సామూహికంగా విచారించడం వేగవంతమవుతోంది.

గత కొన్ని నెలలుగా వేలాదిమంది నిరసనకారులను అరెస్టు చేయడంతోపాటు ఇరాన్ ప్రభుత్వం దేశంలోని జర్నలిస్టులు, విద్యార్థులు, పాఠశాలలు, డాక్టర్లు, లాయర్లు వంటివారిపై కూడా నిర్బంధం విధించింది. న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ అంచనా ప్రకారం ఇరాన్‌లో గత 10 వారాల్లో 51 మంది జర్నలిస్టులను అరెస్టు చేశారు. నిరసన ప్రదర్శనలు ప్రారంభమైనప్పటినుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు 308 మంది యూనివర్సిటీ విద్యార్థులను ప్రభుత్వ బలగాలు అరెస్టు చేశాయని హ్యూమన్ రైట్స్ వాచ్ అంచనా. ఇరాన్‌లో పనిచేస్తున్న కొందరు మానవ హక్కుల కార్యకర్తల అభిప్రాయం ప్రకారం, 2022 నవంబర్ ప్రారంభం నాటికి 130 మంది మానవ హక్కుల సమర్థకులను, 38 మంది మహిళా హక్కుల సమర్థకులను, 36 మంది రాజకీయ కార్యకర్తలను, 19 మంది



లాయర్లను ఇరాన్ నిఘా సంస్థలు అరెస్టు చేశాయి.

ఇరానియన్ న్యాయవ్యవస్థకు చెందిన న్యూస్ ఏజెన్సీ ప్రకారం, వివిధ ప్రావిన్సుల్లో నిరసనకారులపై నేరారోపణ అభియోగాలు మోపటం మొదలైపోయింది. అల్‌బోర్జ్ ప్రావిన్స్‌లో 201, జంజీన్‌లో 119, కుర్దిస్తాన్‌లో 110, ఖుజెస్తాన్‌లో 105, సెమ్‌నన్‌లో 89, ఖజ్విన్‌లో 55, కెర్మన్‌లో 25 చార్జిషీట్‌లను మోపగా, రాజధాని నగరమైన తెహ్రాన్‌లో వెయ్యిమంది నిరసనకారులపై చార్జిషీట్ మోపారు. దీనికితోడుగా, అక్టోబర్ 30న తెహ్రాన్‌లోని రివల్యూషనరీ కోర్టు 15వ బ్రాంచ్... ఆరుగురు నిరసనకారులపై యుద్ధం చేస్తున్నారనీ, వీరు అత్యంత అవినీతిపరులనీ, జాతీయ భద్రతకు వ్యతిరేకంగా కుమ్మక్కయ్యారనీ అభియోగాలు మోపింది.

దేశంలో కొనసాగుతున్న నిరసన ప్రదర్శనల్లో విద్యార్థులు, యువతులు కీలక పాత్ర పోషిస్తుండగా, ఇరాన్ సమాజంలోని సకల వర్గాల ప్రజలు నిరసనల్లో చేరుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 2009, 2017లో జరిగిన సామాజిక ఉద్యమాల్లా ప్రస్తుత నిరసన ప్రదర్శనలు చల్లారేట్టు కనిపించడం లేదు. దీనికి రెండు కారణాలు తోడయ్యాయి. మొదటిది: ఇరానియన్ టీనేజర్లు, విద్యార్థులు తమ తల్లిదండ్రుల కంటే మరింత సాహసవంతులుగా, పోరాటకారులుగా మారారు. ఎందుకంటే వారికి ఇకపై భవిష్యత్తు అనేది కనిపించడం లేదు. రెండు: ఇరాన్ ప్రభుత్వ నైతికస్థైర్యం ఎంత బలహీనపడిందంటే, దాని సైనిక, రాజకీయ సంస్థలు ఎలాంటి విశ్వసనీయతనూ కలిగించడం లేదు.

గత రెండు నెలల్లో, ఇరాన్ కళాకారులు, మేధావులు, క్రీడాకారులు మొత్తంగా ప్రదర్శనకారుల పట్ల సంఘీభావం తెలిపారు. ఇలాంటి ఐక్యతా ప్రదర్శనకు తాజా ఉదహరణగా ఇరాన్ ఫుట్‌బాల్ టీమ్ నిలబడింది. నవంబర్ 21న ఇంగ్లండ్‌పై ప్రపంచకప్ మ్యాచ్ జరగడానికి ముందు సాంప్రదాయికంగా తమ దేశ జాతీయ గీతాన్ని ఆలపించడానికి ఇరాన్ జట్టు తిరస్కరించింది. ఇరాన్ ప్రభుత్వం దేశంలో పిల్లలను, యువతను కాల్చి చంపుతున్నందుకు తీవ్ర నిరసనను జాతీయ గీతం ఆలపించకపోవడం ద్వారా ప్రదర్శించిన ఇరాన్ పుట్‌బాల్ జట్టు బహిరంగంగానే దేశీయ నిరసనకారులకు సంఘీభావం తెలిపింది.

దేశ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇరాన్ అధికారులు ఒక అడుగు వెనక్కు వేసి తాము ఎక్కడ నిలిచామో అంచనా వేసుకోవడానికి ఇదే సరైన సమయం. ఇస్లామిక్ రిపబ్లిక్ ఇప్పుడు ఒక ప్రమాదకరమైన అంచుకు చేరినట్లు కనబడుతోంది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇస్లామిక్ పాలనకు ముగింపు పలకడానికి చేతులు కలుపుతున్నారు. మరోవైపున యూరోపియన్ యూనియన్, బ్రిటన్, అమెరికాలు ఇరాన్ వీధుల్లో స్కూలు పిల్లలను, టీనేజర్లను కాల్చి చంపుతున్న వ్యవస్థతో సజావుగా వ్యాపారాన్ని సాగించలేరు. అందుకే పశ్చిమదేశాలు, తూర్పుదేశాలు కూడా తమ ప్రజాస్వామ్య విధిని పరిపూర్తి చేయడం కోసం ఇరాన్ ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజల మద్దతు లేకుండా ఇరానియన్లు స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని సాధించలేరని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే అత్యంత ప్రధానమైన శక్తి ఏదంటే, ఇస్లామిక్ పాలనలోని అణిచివేతకు లోబడిపోవడానికి తిరస్కరిస్తున్న ఇరానియన్లు మాత్రమే. అదే సమయంలో ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆంక్షలు విధించే విషయంలో తమ తమ ప్రభుత్వాలతో లాబీయింగ్ చేయడం, క్రీడలు, సాంస్కృతిక అంశాలను బహిష్కరించడం, ఇరాన్‌లో పౌర ప్రతిఘటనా ఉద్యమానికి ప్రత్యక్ష మద్దతుకోసం ప్రజలను కూడగట్టడం వంటి చర్యల ద్వారా అంతర్జాతీయ మిత్రుల సహాయం చాలా కీలకమని మనం మర్చిపోకూడదు.

1980లలో దక్షిణాఫ్రికాలోని వర్ణవివక్షా పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాట ఉదాహరణ అలాంటి ప్రయత్నానికి స్ఫూర్తిదాయకంగా నిలబడవచ్చు. ఈ సందర్భంగా 2005లో జోహాన్స్‌బర్గ్‌లో నెల్సన్ మండేలా చెప్పిన మాటలను మనం మర్చిపోకూడదు. "మేం నిర్బంధంలో మగ్గుతున్నప్పుడు మాపై అణచివేతకు వ్యతిరేకంగా సంఘీభావం తెలుపుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజలు ఇచ్చిన మద్దతును మేం ఎన్నడూ మర్చిపోము. ఆ ప్రయత్నాలు ఫలించాయి. అందువల్లే పేదరికం నుంచి విముక్తి కోసం మద్దతునివ్వడంలో ప్రపంచంలోని కోట్లాది మంది ప్రజలతో మేము భుజం కలిపి నిలబడగలుగుతున్నాం." ఆ విధంగానే ఈరోజు కోట్లాది ఇరాన్ ప్రజలు సగర్వంగా లేచి నిలబడుతున్నారు. భారత్‌తో పాటు, ప్రపంచంలోని ఇతర దేశాల నుంచి సంఘీభావం కోసం వారు వేచి చూస్తున్నారు.

వ్యాసకర్త ఇరానియన్ పొలిటికల్ ఫిలాసఫర్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకు హడావిడి?



నేను ట్రోల్స్‌కు స్పందించను. కేవలం వారిని 'మ్యూట్' చేస్తానంతే. సమస్య పరిష్కారం అయిపోయినట్టే!

– జార్జ్ తకెయి, అమెరికన్ నటుడు

పరిధి దాటడమే



ఒక సినిమా సాంకేతికంగా బాలేదనో, కళాత్మకంగా నాణ్యంగా లేదనో చెప్పగల హక్కు 'ఇఫీ' జ్యూరీ హెడ్‌గా నదవ్ లాపిడ్‌కు ఉంది. కానీ ఒక సినిమా 'ప్రచారం' అని చెప్పడం తన బాధ్యతలను దాటి మాట్లాడటం, చరిత్రను తప్పుదోవ పట్టించడం, రాజకీయాలు చేయడం, బాధితులను నిందించడం!

– శ్రీజిత్ పణిక్కర్, వ్యాఖ్యాత

నీచమైన ప్రచారం



ప్రధాని మోదీతోపాటు, ఆయన ప్రభుత్వం, బీజేపీ, రైట్ వింగ్ ఎకోసిస్టమ్ అత్యుత్సాహంతో 'ద కశ్మీర్ ఫైల్స్'ను ప్రమోట్ చేశాయి. ఆ ఎత్తుగడను ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా తిరస్కరించింది. జ్యూరీ హెడ్ నదవ్ లాపిడ్ దాన్ని 'నీచమైన, ప్రచార సినిమా– ఫిలిం ఫెస్టివల్‌కు తగనిది' అన్నారు. మొత్తానికి ద్వేషాన్ని ఎత్తిచూపడం జరిగింది.

– సుప్రియా శ్రీనాతె, కాంగ్రెస్ ప్రతినిధి

ఏం జరగనుంది?



శ్రీలంక మీద చైనా పట్టు క్షేత్రస్థాయిలో కూడా బలపడుతోంది. ఆ దేశం ఆఖరికి లంక మత్స్యకారులకు కూడా నిధులు సమకూరుస్తోంది. ఇండియా ఇస్తున్న బిలియన్లకొద్దీ డాలర్ల సాయం విధేయతను కొనలేదు. మరోవైపు క్రమంగా అతివాద దేశంగా పరిణమిస్తున్న బంగ్లాదేశ్‌లో కీలక మౌలిక వసతులను నిర్మించడంలో మనం బిజీగా ఉన్నాం. అద్భుతమైన ఇరుగుపొరుగు!

– జోసెఫ్ టి. నూనీ, వైద్యుడు

భయానక వాస్తవం



నేనొక కశ్మీరీ ముస్లిం. 'ద కశ్మీర్ ఫైల్స్' ఒక 'నీచమైన ప్రచార' సినిమా కాదు. నా కశ్మీరీ హిందూ పండిట్ సోదర సోదరీమణులకు ఏం జరిగిందో చెప్పే భయానక సత్యం, వాస్తవం. అది నా కళ్లతో చూశాను. దీన్ని లక్షసార్లు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను.

– జావేద్ బేగ్, కశ్మీర్ మాజీ సీఎంకు పీఆర్ఓ

అయ్యో వద్దమ్మా



మా అత్తగారు (నా భర్త తల్లి) ఉక్రెయిన్‌ను వదిలి పోలెండ్ వెళ్లిపోయారు. అక్కడ ఆమె కారు తాళం విరిగిపోతే, ఒక దుకాణానికి వెళ్లి కొత్తది చేయించుకున్నారు. అయితే ఆమె శరణార్థిగా వచ్చినట్లు తెలుసుకున్న ఆ దుకాణదారు ఆమె దగ్గర డబ్బులు తీసుకోడానికి నిరాకరించారు. ఇది చాలా చిన్న విషయంలా కనిపించవచ్చు కానీ, దయకు పెద్ద సంకేతంలా అనిపిస్తుంది.

– దర్యా జోర్కా, రచయిత్రి

మగవాళ్లకు కరువా?



పెళ్లి చేసుకోకుండా ఉండటం అనేది ఒక మహిళ ఎంపిక. అంతేగానీ ఆమెకు మగవాడు దొరక్కపోవడం అనేది ఉండదు. అత్యంత సులభంగా దొరికేది మగవాడే.

– సయ్యద్ ఆయేషా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

కార్పొరేట్ కత్తిరింపు మొదలైతే...

పారిశ్రామికీకరణ కర్కశ పాదాల కింద ఎన్నో చేతివృత్తులు నలిగిపోయాయి. ఇంతకాలం మైల పనిగా భావించిన వృత్తుల్లో సైతం ఎన్నో మార్పులు వచ్చాయి. దాంతో సాంప్రదాయిక మంగలి (నాయీ బ్రాహ్మణ) వృత్తిపై కార్పొరేట్ కన్ను పడింది. కేశాలంకరణకు, రూప సౌందర్యానికి ఎంతైనా ఖర్చుపెట్టేవాళ్లు పెరుగుతున్న క్రమంలో వారి అవసరాలు తీర్చే రీతిలో కులవృత్తి మంగళ్ళు ఎదిగివచ్చే పరిస్థితులు లేవు. దీన్ని కార్పొరేట్లు చేజిక్కించుకొని, క్షుర కర్మ ఒక కుల వృత్తి అనే ముద్రని తుడిచేసే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రస్తుతం 45 శాతం కస్టమర్లు మాములు కటింగ్ చేయించుకోగా మిగతావారు చూడచక్కగా కనబడేందుకు సెలూన్లకు వస్తున్నారు. ఐదేళ్లలో ఈ ఫ్యాషన్ కస్టమర్ల సంఖ్య 60 శాతం పెరిగిందట.

2014లో రిలయన్స్ రిటైల్ తరపున హెయిర్ కటింగ్ షాపులు ఆరంభిస్తామన్న ప్రకటన రాగానే క్షురకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దాంతో ఆ ప్రతిపాదన వెనక్కి పోయింది. ఈ నవంబర్ మొదటివారంలో మరో వార్త వచ్చింది. నేచురల్స్ స్పా సంస్థలో 49 శాతం భాగస్వామ్యాన్ని కొనుగోలుకు ముకేశ్ అంబానీ సిద్ధపడినట్లు తెలు స్తోంది. చెన్నైకి చెందిన నేచురల్స్‌కి దేశంలోని ప్రముఖ నగరాల్లో 700 పైగా సెలూన్లు ఉన్నాయి. 2025 నాటికి ఆ సంఖ్యను 3,000కి పెంచాలనే ఆలోచనతో ముకేశ్ పావులు కదుపుతున్నారని వార్త. ఆయన సొంత సొమ్ముతో కొన్ని దుకాణాలు తెరిచినా కొంత కాలం తర్వాత ఫ్రాంచైజీ విధానాన్ని మొదలు పెడతారు. బ్రాండ్ పేరు కస్టమర్లలో చొచ్చుకు పోయాక ఆ పేరుతో షాపు తెరిచేందుకు వచ్చినవారి నుండి డిపాజిట్లు వసూలు చేసి రోజువారీ వ్యాపారంలో కమిషన్ తీసుకుంటారు. సొంత షాపుల బేరాలు దెబ్బతింటే మంగలి కులంవారు ఈ సెలూన్లలో పనికి కుదరక తప్పదు. వారు తమ అస్తిత్వాన్ని కోల్పోవడంతో పాటు తమ వృత్తిలోనే కూలీలుగా మారే దుఃస్థితి వస్తుంది. అందుకే కార్పొరేట్లు ఈ వ్యాపారంలోకి రాకుండా ప్రభుత్వాలు అడ్డుకోవాలని నాయీబ్రాహ్మణ సంఘాలు కోరుతున్నాయి.

– బి. నర్సన్, రచయిత । 94401 28169

పాలనలో దేశభక్తి ఇదే!

అభిప్రాయం



కాలువ మల్లయ్య

"దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా... దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్." గురజాడ దేశభక్తి గీతం ఒక్కటే చాలు ఆయనకు ప్రపంచ స్థాయి కవుల పక్కన చోటివ్వడానికి అని శ్రీశ్రీ అన్న మాటలు అక్షర సత్యాలు. దేశం, దేశంపై ప్రేమ, దేశభక్తి అంటే ఏంటో వంద సంవత్సరాల కిందటే మనిషి కోణంలోంచి ఆలోచించి చెప్పాడు గురజాడ. రెండువేల ఆరువందల సంవత్సరాల ముందే గౌతమ బుద్ధుడు అన్న 'బహుజన హితాయ బహుజన సుఖాయ' వాక్యంలోనూ, బౌద్ధ నైతిక ధర్మంలోనూ దుఃఖంలేని మానవ సమాజమే ముఖ్యం. బౌద్ధ ధర్మంలోని సారాన్ని హృదయానికి హత్తుకున్నవాడు కాబట్టే గురజాడ 'దేశభక్తి' లాంటి ప్రపంచస్థాయి గీతాన్ని రాయగలిగాడు. ఈ దేశంలోంచి బౌద్ధం తరిమి వేయబడినపుడే మతపరంగా భారతదేశం ఆత్మహత్య చేసుకుంది అన్నాడు గురజాడ. మనిషిని పట్టించుకోని ఏ మతం అయినా, విషయమైనా మానవజాతి ప్రగతిని కోరే వారి దృష్టిలో అసమ్మతం అయిందేనన్నది వాస్తవం.

దేశమంటే చెట్లు, గుట్టలు, నదీనదాలు కాదు. మట్టి మాత్రమే కాదు, దేశమంటే మనుషులు. దేశభక్తంటే ఆ మనుషులపై భక్తి, ప్రేమ... ఆ మనుషుల బాగోగులను చూడటమే. మనిషి కేంద్రంగా, మనిషి బాగోగులు లక్ష్యంగా, మానవాభివృద్ధి ధ్యేయంగా పాలన సాగించేవాడే మంచి పాలకుడు. దేశమును ప్రేమించడమంటే అదే. అలాంటి పాలన నందించే అతికొద్దిమంది నాయకులలో యువ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. అతనికి కావాల్సింది తన ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డ అందించడం. కుల, మత, ప్రాంత, వర్ణ, వర్గాలకతీతంగా అందరికీ మేలు చేసే పనులు చేయడం.



అందుకే దాదాపు 31 లక్షల మందికి మూడున్నరేళ్లయినా పూర్తికాక ముందే ఇండ్ల స్థలాలు ఇచ్చారు. దాదాపు రెండు లక్షల మందికి ఇప్పటికే ఇళ్లు కట్టించారు. లక్షలాది ఇళ్ల నిర్మాణ యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికల వాగ్దానాలను 95 శాతం పైగా నెరవేర్చారు.

విద్య, వైద్యం, సేద్యం, తిండి, బట్ట, ఇల్లు... ఇలా మనిషి మనుగడకు సంబంధించిన అన్ని అవసరాలనూ రాజకీయ విలువలనూ కాపాడుతూ, కమిట్‌మెంట్ రాజకీయాలను నడుపుతూ తీర్చడం సామాన్య విషయం కాదు. రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడుతూ సర్వమత సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తున్నారు.

ఇలాంటి మనిషి కేంద్రంగా సాగుతున్న పాలన తెలుగుదేశం లాంటి ప్రధాన ప్రతిపక్షానికీ, తెలుగు రాష్ట్రాల్లో తద్వారా దక్షిణాదిలో బలపడాలని అనుకుంటున్న బీజేపీకీ, ఏ రాజకీయ సిద్ధాంత అవగాహన లేక నోటి కొచ్చింది మాట్లాడుతూ ఎవరితోనైనా సరే పొత్తు పెట్టుకోవాలని చూసే పవన్ కల్యాణ్‌కూ నచ్చవు. ద్వేషపూరిత రాజకీయాలను రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని చూడటమే వీరి ఉద్దేశ్యం. దేశభక్తంటే వీరికి మతభక్తి. కులాలను రెచ్చగొట్టడం. ప్రాంతీయ విభేదాలను రెచ్చ గొట్టడం. రాష్ట్ర ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు ఏవీ వీరికి పట్టవు. ఏం చేసైనా సరే అధికారంలోకి రావడం వీరి ఉద్దేశ్యం. ప్రజల కనీసావసరాలను తీర్చే ఒక్క ప్రణాళిక కానీ, రాష్ట్ర ప్రగతి పథానికి ఉపయోగపడే ఒక్క పథకం కానీ లేకుండా ప్రజల సెంటిమెంట్లను రెచ్చ గొట్టి అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్న వీరికి 2019 ఎన్నికల్లోనూ, ఆ తర్వాత జరిగిన అనేక ఉప ఎన్నికల్లోనూ జరిగిన ఆశాభంగమే 2024 ఎన్నికల్లో జరుగుతుందన్నది వాస్తవం.

గురజాడ చెప్పిన దేశమును ప్రేమించుమన్నా అన్న సూక్తినీ, దేశభక్తి నిర్వచనాన్నీ హృదయానికి హత్తుకొని పరిపాలన కొనసాగిస్తూ ఆంధ్ర ప్రజల హృదయాలను గెలుచుకున్న జగన్ అజేయుడే!

వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త
మొబైల్: 91829 18567

ఒక్క 'షాట్'తో ఎయిడ్స్‌కు దూరం

సందర్భం



డా॥ కూటికుప్పల సూర్యారావు

ఎయిడ్స్‌పై మానవుని పోరాటం చివరి దశకు చేరింది. అందువల్ల ఎయిడ్స్ రోగులు ధైర్యంగా ఉండవచ్చు. 2020లో జరిగిన అధ్యయనాల ప్రకారం హెచ్ఐవీ రోగుల్లో 40 శాతం మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. కొందరు ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. నిజానికి ఎయిడ్స్ ఉన్నా పెళ్లి చేసుకోవచ్చని రోగులు గుర్తించాలి. ఎయిడ్స్‌పై అవగాహన పెంచడానికి 1988 నుంచీ ప్రతీ ఏడాదీ డిసెంబర్ 1వ తేదీని 'ప్రపంచ ఎయిడ్స్ దినం'గా పాటిస్తున్నాము.

ఈఏడు ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్య రాజ్య సమితి సంయుక్తంగా 'సంఘీభావంతో – ఎయిడ్స్ నివా రణ బాధ్యతల్లో భాగస్వామ్యం కావాలి' అనే నినాదాన్ని ఇచ్చాయి. జీవితాంతం మాత్రలు వాడటానికి 70 శాతం రోగులు ఇష్టపడటం లేదు. అందుకే మధ్యలో మందులు ఆపేయడం, అస్తవ్యస్తంగా మందులు వాడడం ద్వారా అర్థాంతరంగా హార్ట్ ఎటాక్ లేదా పక్షవాతం, టీబీ, కేన్సర్లు, అంధత్వం, మెనింజైటిస్, ఇతర అవకాశవాద సంక్రమణ వ్యాధులకు గురవుతూ నిర్వీర్యమైపోతున్నారు.

ఒకప్పుడు ఎయిడ్స్ అంటే మరణవాంగ్మూలం అనేవారు. అయితే నాలుగు దశాబ్దాల్లో శాస్త్రవేత్తలు ఈ వ్యాధిపై విజయం సాధించి చికిత్సను అందుబాటులోకి తెస్తున్నారు. అత్యంతాధునికమైన 'బ్రాడ్లీ న్యూట్రలైజింగ్ ఏంటీ బాడీస్' (బీఎన్ఏబీఎస్) చికిత్స త్వరలో అందుబాటులోకి వస్తుంది. మూడు లేక నాలుగు బీఎన్ఏబీఎస్‌ల ను కలిపి రోగి శరీరంలోకి పంపిస్తే అవి అన్ని రకాల హెచ్ఐవీ స్ట్రెయిన్స్‌నీ పూర్తిగా నిర్మూలిస్తాయని ప్రఖ్యాత మెడికల్ జర్నల్ 'నేచర్' ధ్రువీకరించింది. 'న్యూ ఇంగ్లాండ్ జనరల్ ఆఫ్ మెడిసిన్'లో తాజాగా వెలువడిన పరిశోధన ఫలితాల ప్రకారం ఓకాబ్రియా ఇంజక్షన్ సంవత్సరానికి ఒకటి లేదా రెండు పర్యాయాలిస్తే హెచ్ఐవీ సమూలంగా నాశనమవుతుందని తేలింది.

హెచ్ఐవీని పూర్తిగా నయం చేయడానికి (సీఆర్ఐపీఆర్) 'క్లస్టర్డ్ రెగ్యులర్లీ ఇంటర్ స్పేస్డ్ షార్ట్ పాలిండ్రోమిక్ రిపీట్స్' అని పిలువబడే జీన్ ఎడిటింగ్ విధానానికి అమెరికా 'ఫుడ్ అండ్ డ్రగ్ ఎడ్మినిస్ట్రేషన్' (ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. ఏంటీబాడీస్ ఇంజక్షన్లను వాడటం, కిక్ అండ్ కిల్ లాంటి అత్యాధునిక వైద్య విధానాన్ని అనుసరించడం వంటివాటి ద్వారా ఈ రోజో రేపో ఎయిడ్స్‌పై పూర్తి విజయాన్ని మన వైద్యులు ప్రకటించనున్నారు.

వ్యాసకర్త ప్రముఖ వైద్యనిపుణులు, అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ సభ్యులు
(రేపు ప్రపంచ ఎయిడ్స్ దినం)

రాజధాని పేదలకూ వలంటీర్ల ద్వారానే పింఛన్లు

- ప్రతి నెలా 1–5 తేదీల మధ్య లబ్ధిదారుల ఇళ్ల వద్దకే..
- డిసెంబరు నెల పింఛన్ సచివాలయాల ఖాతాల్లో జమ

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్‌డీఏ చట్టం ప్రకారం అమరావతి రాజధాని ప్రాంతంలో భూమిలేని పేదలకు ప్రభుత్వం అందజేసే పింఛన్లను డిసెంబర్ ఒకటో తేదీ నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దనే అందజేయనున్నారు. అవ్వాతాతల సామాజిక పింఛన్ల తరహాలోనే ప్రతి నెలా వలంటీర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తారు. అమరావతి రాజధాని గ్రామాల్లో మొత్తం 17,173 మందికి ఇప్పటి దాకా సీఆర్‌డీఏ ద్వారా ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో పింఛన్ డబ్బులు జమ చేసేవారు.

62.31 లక్షల సామాజిక పింఛన్ల కోసం రూ. 1584.87 కోట్లు..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 62,31,221 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సామాజిక పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ. 1584.87 కోట్ల మొత్తాన్ని రెండు రోజుల ముందు మంగళవారమే విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఆ ప్రాంతంలో ఉండే లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

కనుల పండువగా పుష్పయాగం



శ్రీవారి దేవేరికి పుష్పయాగం

చంద్రగిరి/తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం పుష్పయాగం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువ జామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. 9 గంటలకు యాగశాలలో ప్రత్యేక హోమ పూజలను, శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. దాతలు సమర్పించిన పుష్పాలకు ఆస్థాన మండపంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. 3గంటలకు యాగశాలలో ప్రాయశ్చిత్తం, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని సన్నిధి నుంచి వేంచేపుగా శ్రీకృష్ణస్వామి ముఖమండపానికి తీసుకువచ్చి కొలువుదీర్చారు. జాజులు, సంపెంగలు, తామరలు, కలువలు, మల్లెలు తదితర సుగంధాలు వెదజల్లే 4 టన్నుల పుష్పాలు, మరువం, దవనం, బిల్వం, తులసి, కదిరిపచ్చ, పన్నీరు పత్రాలతో శ్రీపద్మావతి అమ్మవారికి పుష్పార్చన చేశారు. ఇటీవల జరిగిన కార్తీక బ్రహ్మోత్సవాల్లో తెలిసీ, తెలియక జరిగిన దోషాల ప్రాయశ్చిత్తం కోసం టీటీడీ పుష్పయాగం నిర్వహించింది. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి

శ్రీవారి బ్రేక్ దర్శన సమయం మార్పు

- తిరుమలలో ఉదయం 8 గంటల నుంచి బ్రేక్ దర్శనాలు
- సామాన్య భక్తులకు తగ్గనున్న నిరీక్షణ సమయం
- నెలరోజులు ప్రయోగాత్మక పరిశీలన



తిరుమల: డిసెంబర్ 1వ తేదీ నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శన సమయం మారనుంది. వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లున్న భక్తులను ప్రస్తుతం ఉదయం 6 గంటలకు దర్శనానికి అనుమతిస్తున్న టీటీడీ గురువారం నుంచి ఉదయం 8 గంటలకు అనుమతించనుంది. ప్రొటోకాల్, శ్రీవాణి ట్రస్టు టికెట్ల భక్తులను ముందుగా అనుమతిస్తారు. స్వామికి రెండోగంట నివేదన తరువాత 10.30 గంటల నుంచి జనరల్ బ్రేక్ దర్శనం టికెట్లున్న భక్తులను, తరువాత టీటీడీ ఉద్యోగుల కుటుంబసభ్యులను దర్శనానికి అనుమతించనున్నారు. దీంతో సామాన్య భక్తులు స్వామి దర్శనం కోసం వేచి ఉండే సమయం తగ్గనుంది. నెలరోజులు ఈ విధానాన్ని పరిశీలించి ఇలాగే కొనసాగించాలా, లేక పాత పద్ధతినే అమలుచేయాలా అని టీటీడీ నిర్ణయం తీసుకోనుంది.

2014 నుంచి సాయంత్రం వీఐపీ బ్రేక్ దర్శనాల రద్దు

శ్రీవారి ఆలయంలో 1994కి పూర్వం వీఐపీ బ్రేక్ దర్శనాలు లేవు. అప్పటివరకు భక్తులందరినీ స్వామి దర్శనానికి కులశేఖరపడి వరకు అనుమతిస్తుండడంతో వీఐపీలు ఏ సమయంలో వచ్చినా దర్శనానికి అనుమతించేవారు. ఆ తరువాత సిఫార్సు లేఖల విధానం మొదలైంది. సాయంత్రం నైవేద్య సమర్పణ తరువాత వీఐపీ బ్రేక్ దర్శనాలకు అనుమతించేవారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు కోరుకునే భక్తుల సంఖ్య పెరగడంతో టీటీడీ ఉదయం కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రారంభించింది. ఈ కారణంగా సామాన్య భక్తులకు దర్శన సమయం తగ్గిపోయిందంటూ టీటీడీపై విమర్శలు రావడంతో 2012లో గురువారం మినహా మిగిలిన రోజుల్లో సాయంత్రం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దుచేసింది. 2014 నుంచి సాయంత్రం వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దుచేసింది. ప్రస్తుతం ఉదయం పూట వీఐపీ బ్రేక్ దర్శనాలు మాత్రమే అమలవుతున్నాయి. ముందుగా ప్రొటోకాల్ పరిధిలోని వారిని, తరువాత శ్రీవాణి ట్రస్ట్‌కి విరాళాలు ఇచ్చినవారిని, అనంతరం సిఫార్సు లేఖలపై టికెట్లున్న భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. ఈ బ్రేక్ దర్శనాలకే మూడు నుంచి నాలుగు గంటలు పడుతుండడంతో సర్వదర్శన భక్తులు దర్శనం కోసం వేచి చూసే సమయం పెరుగుతోంది. సర్వదర్శనం క్యూ లైను ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతోంది. ముందురోజు అర్ధరాత్రి 12 గంటలకు నిలిపేసిన సర్వదర్శన క్యూ లైన్ తరువాత రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుండడంతో భక్తుల నిరీక్షణ సమయం పెరుగుతూ వస్తోంది. ఆ సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ దర్శన విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. వేకువజామున ఆలయం తెరిచి శ్రీవారికి కైంకర్యాలు, నివేదనలను పూర్తిచేసిన అనంతరం సర్వదర్శనం భక్తులను దర్శనానికి అనుమతించి, తరువాత వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లున్నవారిని దర్శనానికి అనుమతిస్తే, సామాన్య భక్తులు దర్శనానికి వేచి ఉండే సమయం తగ్గుతుందని టీటీడీ భావిస్తోంది. దీనికితోడు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లున్న భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని స్వామిని దర్శించుకునే వెసులుబాటు లభిస్తుందని, దీంతో వసతి గదుల కేటాయింపు విషయంలో ఒత్తిడి తగ్గుతుందని టీటీడీ అంచనా వేస్తోంది. నెలరోజులు పరిశీలించి ఈ విధానం అమలుపై నిర్ణయం తీసుకోనుంది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం మంత్రి చెల్లబోయిన శ్రీనివాస్‌వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ శివరాంరెడ్డి, కన్నడ సినీనటుడు దర్శన్, సినీనటి సుహాసిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా అధికారులు శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్ ఏటీసీ వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 67,468 మంది స్వామిని దర్శించుకోగా 36,082 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లను భక్తులు సమర్పించుకున్నారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

3న అందుబాటులో పాస్‌పోర్ట్ ఆఫీస్ సేవలు

- విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, అమరావతి: డిసెంబర్ మూడో తేదీ శనివారం పాస్‌పోర్ట్ కార్యాలయం యథాతథంగా పని చేస్తుందని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి డీఎస్ఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్ట్ దరఖాస్తు అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉన్నవారికి ఇబ్బంది లేకుండా విదేశీ మంత్రిత్వ శాఖ సెలవు అయినా శనివారం కూడా కార్యాలయం పనిచేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. అత్యవసర పాస్‌పోర్ట్ కావాల్సినవారి కోసం ప్రత్యేకంగా ఎక్కువ తత్కాల్ స్లాట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా వేచిచూస్తున్నవారు తమ దరఖాస్తు షెడ్యూల్‌ను మార్చుకోవచ్చని సూచించారు. అయితే, పాస్‌పోర్ట్ వెబ్‌సైట్‌లో సూచించిన మూడు డాక్యుమెంట్లు ఉంటేనే తత్కాల్‌కు రీషెడ్యూల్ చేసుకోవాలని వివరించారు. కొంతమంది తత్కాల్‌కు దరఖాస్తు చేసుకుని నిబంధనల మేరకు మూడు ఫొటో గుర్తింపు కార్డులు తీసుకురాలేకపోవడంతో అపాయింట్‌మెంట్ రద్దు అవుతోందని, దీనివల్ల మరొకరికి నష్టం జరుగుతోందని శ్రీనివాసరావు తెలిపారు. తత్కాల్ ఒకసారి బుక్ అయితే రీ షెడ్యూల్ చేయడానికి అవకాశం ఉండదని, తత్కాల్ స్లాట్ బుక్ చేసుకునేవారు ముందుగా తమ డాక్యుమెంట్లు సరిచూసికోవాలన్నారు. పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్ల కోసం ఏజెంట్లను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు www.passportindia.gov.in లేదా mPassportseva.app ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ



అమరావతి: దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ ఎయిర్ బైపాస్ బ్రాంచ్ (తిరుపతి)లో పదో తరగతి చదువుతున్న కృష్ణాపురం రుష్మిత ప్రతిభ కనబర్చింది. సబ్ జూనియర్ 75 కేజీల విభాగంలో బెంచ్‌ప్రెస్ 30 కేజీలను లిఫ్ట్ చేసి గోల్డ్‌మెడల్‌ను, డెడ్ లిఫ్ట్ 90 కేజీలు లిఫ్ట్ చేసి సిల్వర్ మెడల్‌ను సాధించింది. అలాగే, వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైంది. రుష్మితను శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ, తదితరులు అభినందించారు.

పాస్‌పోర్టులు, వీసాల జారీలో అక్రమాలకు చెక్

- పోలీసు శాఖ, అమెరికా కాన్సులేట్ నిర్ణయం



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తో భేటీ అయిన అమెరికా కాన్సులెట్ ప్రధాన దర్యాప్తు అధికారి ఎరిన్ ఫిషర్

సాక్షి, అమరావతి: పాస్‌పోర్టు, వీసాల్లో జరిగే మోసాలను అరికట్టేందుకు రాష్ట్రంలో ప్రత్యేకంగా అవగాహన సదస్సులను సంయుక్తంగా నిర్వహించాలని రాష్ట్ర పోలీసు శాఖ, అమెరికా కాన్సులేట్ నిర్ణయించాయి. అమెరికా కాన్సులేట్‌లోని ప్రధాన దర్యాప్తు అధికారి ఎరిన్ ఫిషర్, రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డితో మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. పాస్‌పోర్టులు, వీసాల జారీలో కొంత మంది ఏజెంట్ల మోసాలతో సామాన్యులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న విషయంపై వారు చర్చించారు. ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించడంతో తరువాత సంక్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకోవాల్సి వస్తున్నదని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యను నివారించడంతోపాటు మానవ అక్రమ రవాణా నిరోధానికి కూడా పాస్‌పోర్టులు, వీసాల జారీలో అక్రమాలను అరికట్టాల్సి ఉందని నిర్ణయించారు. అందుకోసం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పోలీసు ట్రైనింగ్‌కాలేజీల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా కాన్సులేట్ ప్రధాన దర్యాప్తు అధికారి ఎరిన్ ఫిషర్ సంసిద్ధత వ్యక్తం చేశారు. పోలీసు శాఖ పూర్తిగా సహకరిస్తుందని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. అవగాహన సదస్సులపై త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయాలని నిర్ణయించారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే సుప్రీం వ్యాఖ్యలు

- న్యాయదేవత, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన బహుజనులు



న్యాయదేవత, జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బహుజన నేతలు

తాడికొండ: ఐదు కోట్ల మంది ప్రజల అభీష్టానికి అనుగుణంగానే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 793వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాజధాని అంటే ఒకే ప్రాంతం, ఓ సామాజిక వర్గం అభివృద్ధి కాదని, అందరి యోగక్షేమాలు, రాష్ట్రాభివృద్ధే అని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేయడం చూసైనా బాబు ఆయనకు వత్తాసు పలుకుతున్న కులవాదులు కళ్లు తెరుచుకోవాలని హితవు పలికారు. ఇప్పటంలో రహదారుల విస్తరణ వ్యవహారంలో కులవాదులు కోర్టులను తప్పుదారి పట్టించేందుకు యత్నించారనేది స్పష్టమైందన్నారు. ఇప్పటంలో కేసులు వేసిన వారికి జరిమానా విధించినట్లు రాజధాని వ్యవహారంలో తప్పుదారి పట్టించేందుకు యత్నించిన కులవాదులకు కూడా తగిన జరిమానా విధించి శిక్షించాలని కోరారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని కోర్టు కేసుల్లో స్టేలు తెచ్చుకుని బయట తిరుగుతున్న పగటి దొంగ చంద్రబాబును జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. కాగా కోర్టు వ్యాఖ్యలు నేపథ్యంలో న్యాయదేవత, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు మాదిగాని గురునాథం పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో అరసం 19వ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, వేదికపై సినీ రచయిత సాయిమాధవ్

తెనాలిటౌన్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో తెనాలిలో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం మహాసభల ఆహ్వానసంఘ సమావేశం జిల్లా శాఖ అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1943 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో తెనాలిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిందని తెలిపారు. మళ్లీ 80 సంవత్సరాల అనంతరం 19వ మహాసభలు తెనాలిలో జరగడం సంతోషకరమన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, కార్యదర్శి కె.శరత్, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, బెల్లకొండ జయరాజు, రచయితలు లలితానంద, అయినాల మల్లేశ్వరరావు, శివనాగేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, ప్రజా నాట్యమండలి నాయకులు పాల్గొన్నారు. మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శిగా చెరుకుమల్లి సింగారావు, గౌరవాధ్యక్షుడిగా బాబు ఆర్.వడ్లమూడిలను సమావేశం ఎంపిక చేసింది.

పండుగప్ప, పీత హేచరీలకు భూముల కేటాయింపు

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా పరసావారిపాలెం వద్ద సర్వే నంబర్ 1127లో 280 ఎకరాల భూమిని మత్స్యశాఖకు ఉచితంగా కేటాయిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ రూ.14.20 కోట్లతో పసుపు పీతల హేచరీ, రూ.23.78 కోట్లతో పండుగప్పల హేచరీ ఏర్పాటు చేయనున్నారు. ఏటా 1.2 మిలియన్ పీత గుడ్లు, 3.5 మిలియన్ల పండుగొప్ప సీడ్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ హేచరీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని మార్చి 2023కి ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే టెండర్లు పిలిచారు. వీటి నిర్వహణ కోసం 73 మంది సిబ్బంది అవసరం కాగా, ఆరుగురు సిబ్బందిని రెగ్యులర్‌గా, మిగిలిన 67మందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించుకునేందుకు ప్రభుత్వం గతంలో అనుమతి కూడా ఇచ్చింది. ఇదే ప్రాంతంలో మెరైన్, ఆక్వా కల్చర్‌కు సంబంధించి ఏదీ కావాలన్నా దొరికేలా ఈ పార్కును తీర్చిదిద్దనున్నారు. అన్ని రకాల హేచరీలు, నర్సరీలతో పాటు బ్రూడర్స్ బ్యాంక్, ఫీడ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు.

3 నుంచి వ్యవసాయ సాంకేతికతపై సదస్సు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబర్ 3నుంచి 5వ తేదీ వరకు గుంటూరు శివారులోని లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నూతన వ్యవసాయ సాంకేతికత-2022 సదస్సు నిర్వహిస్తున్నట్టు విశ్వవిద్యాలయం వీసీ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖలు, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంస్థల సహకారంతో నిర్వహించే ఈ సదస్సులో విశ్వవిద్యాలయం పరిధిలోని 33 పరిశోధనా స్థానాలు, 13 కృషి విజ్ఞాన కేంద్రాలు, 13 ఏరువాక కేంద్రాలు, సుమారు 150 ప్రైవేట్ సంస్థలు పాల్గొంటాయన్నారు. విత్తనాలు, ఎరువులు, కలుపు మందులు, తెగుళ్ల మందులు, పురుగు మందులు, యంత్రాలు, పరికరాలు, పనిముట్లు, వంటి స్టాల్స్‌ను వివిధ సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులకు, మహిళలకు నూతన వ్యవసాయ సాంకేతికతను చేరువ చేయడమే దీని లక్ష్యమన్నారు.

క్లుప్తంగా...

రావణుడిలాగా మోదీకి వంద తలలున్నాయా: ఖర్గే

న్యూఢిల్లీ: ''నా ముఖం చూసి ఓట్లు వేయండి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్ని ఎన్నికల్లో ప్రజలను కోరుతున్నారు. అంటే రావణుడిలాగా ఆయనకు వంద తలలున్నాయా?'' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎన్నికల సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మోదీ పేరుతో కాకుండా అభ్యర్థుల పేర్లతో ఓట్లడగాలంటూ బీజేపీకి చురక అంటించారు. ఖర్గే వ్యాఖ్యలను సీఎం భూపేంద్ర పటేల్ తీవ్రంగా ఖండించారు. ''గుజరాత్‌ను, రాష్ట్ర ప్రజలను ఖర్గే ఘోరంగా అవమానించారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారు'' అన్నారు.

ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనం 9, 10 తరగతులకే: కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ప్రీ మెట్రిక్ ఉపకార వేతన పథకాన్ని ఇకపై 9, 10వ తరగతి విద్యార్థులకే వర్తింపజేస్తామని కేంద్రం స్పష్టంచేసింది. గతంలో ఒకటి నుంచి పదో తరగతి దాకా మైనారిటీ విద్యార్థులకు ఈ పథకం కింద స్కాలర్‌షిప్ వచ్చేది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్బంధ ఉచిత విద్య అమలవుతున్నందున వారికి ఉపకార వేతన ప్రయోజనాల అవసరం ఉండదని చెప్పుకొచ్చింది. ఇకపై స్కాలర్‌షిప్‌ల కోసం 9, 10 తరగతి విద్యార్థుల దరఖాస్తులనే పరిశీలించాలని రాష్ట్ర, జిల్లా నోడల్ అధికారులకు సూచించింది. దీనిపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. 'దశాబ్దాలుగా లబ్ధి పొందుతున్న పేద విద్యార్థులను ఆర్థికంగా మరింత కుంగదీసేలా బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఆగ్రహం వ్యక్తంచేశారు.

సరిహద్దు వెంట డ్రోన్ల కలకలం



చండీగఢ్: సరిహద్దు వెంట గగనతల మార్గంలో మాదకద్రవ్యాల సరఫరాకు యత్నించిన పాకిస్తాన్ కుట్రను భారత సైన్యం భగ్నంచేసింది. పంజాబ్‌లో అమృత్‌సర్, తారన్‌తరణ్ జిల్లాల్లో చక్కర్లు కొడుతున్న రెండు పాక్ డ్రోన్లను కూల్చేసింది. ఇవి 10 కేజీల హెరాయిన్‌ను మోసుకొచ్చాయని బీఎస్‌ఎఫ్ అధికారులు చెప్పారు. సరిహద్దుల్లో ఒక డ్రోన్‌ను అమృత్‌సర్ దగ్గర్లో ఛాహర్‌పూర్ గ్రామం వద్ద సోమవారం రాత్రి మహిళా జవాన్లు కూల్చేశారు. రెండోదాన్ని కలశ్ హవేలియాన్ సమీపంలో కూల్చారు. వదాయ్ చీమా సరిహద్దు పోస్ట్ వద్ద మూడో డ్రోన్ సోమవారం రాత్రి చక్కర్లు కొట్టింది. దానిపై కాల్పులు జరపగా పాక్ భూభాగం వైపు వెనుతిరిగింది.

24 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసిన లంక

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించి చేపలవేటకు సిద్ధమయ్యారంటూ 24 మంది భారతీయ జాలర్లను శ్రీలంక అరెస్ట్‌చేసింది. ఉత్తర జాఫ్నా పరిధిలోని కరాయ్‌నగర్ తీరం సమీపంలో వీరిని మంగళవారం అరెస్ట్‌చేసి వారి ఐదు చేపల వేట పడవలను శ్రీలంక నావికా, గస్తీ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. దీంతో తమిళనాడు జాలర్లను విడుదల కోసం శ్రీలంక ప్రభుత్వంతో భారత సర్కార్ సంప్రదింపులు జరపాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఆయన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఇలా 252 మంది భారతీయ జాలర్లను శ్రీలంక అధికారులు అరెస్ట్‌చేశారు. భారత్-శ్రీలంక ద్వైపాక్షిక సత్సంబంధాలకు జాలర్ల అంశం సమస్యాత్మకంగా ఉన్న విషయం తెల్సిందే.

పాదయాత్రతో నాలో ఓపిక పెరిగింది: రాహుల్



ఉజ్జాయిని ఆలయంలో రాహుల్ పూజలు

ఇండోర్: భారత్ జోడో యాత్రతో తనలో ఓపిక, ఇతరులు చెప్పేది వినే సామర్థ్యం పెరిగాయని కాంగ్రెస్ నేత రాహుల్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో పాదయాత్రలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''నాలో ఓపిక పెరగడం ఎంతగానో సంతృప్తినిస్తోంది. 8 గంటలు నడిచినా విసుగు రావడం లేదు. ఎవరైనా నెట్టినా కోపం రావడం లేదు. యాత్రలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భరించాల్సిందే. ఆటంకాలు ఎదురైనంత మాత్రాన విరమించుకోవడం సరికాదు. ప్రజలు చెప్పేది సావధానంగా వింటున్నా. ఇది నాకెంతో మేలు చేస్తోంది. పాదయాత్ర ఇప్పటిదాకా ఎన్నెన్నో జ్ఞాపకాలను మిగిల్చింది'' అని చెప్పారు.



శత్రుదేశాల డ్రోన్లపై దాడి చేసి గాల్లో అవి అదుపుతప్పి కూలిపోయేలా చేసే సత్తా ఉన్న నల్ల గద్ద ఇది. పేరు అర్జున్. వీటికి ఈ తరహాలో భారత సైన్యం తర్ఫీదు నిచ్చింది. ఉత్తరాఖండ్‌లోని ఔలీ హిమాలయ పర్వత శిఖర ప్రాంతంలో మంగళవారం అమెరికా- భారత్ సంయుక్త సైనిక విన్యాసం 'యుద్ధ అభ్యాస్' సందర్భంగా ఇది తన పాటవాన్ని ప్రదర్శించింది.

నక్షత్రాల అవిర్భావం గుట్టు విప్పిన భారత టెలిస్కోప్!

న్యూఢిల్లీ: బిగ్‌బ్యాంగ్ తర్వాత 20 కోట్ల ఏళ్లకు ఏర్పడ్డ తొలి నక్షత్రాల రహస్యాలను భారత టెలిస్కోప్ బహిర్గతం చేసింది. బెంగళూరులోని రామన్ పరిశోధనా సంస్థ (ఆర్ఆర్ఐ)లో డిజైన్ చేసి, నిర్మించిన సరస్-3 రేడియో టెలిస్కోప్‌తో నక్షత్రాల గుట్టును బయట పెట్టారు. 2020 మార్చిలో కర్ణాటకలోని దండిగనహళ్లి చెరువు వద్ద, కొంతకాలం శరావతి బ్యాంక్ వాటర్స్ వద్ద ఈ టెలిస్కోప్‌ను ఏర్పాటు చేశారు. విశ్వం ఎలా ఏర్పడిందో తెలుసుకొనేందుకు ఆర్ఆర్ఐతోపాటు ఆస్ట్రేలియాకు చెందిన కామన్‌వెల్త్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (సీఎస్ఐఆర్ఓ), యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, యూనివర్సిటీ ఆఫ్ టెల్ అవివ్ పరిశోధకులు సంయుక్తంగా ఈ పరిశోధన నిర్వహించారు. సరస్-3 టెలిస్కోప్ డేటాను ఇటవలే విశ్లేషించారు. బిగ్‌బ్యాంగ్ అనంతరం తొలుత ఏర్పడిన నక్షత్ర మండలాల్లోని 3 కంటే తక్కువ శాతం వాయువులు నక్షత్రాలుగా రూపాంతరం చెందినట్లు గుర్తించామని ఆర్ఆర్ఐ ప్రతినిధి సౌరభ్ సింగ్ చెప్పారు. దేశీయంగా అభివృద్ధి చేసిన సరస్-3 రేడియో టెలిస్కోప్ కాస్మిక్ డాన్ ఆస్ట్రోఫిజిక్స్‌పై అవగాహన మరింత పెంచుకొనేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. బిగ్‌బ్యాంగ్ అనంతర కాలాన్ని కాస్మిక్ డాన్‌గా వ్యవహరిస్తారు. అప్పటి గెలాక్సీల్లో అత్యధిక సాంద్రత కలిగిన కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఉండేవి.



ఢిల్లీలో డేంజర్ బెల్స్!

నగరంలో వేగంగా క్షీణిస్తున్న వాయు నాణ్యత
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు..
- సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువ నమోదు
- అధ్వాన్నంగా మారిన వాయు నాణ్యత



ఏక్యూఐ	కాలుష్య స్థాయి
0-50	కాలుష్యం లేనట్టు
51-100	సంతృప్తికరం
101-200	మధ్యస్థం
201-300	అధ్వాన్నం
301-400	మరింత అధ్వాన్నం
401-500	తీవ్రం
500+	అత్యంత ప్రమాదకరం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రజలను కలవరపెడుతోంది. గత వారం రోజులుగా వాయు నాణ్యత వేగంగా క్షీణిస్తోంది. మరోవైపు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం నగరంలో కనిష్ట ఉష్ణోగ్రత 7.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యింది. సాధారణం కంటే ఇది 3 డిగ్రీలు తక్కువ అని వాతావరణ శాఖ వెల్లడించింది. గరిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. ఇక వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం.. ఢిల్లీలో మంగళవారం ఉదయం 9 గంటలకు 358గా రికార్డయ్యింది. అంటే గాలి నాణ్యత చాలా అధ్వాన్నంగా ఉన్నట్లు తేలింది. ఢిల్లీ ప్రభుత్వ సమాచారం ప్రకారం.. నగరంలో ఏక్యూఐ గరిష్టంగా 2018లో 390, 2019లో 368, 2020లో 435, 2021లో 462గా నమోదయ్యింది. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

సగం మంది పిల్లల్లో శ్వాస సమస్యలు


ప్రపంచంలో వాయు నాణ్యత అత్యంత అధ్వాన్నంగా ఉన్న నగరాల జాబితాలో ఢిల్లీ సైతం ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) గతంలోనే వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 1,650 నగరాల్లో సర్వే చేసి ఈ చేదు నిజాన్ని బహిర్గతం చేసింది. భారత్‌లో మనుషుల మరణాలకు కారణమవుతున్న వాటిలో వాయు కాలుష్యం ఐదో స్థానంలో ఉంది. దేశంలో ప్రతిఏటా 20 లక్షల మంది వాయు కాలుష్యం కాటుకు బలవుతున్నారు. ఢిల్లీలో నివసించే పిల్లల్లో సగం మంది పిల్లలు (దాదాపు 20.2 లక్షల మంది) శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు అధ్యయనంలో వెల్లడయ్యింది. నగర పరిసర ప్రాంతాల్లో పంట వ్యర్థాల దహనం, రోడ్లపై దుమ్మూ ధూళి, శిలాజ ఇంధనాల వినియోగం మితిమీరడం, తీవ్రమైన చలి.. వంటివి వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో కాలుష్య కల్లోలం

దేశ రాజధాని ఢిల్లీలోనే కాదు, తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోనూ వాయు కాలుష్యం బెంబేలెత్తిస్తోంది. శీతాకాలంలో సమస్య మరింత ముదురుతోంది. ఏక్యూఐ 201 నుంచి 300 దాకా ఉంటే పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నట్లు అర్థం. ఈ ఏడాది నవంబర్ 27న హైదరాబాద్‌లో ఏక్యూఐ 272గా నమోదయ్యింది. 2019లో ఇదే ప్రాంతంలో ఇదే సమయంలో ఏక్యూఐ 150గా రికార్డయ్యింది. నగరంలో మూడేళ్లలోనే కాలుష్య తీవ్రత భారీగా పెరగడం గమనార్హం. కరోనా ముందు కాలంతో పోలిస్తే హైదరాబాద్‌లో కాలుష్యం 55 శాతానికి పైగానే పెరిగినట్లు స్పష్టమవుతోంది. గాలిలో కంటికి కనిపించని ధూళి కణాల సంఖ్యను సూచించే 'పీఎం 2.5' కౌంట్ కూడా నగరంలో 'అనారోగ్యకర' స్థాయిలో ఉన్నట్లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వివరాలను బట్టి తెలుస్తోంది. పీఎం 2.5 ఎక్కువగా ఉంటే మనుషుల్లో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. పీఎం 2.5 స్థాయి 12 యూజీ-ఎం3 కంటే తక్కువగా ఉంటే 'ఆరోగ్యకరం'గా గుర్తిస్తారు. కానీ, హైదరాబాద్‌లో ఇటీవల ఇది ఏకంగా 93.69 యూజీ-ఎం3గా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

యూనివర్సిటీలు ఖాళీ

- ఖాళీ అవుతున్న చైనా వర్సిటీలు, విద్యా సంస్థలు
- 'జీరో కోవిడ్' వ్యతిరేక పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం వ్యూహం



బీజింగ్: చైనాలో 'జీరో కోవిడ్' నిబంధనలకు వ్యతిరేకంగా గొంతెత్తిన వారిపై షీ జిన్‌పింగ్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నిరసనలు, ఆందోళనలను ఎక్కడికక్కడ అణచివేస్తోంది. తాజాగా విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులను వారి ఇళ్లకు బలవంతంగా పంపిచేస్తుండడం గమనార్హం. దీంతో విద్యా సంస్థలు ఖాళీ అవుతున్నాయి. విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కరోనా నిబంధనలను సడలించాలని, అధ్యక్షుడు జిన్‌పింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జనం వీధుల్లోకి వస్తున్నారు. డ్రాగన్ దేశంలో ఈ స్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకత వెల్లువెత్తడం గత కొన్ని దశాబ్దాల్లో ఇదే మొదటి సారి. పోలీసులు, సైనిక సిబ్బంది భారీ సంఖ్యలో మోహరించడంతో బీజింగ్, షాంఘై సహా పలు నగరాల్లో మంగళవారం ఆందోళనలు పెద్దగా కనిపించలేదు. మరోవైపు 'జీరో కోవిడ్' వ్యూహాన్ని ఇప్పటికిప్పుడు మార్చే అవకాశం లేదని అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సంకేతాలిచ్చింది.

అప్పట్లో వర్సిటీలే ఉద్యమ కేంద్రాలు

అధినేత షీ జిన్‌పింగ్ చదువుకున్న తిసింగువా యూనివర్సిటీ నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. రాజధాని బీజింగ్‌లోని పాఠశాలలు సైతం ఇదే నిర్ణయం తీసుకున్నాయి. గాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని విద్యాసంస్థలు కూడా విద్యార్థులను వారి స్వస్థలాలకు పంపించాయి. కొన్ని యూనివర్సిటీలు విద్యార్థులకు బస్సులను సమకూర్చాయి. ఇకపై తరగతులు, వార్షిక పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నట్లు తేల్చిచెప్పాయి. ఇళ్లకు వెళ్లిపోవాలని కోరుకొనే వారికి అన్ని ఏర్పాట్లు చేస్తామని బీజింగ్ ఫారెస్ట్రీ యూనివర్సిటీ ప్రకటించింది. చైనాలో 1980వ దశకంలో ప్రజాస్వామ్య సంస్కరణల కోసం విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. అప్పట్లో యూనివర్సిటీ క్యాంపస్‌లే ఉద్యమ కేంద్రాలుగా మారాయి. 1989లో చరిత్రాత్మక తియానన్మెన్ స్క్వేర్ వద్ద విద్యార్థుల ఊరేగింపుపై సైన్యం దాడి చేసింది. యూనివర్సిటీల్లో విద్యార్థులు లేకుండా చేయడం ద్వారా జీరో కోవిడ్ వ్యతిరేక పోరాటాన్ని నీరుగార్చాలన్నదే ప్రభుత్వ వ్యూహమని యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో పనిచేస్తున్న చైనా రాజకీయ వ్యవహారాల నిపుణుడు డాలీ యాంగ్ విశ్లేషించారు. చైనాలో మళ్లీ కరోనా కేసులు పెరిగిపోతున్నాయి. నిత్యం 30 వేలకుపైగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. ప్రజలంతా కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా జనం రాకపోకలపై అధికారులు ఇప్పటికే ఆంక్షలు విధించారు. ప్రయాణాలు మానుకోవాలని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్సిటీలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తుండడం గమనార్హం.

కశ్మీర్ ఫైల్స్‌పై... మాటలు.. మంటలు

- ఇఫీ జ్యూరీ హెడ్ లపిడ్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు
- సిగ్గుపడాలి, క్షమాపణలు చెప్పాలి: ఇజ్రాయెల్ రాయబారి గిలాన్
- విమర్శలను నిరూపిస్తే సినీ సన్యాసం: దర్శకుడు అగ్నిహోత్రి



ముంబై: విడుదలైనప్పుడే పలు వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచిన కశ్మీర్ ఫైల్స్ సినిమా ఇఫీ ఉదంతం పుణ్యమా అని మరోసారి దేశవ్యాప్తంగా మంటలు రేపుతోంది. అదో చెత్త సినిమా అంటూ సోమవారం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) ముగింపు వేడుకల్లో ఇజ్రాయెల్‌కు చెందిన జ్యూరీ హెడ్ నదవ్ లపిడ్ చేసిన వ్యాఖ్యలపై ఇంటా బయటా విమర్శలు రేగుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా ఇది పెద్ద చర్చకు తెర తీసింది. నదవ్ వ్యాఖ్యలను భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి నవోర్ గిలాన్ తీవ్రంగా ఖండించారు. ''అతిథిని దైవంగా భావించే దేశానికి వచ్చి అలాంటి వ్యాఖ్యలు చేసినందుకు సిగ్గుపడాలి. ఇఫీ జడ్జీల ప్యానల్‌కు సారథ్య స్థానంలో కూచోబెట్టిన ఆతిథ్య దేశాన్ని నదవ్ తన వ్యాఖ్యలతో దారుణంగా అవమానించారు'' అంటూ మంగళవారం బహిరంగ లేఖలో దుయ్యబట్టారు. ''హిట్లర్ సారథ్యంలోని నాజీల చేతుల్లో లక్షలాది మంది యూదులు హోలోకాస్ట్ కాన్సంట్రేషన్ క్యాంపుల్లో నిస్సహాయంగా ఊచకోతకు గురయ్యారు. అదృష్టం కొద్దీ ఆ మారణహోమం నుంచి తప్పించుకున్న వారి వారసున్ని నేను. నీ వ్యాఖ్యలనే గీటురాయిగా తీసుకునే పక్షంలో హోలోకాస్ట్ దారుణాలపై హాలీవుడ్ దర్శక దిగ్గజం స్పీల్‌బర్గ్ తీసిన షిండ్లర్స్ లిస్ట్ కూడా చెత్త సినిమాయేనా అని భారతీయులు ప్రశ్నిస్తుంటే నా మనసెంతో గాయపడుతోంది. కశ్మీర్ ఫైల్స్‌పై నీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. వాటిని నువ్వు ఏ విధంగానూ సమర్థించుకోలేవు'' అంటూ తూర్పారబట్టారు. నదవ్ తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కశ్మీరీ పండిట్ల మండిపాటు

బీజేపీతో పాటు కశ్మీర్ ఫైల్స్ సినిమా రచయిత, దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి, అందులో ప్రధాన పాత్ర పోషించిన సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ తదితరులు కూడా నదవ్ విమర్శలను తీవ్రంగా ఖండించారు. ''భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ఉగ్రవాదుల వాదనకు మద్దతిచ్చేందుకు వాడుకున్న తీరు ఆశ్చర్యకరం. కశ్మీర్ ఫైల్స్ ప్రచారం కోసం తీసిందని, అందులో ఒక్క సీన్ గానీ, డైలాగ్ గానీ అవాస్తవమని నిరూపించినా ఇకపై సినిమాలే తీయను. నదవ్‌తో పాటు ప్రపంచ మేధావులకు, అర్బన్ నక్సల్స్‌కు ఇది నా సవాలు'' అని అగ్నిహోత్రి అన్నారు. నదవ్‌ను తక్షణం భారత్ నుంచి పంపించేయాలని కశ్మీరీ పండిట్లు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ కాన్సులర్ జనరల్ కొబ్బీ షోషానీ కూడా నదవ్ వ్యాఖ్యలను తప్పుబట్టారు.

కాంగ్రెస్‌ను ఊడ్చేస్తుందా?

- కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు ఈసారి ఆప్ గండి!
- ప్రధాన విపక్షంగా నిలవొచ్చంటూ విశ్లేషణలు



AAM AADMI PARTY

గుజరాత్‌లో అధికార పీఠం కోసం మూడు పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఎడాపెడా హామీలతో ప్రచార పర్వాన్ని ఇప్పటికే రక్తి కట్టించాయి. రేపు తొలి దశకు పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. డిసెంబర్ 5న రెండో, తుది దశ పోలింగ్‌తో అన్ని పార్టీల భవితవ్యమూ ఈవీఎంల్లోకి చేరనుంది. బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వేటికవే గెలుపుపై ధీమా వెలిబుచ్చుతున్నా అంతర్గతంగా మాత్రం ఇప్పటికే లోతుగా విశ్లేషణల్లో మునిగిపోయాయి. మూడో పక్షంగా బరిలోకి దిగిన ఆప్ ఈసారి గట్టిగా ఉనికి చాటుకోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ప్రధాన విపక్షమైన కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు ఆప్ గట్టిగా గండి కొట్టొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు...! గుజరాత్‌లో ఈసారి ఆప్ ఏకంగా 22 శాతం ఓట్లు సాధిస్తుందని సీఎస్‌డీఎస్ లోక్‌నీతి ఇటీవల చేసిన సర్వేలో తేలడం విశేషం! పరిస్థితులు కలిసొస్తే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ స్థానాన్ని ఆప్ భర్తీ చేస్తుందని కూడా సర్వేను పర్యవేక్షించిన భాను పర్మార్ అభిప్రాయపడ్డారు. ఇది కాంగ్రెస్‌కు కచ్చితంగా ఆందోళనకర పరిణామమేనని ఆయన చెప్పుకొచ్చారు. ''బీజేపీకి గట్టి ఓటు బ్యాంకుంది. కనుక ఆప్ దెబ్బ గట్టిగా పడేది బహుశా కాంగ్రెస్ మీదే. అందుకే ఈసారి ఆ పార్టీకి నష్టం భారీగానే ఉండొచ్చు'' అని విశ్లేషించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆప్ ప్రదర్శన ఈ అభిప్రాయాలను బలపరిచేదిగానే ఉంది. వాటిలో పార్టీకి 13.28 శాతం ఓట్లు దక్కాయి.

సూరత్‌లో అదే జరిగింది...

రాష్ట్రంలో సూరత్ ప్రాంతంలో ఆప్‌కు ఆదరణ బాగానే ఉంది. సూరత్ కార్పొరేషన్ ఎన్నికల్లో 120 సీట్లకు ఆప్ 27 స్థానాలు దక్కించుకోవడం విశేషం. ఈ క్రమంలో కాంగ్రెస్‌ను మూడో స్థానానికి నెట్టింది కూడా! ఈ ప్రాంతంలోని 12 అసెంబ్లీ స్థానాల్లో ఈసారి 7 నుంచి 8 గెలుస్తామని ఆప్ నేత కేజ్రీవాల్ ధీమా చెబుతున్నారు. సూరత్‌తో పాటు సౌరాష్ట్ర ప్రాంతంపైనా ఆప్ గట్టిగానే దృష్టి సారించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి ఈసారి ఎటూ నిర్ణయించుకోలేని ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. వీరితో పాటు దశాబ్దాలుగా ఓడుతున్న కాంగ్రెస్ తీరుతో విసిగిపోయిన ఆ పార్టీ లాయలిస్టులు, బీజేపీపై ఆగ్రహంగా ఉన్న వర్గాల ఓట్లు కూడా రాబట్టగలిగితే ఆప్ అందరినీ ఆశ్చర్యపరిచే ఫలితాలు సాధించవచ్చని రాజకీయ విశ్లేషకుడు ధవల్ వాస్వాడా అభిప్రాయపడ్డారు. ''దీనికి తోడు గ్రామీణ గుజరాత్ ఓటర్లు బీజేపీ కంటే కాంగ్రెస్‌కే మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. ఆప్ వారిని కూడా ఆకట్టుకునే ప్రయత్నంలో ఉంది! పట్టణ ప్రాంతాల్లో యువత, విద్యాధికుల్లో పార్టీకి ఎటూ ఎంతో కొంత ఆదరణ ఉంటుంది. అది అదనపు లాభంగా కలిసొస్తుంది'' అని ఆయన విశ్లేషించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

తొలి దశ ప్రచారానికి తెర

89 అసెంబ్లీ స్థానాలకు రేపే పోలింగ్

అహ్మదాబాద్: గుజరాత్ శాసనసభకు సంబంధించిన తొలి దశ ఎన్నికల ప్రచారపర్వం మంగళవారం ముగిసింది. తొలి దశలో దక్షిణ గుజరాత్, కచ్-సౌరాష్ట్ర పరిధిలోని 19 జిల్లాల్లోని 89 నియోజకవర్గాల్లో మొత్తం 788 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉండగా ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ తొలిసారిగా బరిలో దూకి త్రిముఖపోరుగా మార్చేసింది. ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి ఏసుదాన్ గడవీ పోటీ చేస్తున్న దేవభూమి ద్వారకా జిల్లాలోని ఖంభాలియా నియోజకవర్గంలో సైతం తొలి దఫాలోనే పోలింగ్ జరగనుంది. డిసెంబర్ ఒకటో తేదీన పోలింగ్ ఉంటుంది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పురుషోత్తం సోలంకీ, ఆరుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన కున్వర్‌జీ బవలియా, మోర్బీ 'హీరో' కాంతీలాల్ అమృతియా, క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా, గుజరాత్ ఆప్ అధ్యక్షుడు గోపాల్ ఇటాలియా తదితరులూ తొలి దఫాలోనే అదృష్టం పరీక్షించుకోనున్నారు. 89 మంది బీజేపీ, 89 మంది కాంగ్రెస్, 88 మంది ఆప్ అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు. బీజేపీ తొమ్మిది మంది, కాంగ్రెస్ ఆరుగురు, ఆప్ ఐదుగురు మహిళలకు టికెట్లు ఇచ్చింది. మొత్తం అభ్యర్థుల్లో 718 మంది పురుషులు, 70 మంది మహిళలున్నారు. 2,39,76,670 మంది ఓటేయనున్నారు. 9 వేలకుపైగా పట్టణ ప్రాంతాల్లో, 16వేలకుపైగా గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ జరగనుంది.

స్వేచ్ఛా వాణిజ్యానికి సై

భారత్‌తో బంధంపై బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ పునరుద్ఘాటన



లండన్: భారత్-బ్రిటన్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) అమలుకు కట్టుబడి ఉన్నట్లు బ్రిటన్ నూతన ప్రధాని రిషీ సునాక్ మరోమారు స్పష్టంచేశారు. ఒప్పందం వాస్తవరూపం దాల్చేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. విదేశాంగ విధానంపై బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల అతిథులు, ఆర్థిక నిపుణులు పాల్గొనే వార్షిక లండన్ మేయర్ బ్యాంకెట్ కార్యక్రమంలో సోమవారం సునాక్ ప్రసంగించారు. 'ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛాయుత వాణిజ్యానికి బ్రిటన్ ముందునుంచీ మద్దతు పలుకుతోంది. రాజకీయాల్లోకి రాకమునుపు నేను ప్రపంచంలోని వేర్వేరు దేశాల్లో వ్యాపారం చేశా. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యాపార అవకాశాలు పుష్కలం. 2050కల్లా ప్రపంచవాణిజ్యంలో సగం వాటాను ఇండో-పసిఫిక్ హస్తగతం చేసుకుంటుంది. అందుకే ఇండో-పసిఫిక్ సమగ్రాభివృద్ధి ఒప్పందం (సీపీటీపీపీ)లో భాగస్వాములం అవుతున్నాం. ఇందులోభాగంగా భారత్‌లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వీలైనంత త్వరగా అమల్లోకి వచ్చేందుకు కృషిచేస్తున్నాను' అని సునాక్ అన్నారు.

చైనాతో స్వర్ణయుగ శకం ముగిసినట్లే

'చైనాతో బ్రిటన్ కొనసాగించిన వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన స్వర్ణయుగం ముగిసింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం పెరిగాక అది సామాజిక, రాజకీయ సంస్కరణలు, సత్సంబంధాలకు దారితీయాలి. కానీ చైనా రాజ్యవిస్తరణవాదం, ఆధిపత్య ధోరణి కారణంగా అవి సాధ్యపడలేదు. చైనాతో బ్రిటన్ అద్భుత వాణిజ్యానికి తెరపడినట్లే' అన్నారు.



ప్రపంచంలోనే అత్యంత సువిశాల అగ్నిపర్వతం మవునా లోవా బద్దలైనపుడు ఆకాశం ఎరుపు, పసుపు, నారింజ రంగుల్లో వెలిగిపోతున్న దృశ్యం. 38 ఏళ్ల తర్వాత ఇది సోమవారం బద్దలైంది. అమెరికాలోని హవాయి ద్వీపంలోని హిలో పట్టణంలో తీసిందీ ఫొటో.

కరోనా టీకా వల్ల మరణిస్తే పరిహారం ఇవ్వలేం: కేంద్రం

న్యూఢిల్లీ: కోవిడ్-19 టీకా తీసుకున్నాక దుష్ప్రభావాల వల్ల మరణిస్తే బాధ్యత వహించబోమని కేంద్రం పేర్కొంది. బాధిత కుటుంబానికి పరిహారమివ్వలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కోవిడ్ వ్యాక్సినేషన్ వల్ల మరణించినట్లు అనుమానిస్తున్న ఇద్దరు యువతుల తల్లిదండ్రులు ప్రభుత్వం నుంచి పరిహారం కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ప్రభుత్వం తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రస్తుతం ప్రజలకు అందజేస్తున్న కరోనా టీకాలను థర్డ్ పార్టీలు (ప్రైవేట్ కంపెనీలు) తయారు చేస్తున్నాయని, అన్ని రకాల పరీక్ష తర్వాత నియంత్రణ సంస్థల ఆమోదంతోనే అవి మార్కెట్‌లోకి వస్తున్నాయని అఫిడవిట్‌లో పేర్కొంది. కరోనా టీకాలు సురక్షితమేనని, ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలు గుర్తించాయని వెల్లడించింది.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

బుధవారం, 30, నవంబర్, 2022



కోటి రుద్రాక్ష అభిషేకార్చన

మధురానగర్: ముత్యాలంపాడులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో కోటి రుద్రాక్షలతో అభిషేక అర్చనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి తెలిపారు.



రక్షణశాఖ అధికారులతో ఎంపీ భేటీ

చిలకలపూడి: ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో రక్షణ మంత్రిత్వశాఖ కార్యదర్శి గిరిధర్ అరమాణే, ఇతర అధికారులతో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం సమావేశమయ్యారు.

గంగాధర్‌కు శిల్పగురు అవార్డు



పెడన: కలంకారీ హ్యాండ్ ప్రింటింగ్ బ్లాకుల్లో పలు రకాల డిజైన్లు రూపొందించిన కొండ్రు గంగాధర్ సోమవారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ చేతుల మీదుగా జాతీయ స్థాయి శిల్పగురు అవార్డు అందుకున్నారు. బంగారు పతకం, రూ.2 లక్షలు నగదు, జ్ఞాపిక అందుకున్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి పర్యటనకు రూట్ మ్యాప్ పరిశీలన



ఆటోనగర్(విజయవాడతూర్పు): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 4న విజయవాడకు రానున్నారు. పటమట నారాయణపురంలోని మురళీ రెసిడెన్సీలో కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గన్నవరంలోని విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి పటమటకు రావడానికి అనువైన మార్గాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నగర ట్రాఫిక్ ఏడీసీపీ సర్కార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఏసీపీ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు గోవిందరాజులు, రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు ఎస్‌ఐలు కలిసి నిడమానూరు నుంచి పోరంకి వెళ్లే రహదారిని పరిశీలించారు. కారు పార్కింగ్, వీఐపీలు రావడానికి వీలైన మార్గాలను ఎంపిక చేశారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు గాను ముందు నుంచి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీసీపీ తెలిపారు.

హ్యాండ్ బాల్ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్ల ఎంపిక



గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ సమీపంలో మంగళవారం స్కూల్ గేమ్స్ అండర్‌-14, 17 హ్యాండ్‌బాల్ ఉమ్మడి కృష్ణాజిల్లా బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 250 మంది బాలబాలికలు ఈ సెలక్షన్స్‌కు హాజరయ్యారు. తొలుత ఎంపికల కార్యక్రమాన్ని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కేవీఆర్ కిషోర్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన సెలక్షన్స్‌లో ఉత్తమ క్రీడా నైపుణ్యం కనబరిచిన బాలబాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా కదిరిలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఎంపికైన బాలబాలికలు ప్రాతినిధ్యం వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తోట అజయ్‌కుమార్ తెలిపారు.

భవన నిర్మాణాల్లో పురోగతి చూపాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాల్లో పురోగతి చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణ పనులపై మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.107 కోట్ల నిధులతో 268 గ్రామ సచివాలయాలు, రూ.56.68 కోట్లతో 260 రైతు భరోసా కేంద్రాలు, రూ.41.82 కోట్ల నిధులతో 239 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు, రూ.25.97 కోట్లతో 147 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మొత్తం 914 ప్రాధాన్య భవనాలకు గాను 230 పైగా నిర్మాణాలు పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. వీటిలో పనులు తుది దశకు చేరుకున్న 117 భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మిగిలిన భవనాల నిర్మాణాలు ప్రారంభించి బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని స్పెషల్ ఆఫీసర్లు, అధికారులు పనులను వేగవంతం చేయాలన్నారు.

ఇప్పటం లోగుట్టు లోకేష్‌కి ఎరుక!

- పవన్ నోట పరుష మాటలేల
- మనసంతా మంగళగిరి వేదనేనా!
- వైఎస్సార్ సీపీ సామాజిక న్యాయంతో తలబొప్పి
- అంతర్మథనంలో టీడీపీ, జనసేన



ఇప్పటం గ్రామం(ఫైల్)

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: జనసేన, టీడీపీ ముఖ్యుల నోట తాజా మాట 'ఇప్పటం'. వారి అంతర్గత చర్చల్లోనూ అదే నిత్యం నానుతోంది. సినిమా డైలాగుల్లా పవన్ పరుష పదాల స్క్రిప్టునే వల్లెవేస్తున్నారు. నేతల తాజా వేదనకు మంగళగిరి వేదికగా మారిందనేది రాజకీయ వర్గాల్లో చర్చ. దీని లోగుట్టంతా లోకేష్, బాబులకే ఎరుక అనే వ్యాఖ్యలూ విస్తృతమయ్యాయి. నియోజకవర్గంలోని పేద వర్గాలను వైఎస్సార్ సీపీ అక్కున చేర్చుకుంటున్న వైనం, పదవుల పంపిణీలో అనుసరిస్తున్న సామాజిక న్యాయం, కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతిపక్ష పార్టీలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. స్వపుత్రుడు లోకేష్ మంగళగిరి నుంచే పోటీకి సాహసిస్తే రాజకీయ భవిష్యత్తు కొడిగడుతుందేమోననే ఆందోళనలతో దత్తపుత్రుడి ద్వారా రాజకీయ చదరంగాన్ని బాబు ఆడిస్తున్నారనేది పరిశీలకుల అభిప్రాయం. అందుకే ఇప్పటంను కేంద్రబిందువుగా చేసుకుని పావులు కదుపుతున్నారని విశ్లేషిస్తున్నారు.

భయపెడుతున్న చరిత్ర..

2019 సాధారణ ఎన్నికల్లో మాజీ మంత్రి నారా లోకేష్‌పై వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) 5,337 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి గంజి చిరంజీవిపై కేవలం 12 ఓట్లతో గెలిచిన ఆళ్ల పార్టీ మార్గదర్శనంలో రాజకీయంగా పాతుకుపోతున్నారని ప్రతిపక్షం గుర్తించింది. పై రెండు ఎన్నికలే కాకుండా టీడీపీ ఆవిర్భావం నుంచి తొమ్మిది పర్యాయాలు ఎన్నికలు జరగ్గా 1983, 85లో మాత్రమే ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు గెలిచారు. మిత్రపక్షాలుగా ఇతర పార్టీలకు టీడీపీ మద్దతిచ్చినా 1994లో సీపీఎం విజయం సాధించింది. తక్కిన నాలుగు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు.

పదవుల పంపిణీలోనూ...

నామినేటెడ్ పోస్టుల భర్తీ, రాజకీయ పదవుల నియామకాలలో ఎవరూ ఊహించని, అంచనాలకు అందని విధంగా వెనుకబడిన వర్గాల వారికి ప్రాధాన్యం దక్కడం మంగళగిరి నియోజకవర్గం ప్రత్యేకతగా నిలిచింది. దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి అత్యంత ప్రాధాన్యమైనదనేది ఈ ప్రాంత వాసులకు తెలియందేమీకాదు. కొండూరు ముత్తయ్య, షేక్ బాజి చైర్మెన్‌లు అయ్యారు. డైరెక్టర్ల నియామకంలోనూ వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రాధాన్యం దక్కింది. మంగళగిరి ఏఎంసీ చైర్మన్ల నియామకాలు కూడా గతానికి భిన్నంగా జరిగాయి. యార్డు డైరెక్టర్లు అందరూ మహిళలు కావడం మరీ ప్రత్యేకం. దుర్గగుడి పాలకమండలి సభ్యురాలు, శాప్ డైరెక్టర్... ఇలా ప్రతి నియామకంలో సోషల్ ఇంజినీరింగ్ ప్రత్యేకంగా ప్రతిబింబించింది.

లోకేష్‌ది చుట్టపు చూపు..

ఎమ్మెల్యే పనితీరుతో పోల్చినప్పుడు నారా లోకేష్‌ది నియోజకవర్గానికి చుట్టపు చూపే. అది కూడా మంగళగిరి పట్టణానికి పరిమితం అవుతున్నారు. ఆయన ఎర్రబాలెం, నీరుకొండ, కురగల్లు, ఈమని, దుగ్గిరాల, చిలువూరు, తుమ్మపూడి గ్రామాలలో పర్యటించగా.. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గమంతా నిత్యం కలియ తిరుగుతున్నారు. ప్రజలతో ఉంటున్నారు. గడప గడపకూ కార్యక్రమం వీటన్నింటికీ అదనం.

ఆర్కే తనదైన శైలిలో..



వైఎస్సార్ సీపీ మార్గదర్శనంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పనితీరును అందుకోవడంలో రాజకీయ ప్రత్యర్థి నారా లోకేష్ బాగా వెనుకపడిపోతున్నారు. చివరికి తన పార్టీ ముఖ్యనాయకులు, సీనియర్లలో విశ్వాసం కల్పించలేక పోతుండటంతో వారు వరుసగా పార్టీని వీడుతున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రధాన సామాజికవర్గం నాయకులుగా గుర్తింపు కలిగిన వారిలో గంజి చిరంజీవి, మురుగుడు హనుమంతరావు వైఎస్సార్ సీపీలో చేరారు. 2014లో టీడీపీ అభ్యర్థి గంజి చిరంజీవి. అంతకు ముందు మురుగుడు మాజీ మంత్రి. ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు తొలి నుంచి జగన్‌కు అభిమానిగా కొనసాగుతున్నారు. మరో సామాజికవర్గ ప్రముఖుడు, ఏడేళ్లపాటు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన చావలి ఉల్లయ్య ఆళ్లకు మద్దతుగా నిలిచారు. టీడీపీకే చెందిన మరో సామాజికవర్గ నాయకుడు వైఎస్సార్ సీపీలో చేరనున్నారనేది సమాచారం. టీడీపీకి మద్దతుగా నిలిచే మంగళగిరి పట్టణ ఓటర్లు మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో రివర్స్ అయ్యారు. దుగ్గిరాలలో టీడీపీకి పట్టు కలిగినవనే గుర్తింపు ఉన్న రేవేంద్రపాడు, మంచికలపూడి, ఈమని తదితర గ్రామాలలో వేగంగా రాజకీయ పరిణామాలు సంభవిస్తున్నాయి. దుగ్గిరాల పంచాయతీ దశాబ్దాలుగా కాంగ్రెస్ కాని, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలవలేదు. కానీ గత ఎన్నికల్లో 1200 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయం సాధించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అధికారపార్టీకి మద్దతు లభించింది. ఇతర గ్రామాలలోని ప్రత్యర్థి పార్టీల సానుకూల వర్గాలు, నాయకులు వైఎస్సార్ సీపీకి మద్దతుగా మారుతుండటం లోకేష్, ఆయన అనుచరులకు మింగుడుపడటం లేదనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

పవన్‌ను ఇప్పటం పంపడం ద్వారా...

మంగళగిరిలో లోకేష్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయిస్తున్న చంద్రబాబునాయుడు తన దత్తపుత్రుడైన పవన్ కల్యాణ్‌ను నియోజకవర్గంలోని ఇప్పటంలో దింపారని విశ్లేషకులు భావిస్తున్నారు. నానా హడావుడి చేయడానికి కూడా అదే కారణమంటున్నారు. వాస్తవంగా ఇప్పటంలో ఏం జరిగిందనేది హైకోర్టు తీర్పు తెలియజెప్పింది. ప్రజలూ నిశితంగా గమనిస్తూ అభివృద్ధి పనులకు, ప్రగతి కాముకులకు మద్దతుగా నిలుస్తుండటంతో ప్రత్యర్థి పార్టీ నేతలకు పాలుపోవడం లేదు. ఆందోళనలకు తెరతీస్తూ పచ్చని పల్లెల్లో చిచ్చు రేపడానికి కంకణం కట్టుకుంటున్నారని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

అభివృద్ధి పనుల్లో పారదర్శకత..

మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటు, అభివృద్ధి పనులతో పాటు నియోజకవర్గంలో జరిగే ప్రతి పనీ పారదర్శకతతో కూడుకున్నదే. రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం, డొంకల బాగుజేత, విద్యుత్తు లైన్లు మార్పు, కమ్యూనిటీ హాళ్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, టిడ్కో ఇళ్లు.. అన్ని నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి పనినీ ఎమ్మెల్యే పర్యవేక్షిస్తున్నారు. సమీక్షిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్యం పనులను ఉదయం నుంచే పరిశీలిస్తున్నారు.

విభిన్నంగా అదరగొట్టారు



అన్నిరకాలుగా ఆరోగ్యంగా ఉండి.. అవకాశాలు, సౌకర్యాలు ఉన్న వ్యక్తి విజయం సాధిస్తే అది అంత చెప్పుకోవాల్సిన అంశం కాదు.. కానీ వైకల్యంతో అవరోధాలను, అసౌకర్యాలను ఎదుర్కొంటూ.. జీవన సోపానాలుగా మలుచుకోవడమే విశేషం. అలా లక్ష్యాన్ని సాధించడంలో, ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో వైకల్యం అడ్డురాదని నిరూపించినవారు స్ఫూర్తి ప్రదాతలు. ఇదే కోవలోకి చెందుతారు ఈ 'విభిన్న' క్రీడాకారులు. ఏ విషయంలోనూ తాము ఎవరికీ తీసిపోమని చాటిచెబుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. -8లో▸

31,678 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు: గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 31,678 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,455 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్‌-5, 273, 341, 4884, సూపర్‌-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.13,500 నుంచి రూ.26,500 వరకు ధర లభించింది.

'భరోసా'కు మరో అవకాశం

- సాంకేతిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ దృష్టి
- డబ్బులు మంజూరైనా, ఖాతాల్లో జమకాని నగదు
- కృష్ణా జిల్లాలో 2,577 మంది రైతుల గుర్తింపు
- గ్రీవెన్స్‌లో నమోదు చేస్తే రైతులకు లబ్ధిచేకూరేలా చర్యలు



బందరు మండలం రుద్రవరం ఆర్బీకేలో దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది(ఫైల్)

మచిలీపట్నం: అన్నదాతకు అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే రైతులు అందరికీ ఏడాదికి రూ.13 వేల చొప్పున వైఎస్సార్ రైతు భరోసా పథకం అమలుచేస్తోంది. పంటల సాగు పెట్టుబడికి వెన్నుదన్నుగా నిలిచేలా సీజన్‌లో రెండు దఫాలుగా రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గత నెల 17న కృష్ణా జిల్లాలోని 1,50,213 మంది రైతులకు రూ.67.98 కోట్లు మంజూరు చేసింది. వారిలో 2,577 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు నేటికీ నగదు జమకాలేదు. వారందరికీ నగదు అందకపోవడానికి గల కారణాలపై విశ్లేషణ చేసి, సమస్యను పరిష్కరించాలనే ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయాధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు.

సాంకేతిక సమస్యతోనే..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రెండో విడతకు అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సాయం మంజూరైంది. సాంకేతిక సమస్యల కారణంగా కొంత మంది బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాలేదని అధికారులు గుర్తించారు. ఆధార్ నంబర్ బ్యాంకు అకౌంట్‌కు లింకు కాకపోవటం (ఎన్‌పీసీఐ)తోనే ఇలాంటి పరిస్థితి తలెత్తింది. వారి కోసం ఆర్బీకే స్థాయిలోనే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు దీనిపై తమ సిబ్బందికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు.

పథకాల అమల్లో పారదర్శకత

టీడీపీ హయాంలో రైతులకు ఇచ్చే సంక్షేమపథకాలను ఆ పార్టీకి చెందిన చోటామోటా నాయకులు, మధ్యవర్తులే స్వాహా చేసేవారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్ద పీట వేస్తోంది. నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమచేస్తోంది. ఇందుకోసం ఆన్‌లైన్ వ్యవస్థ తీసుకొచ్చింది. వ్యవసాయం చేసే భూ యజమానులతో పాటు, కౌలుదారులకు సైతం అన్ని రకాల పథకాలను వర్తింపజేస్తున్నారు.

ఆర్బీకే యూనిట్‌గా స్పెషల్ డ్రైవ్

అర్హులైన ఏ ఒక్క రైతుకూ భరోసా డబ్బులు అందలేదనే మాట రాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కృష్ణా జిల్లా వ్యవసాయశాఖాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టిసారించారు. రైతు భరోసా డబ్బులు మంజూరైనప్పటికీ, ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమకాని రైతుల జాబితాను మండలాల వారీగా గుర్తించారు. కోడూరు, గన్నవరం, గూడూరు, గుడ్లవల్లేరు, ఘంటసాల, చల్లపల్లి, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెడన, బాపులపాడు, మచిలీపట్నం, మొవ్వ వంటి మండలాల్లో వందమందికి పైగానే ఇలాంటి వారు ఉన్నారు. రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) యూనిట్‌గా తీసుకొని వ్యవసాయ సిబ్బంది గ్రామాలకు వెళ్లి డబ్బులు జమకాని రైతుల వాస్తవ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

ఆర్బీకేల్లో సంప్రదించాలి



అర్హులైన రైతులు అందరికీ రైతు భరోసా అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. కృష్ణా జిల్లాలో ఆ దిశగానే రైతులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నాం. సాంకేతిక సమస్యతోనే కొంత మందికి డబ్బులు అందలేదు. బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు లింకేజీ ప్రక్రియను ఆర్బీకేల్లోనే చేస్తున్నాం. రైతు భరోసా డబ్బులు పడని వారు వెంటనే గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలి.

- మనోహర్‌రావు, వ్యవసాయాధికారి, కృష్ణా జిల్లా

క్యూఆర్ కోడ్.. క్యూలైన్‌కు చెక్

విజయవాడ జీజీహెచ్‌లో ఓపీ చీటీ.. ఇక ఈజీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో అవుట్‌పేషెంట్స్ ఓపీ చీటీల కష్టాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇక మీదట చీటీల కోసం క్యూలో నిలవాల్సిన అవసరం లేకుండా, వెయిటింగ్‌ను తగ్గించేందుకు నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. రాష్ట్రంలోనే తొలిసారిగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది.

ఏదైనా ఒక యాప్ ఉంటే..

రోగి స్మార్ట్‌ఫోన్‌లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అథారిటీ(ఆభా), లేదా భాగస్వామ్య యాప్‌లు పేటీఎం ఆరోగ్య సేతు వంటి ఏదొక యాప్ ఉంటే చాలు. ఆస్పత్రికి వెళ్లగానే ఓపీ బ్లాక్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే.. అప్పటికే రోగి వివరాలు ఆన్‌లైన్‌లో యాప్‌లో నమోదై ఉండటంతో, వారికి ఒక టోకెన్ నంబర్ వస్తుంది. వారి ఫోన్‌కి వచ్చిన టోకెన్ నంబర్‌ను బట్టి ఓపీ కౌంటర్‌లో చీటీ అందిస్తారు. అది తీసుకుని వారు పరీక్ష చేయించుకోవాల్సిన విభాగానికి వెళ్లొచ్చు. అయితే రోగి పేరుతో రిజిస్టర్ అయిన యాప్ నుంచి మాత్రమే స్కాన్ చేయాల్సి ఉంది.

సమయాన్ని తగ్గించేందుకే..

ఇప్పటి వరకూ రోగి క్యూలో నిల్చొని కౌంటర్ వద్దకు వెళ్లి పేరు, చిరునామా, ఫోన్ నంబరు, వయస్సు, ఏ విభాగానికి వెళ్లాలో ప్రతీది చెప్పాల్సి వస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రికి మూడు వేల మంది ఓపీ రోగులు వస్తుండటంతో చీటీలు తీసుకోవడంలో వెయిటింగ్ ఎక్కువగా ఉంటుంది. దానిని నివారించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం దోహదపడుతుందని వైద్యులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఈ విధానాన్ని రక్తపరీక్షలు, ఎక్స్‌రే, సీటీ స్కాన్ వంటి అన్ని చోట్ల ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి తెలిపారు. రోజు రోజుకు క్యూఆర్‌కోడ్‌ను ఉపయోగించే రోగుల సంఖ్య పెరుగుతున్నట్లు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ ఆనంద్ 'సాక్షి'కి తెలిపారు.



విజయవాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్



టోకెన్ నంబర్లు చూపే డిజిటల్ స్క్రీన్

రైల్వే ఆస్తుల ప్రైవేటీకరణను నిలిపివేయాలి

మాజీ ఎంపీ, రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బాసుదేబ్ ఆచార్య



కృష్ణలంక(విజయవాడతూర్పు): దేశంలో రైల్వే ఆస్తులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను, మానిటైజేషన్‌ను నిలిపివేయాలని మాజీ ఎంపీ, రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బాసుదేబ్ ఆచార్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) స్వర్ణోత్సవ సంబరాలు, జాతీయ 23వ ద్వైవార్షిక మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బినియల్ జనరల్ బాడీ మీటింగ్(బీజీఎం)కు అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.బి.దుత్త అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాసుదేబ్ ఆచార్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అసోసియేషన్ సెంట్రల్ జాయింట్ సెక్రటరీ కె.సి జేమ్స్ అధ్యక్ష నివేదికను సమర్పించగా, సెంట్రల్ ట్రెజరర్ ఆర్థిక నివేదికను అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, స్వర్ణోత్సవ వేడుకల కన్వీనర్ టి.హనుమయ్య పాల్గొన్నారు.

డీఈఓ ఖాతాలో నగదు మాయం

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి బ్యాంకు ఖాతాలో గుర్తు తెలియని వ్యక్తులు నగదు మాయం చేశారు. డీఈఓ ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. డీఈఓ తాహెరా సుల్తానా శాలరీ అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గడిచిన ఆరు నెలలుగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు డ్రా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం డీఈఓ బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలు చూసుకోగా రూ.4.90 లక్షలు మాయమైనట్లు గుర్తించారు. నగదు లావాదేవీలన్నీ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా జరగడంతో ఆమె మంగళవారం చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి ఎస్‌ఐ నిరంజన్ తెలిపారు.



భక్తిశ్రద్ధలతో కావడి మహోత్సవం

సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా మంగళవారం కావడి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయవాడ నేతాజీ బ్రిడ్జి వద్ద నున్న హరి హర క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులు ఉదయాన్నే శిరస్నానమాచరించి, కావడులను నగర వీధుల్లో మోసుకుంటూ వచ్చారు. దారి మధ్యలో దేవాలయాలను దర్శించి, చివరిగా సుబ్రహ్మణ్య స్వామికి కావడులను సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



భార్య కాపురానికి రావడం లేదని యువకుడి బలవన్మరణం

పెడన: మనస్పర్ధల నేపథ్యంలో పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెడన పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సురేష్(30)కి పెడన మండలం చేవేంద్ర గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వారికి రెండు సంవత్సరాలు బాబు, ఏడు నెలల పాప ఉన్నారు. మద్యానికి బానిసైన సురేష్ తరుచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సురేష్ భార్య పుట్టింటికి వచ్చేసింది. సురేష్ మంగళవారం చేవేంద్రలోని అత్తగారింటికి వచ్చిన కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపం చెందిన అతన తన వెంట తెచ్చుకున్న విషాన్ని తాగేశాడు. దీంతో సురేష్‌ను మచిలీపట్నం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. సురేష్ తండ్రి రెడ్డి రఘునాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవిచంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు ఎమ్మెల్యే వంశీ ఆపన్నహస్తం

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): 'రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. నాకు బతకాలని ఉంది.. నా ప్రాణాలు కాపాడండి..' అంటూ ఓ మహిళ కన్నీటితో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌ను వేడుకుంది. చలించిన ఆయన తాను న్నానంటూ ఆమె భరోసా ఇచ్చారు. అతిక్లిష్టమైన శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేయటంతో పాటు, అందుకు అయ్యే ఖర్చును భరించారు. బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌కు చెందిన దుట్టా ఉదయ కిరణ్ రోజువారీ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య పావని (22), ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గతేడాది గన్నవరం మండలం కేసరపల్లి వద్ద పావని రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో ఆమె తల రోడ్డుకు బలంగా తగలడంతో మెదడులో రక్తం గడ్డకట్టింది. ఎడమవైపు పుర్రె భాగం తీవ్రంగా దెబ్బతింది. దీంతో పావనిని కుటుంబ సభ్యులు ఎనికేపాడులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వైద్యులు రెండు సార్లు పావని


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుట్టా పావని

బ్రెయిన్‌కు ఆపరేషన్లు చేశారు. తలలో దెబ్బతిన్న పుర్రె భాగాన్ని శస్త్రచికిత్స చేసేందుకు కొద్దిరోజులు భద్రపరిచినా, ఆ తర్వాత పూర్తిగా దెబ్బతిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో కృత్రిమ పుర్రె (ప్లాస్టిక్ సింకుల్) అమర్చాల్సి ఉందని, ఈ సర్జరీ తమ వల్ల కాదని వైద్యులు తేల్చి చెప్పారు. అప్పటికే రూ.10 లక్షలకు పైగా ఖర్చు కావటంతో ఉదయకిరణ్‌కు ఏమి చేయాలో పాలుపోలేదు. ఈ తరుణంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వద్దకు వెళ్లి తన ప్రాణాలు కాపాడాలని పావని కన్నీటి పర్యంతమైంది. చిన్న వయస్సులో ఆమెకు వచ్చిన కష్టాన్ని చూసి చలించిన ఎమ్మెల్యే వంశీమోహన్ తనకు తెలిసిన కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆమెను పరీక్షించాల్సిందిగా సూచించారు. పావని తలను పూర్తిస్థాయిలో పరిశీలించిన వైద్యులు ఆమె తలలో కొప్పా త్రీడీ టెక్నాలజీతో కూడిన కృత్రిమ పుర్రె భాగాన్ని పెట్టి, దానిలో మెదడును అమర్చితే ప్రాణాలు కాపాడొచ్చని వైద్యులు తెలిపారు. పుర్రె తయారీకి రూ.3 లక్షల ఖర్చవుతుందని చెప్పారు. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే వంశీమోహన్ తక్షణమే అందించి, ప్రత్యేకంగా పుర్రె భాగాన్ని సిద్ధం చేయించారు. త్వరలోనే పావని తలకు ఆపరేషన్ పూర్తి చేసి పుర్రె అమర్చనున్నారని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

■ విభిన్నంగా అదరగొట్టారు


పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్‌కుమార్ తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ పోటీలను విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రారంభించారు. రెండు జిల్లాల్లోని పది విభిన్న ప్రతిభావంతుల పాఠశాలల నుంచి 450 మంది క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. 6–10, 11–15 వయసు విభాగాల్లో బాలబాలికలు, సీనియర్స్ స్త్రీ, పురుషులకు అథ్లెటిక్స్(50, 100 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, ట్రై సైకిల్ రేస్) చెస్, సాఫ్ట్‌బాల్, క్యారమ్స్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. డిసెంబర్ మూడో తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కుమార్ తెలిపారు. ప్రారంభోత్సవంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, 24వ డివిజన్ కార్పొరేటర్ కె.అనిత, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్ పాల్గొన్నారు.


పరుగుపందెంలో పాల్గొన్న దివ్యాంగులు


షార్ట్‌పుట్ విసురుతున్న చిన్నారి


పరుగుపందెంలో పాల్గొన్న దివ్యాంగులు

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు

విస్సన్నపేట(తిరువూరు): ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి టి.కృష్ణబాబు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కొత్తభవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరువూరు నియోజకవర్గంలో 15 హ్యాబిటేషన్లలో కిడ్నీవ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను మూడు నెలలకు సరిపడా అందుబాటులో ఉంచామని తెలిపారు. అవసరమైన వైద్య పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎ.కొండూరు ప్రాంతంలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వైద్యాధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కృష్ణబాబు

మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కుకు సిద్ధమైన రాజమార్గం


సిద్ధమైన మల్లవల్లి ఏపీఐఐసీ రహదారి

- 150 అడుగుల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రహదారి
- రూ.15 కోట్లతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం
- 3.8 కి.మీ. మేర మీర్జాపురం – మల్లవల్లి రోడ్డు

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రియల్ పార్కు, మెగా ఫుడ్ పార్కుకు వెళ్లే అప్రోచ్ రోడ్డు సిద్ధమైంది. 216 హెచ్ జాతీయ రహదారి నుంచి మల్లవల్లి వరకు సువిశాల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రూ.15 కోట్లతో నిర్మించారు. ఇప్పటికే మోడల్ ఇండస్ట్రియల్ పార్కు, మెగా ఫుడ్ పార్కులో పలు పరిశ్రమలను ఏర్పాటు చేయటంతో రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా రాజమార్గాన్ని ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లాలోని నూజివీడు మండలం మీర్జాపురం వద్ద ఎంఎన్‌కే రహదారి (216హెచ్ హైవే) నుంచి 3.8 కిలోమీటర్ల మేర ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించారు. దీని కోసం మీర్జాపురం, మల్లవల్లి గ్రామాల్లో దాదాపు 39 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. 150 అడుగుల వెడల్పుతో సెంట్రల్ లైటింగ్, రహదారికి రెండు వైపులా పచ్చని మొక్కలు, డ్రైనేజీ సదుపాయంతో ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రియల్ పార్కు సర్వాంగ సుందరంగా తయారైంది. గతంలో మీర్జాపురం, కొత్త మల్లవల్లి గ్రామాల మీదుగా ఇరుకు రోడ్డులో భారీ వాహనాలు ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లాల్సి వచ్చేది. అశోక్ లేలాండ్, పార్లే, మోహన్ స్పిన్‌టెక్స్, శివతార వంటి పెద్ద కంపెనీలతో పాటుగా పలు ఫుడ్, ఆగ్రో, ఫీడ్స్, ఆటో మొబైల్, బేవరేజ్ ఉత్పత్తులను తయారు చేసే సంస్థలు మల్లవల్లిలో ఏర్పాటయ్యాయి. ఆయా ఫ్యాక్టరీలకు నిత్యం అధిక సంఖ్యలో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 150 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించింది.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభ్యర్థులు

మచిలీపట్నంటౌన్: పోలీస్‌శాఖలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగ యువతలో ఉత్సాహం నెలకొంది. ఉద్యోగసాధనే లక్ష్యంగా పరీక్షల్లో రాణించేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా 411 ఎస్‌ఐ, 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని నిరుద్యోగ యువత స్వాగతిస్తోంది. ఎన్నో ఏళ్లుగా పోలీస్‌శాఖలో ఉద్యోగమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులు మచిలీపట్నంలోని చాలెంజ్ కోచింగ్ సెంటర్ వద్ద ముఖ్య మంత్రి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఉద్యోగ ప్రదాత సీఎం జగన్ అంటూ నినాదాలు చేశారు.

రేపు కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల జూడో పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల జూడో స్త్రీ, పురుషుల క్రీడా పోటీలు విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో డిసెంబర్ ఒకటో తేదీన జరుగుతాయని వర్సిటీ జూడో క్రీడ చైర్మన్, సప్తగిరి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.డి. శ్రీదేవి తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు పోటీల ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. పోటీల్లో క్రీడాకారులు చూపిన ప్రతిభ ద్వారా యూనివర్సిటీ జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు.

వివాహితపై భర్త హత్యాయత్నం

పెడన: వంట చేసేందుకు నీళ్లు తీసుకురావాలని కోరిన భార్యపై ఆగ్రహంతో ఆమె చీరకు నిప్పంటించిన భర్తపై పెడన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొంకేపూడికి చెందిన యాతగిరి మహాలక్ష్మి(20) ఈ నెల 28న ఉదయం ఇంట్లో వంట చేస్తున్న సమయంలో మంచినీళ్లు తీసుకురావాలని భర్త సంజీవులును కోరింది. తనకే పని చెప్పిందన్న ఆగ్రహంతో సంజీవులు భార్య వంట చేస్తున్న సమయంలో చీరకు నిప్పు అంటించాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోని అవుట్ పోస్ట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు పెడన ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మల్కాపురం(జగ్గయ్యపేట): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు సంస్థ ఉద్యోగి మృతి చెందిన ఘటన గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మల్కాపురం గ్రామానికి చెందిన ఇడుపులపాటి సంతోష్ (26) జగ్గయ్యపేట పట్టణంలోని ఓ ప్రైవేటు సంస్థలో కొంత కాలంగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు నిర్వహించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మల్కాపురం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చిల్లకల్లు ఎస్‌ఐ చిన్నబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పమిడిముక్కల(పామర్రు): మంటాడ – లంకపల్లి ప్రధాన రహదారిపై కపిలేశ్వరపురం పాపయ్య చెరువు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అగినపర్రు శివారు బొడ్డువానిగూడెంనకు చెందిన కుంపటి రామకోటి (31) గోసాల వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయంకావడంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


ఘటనాస్థలంలో రామకోటి మృతదేహం

మృతుడికి ఏడాది క్రితం వివాహమైందని, అతని భార్యం ప్రస్తుతం గర్భిణి అని బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రాణ రక్షణ కల్పించండి


పోలీసులను ఆశ్రయించిన యువతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): పామర్రులో ఓ ప్రేమజంట పంచాయితీ వ్యవహారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరింది. ప్రేమికుడి చేతిలో మోసపోయిన బాధితురాలు మూడు రోజుల క్రితం అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రియుడి బావ వల్ల తనకు ప్రాణహాని ఉందంటూ మంగళవారం జిల్లా పోలీసు అధికారులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం మేరకు.. పామర్రుకు చెందిన ఎడ్ల దిలీప్‌కుమార్, దుర్గాభవానీ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ మానసికంగా, శారీరకంగా దగ్గరయ్యారు. దుర్గాభవానీతో తొలుత పెళ్లికి అంగీకరించిన దిలీప్‌కుమార్ వివాహ సమయానికి అడ్డం తిరిగాడు. దిలీప్ బావ బొమ్మి నాగప్రకాష్ కారణంగా అతను పెళ్లికి నిరాకరించాడు. మోసాన్ని తట్టుకోలేని దుర్గాభవానీ పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దిలీప్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. దుర్గాభవానీ మంగళవారం జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటరామాంజనేయులును కలిసి తనకు జరిగిన అన్యాయంపై మళ్లీ ఫిర్యాదు చేసింది. దిలీప్‌కుమార్‌తో తన వివాహం ఆగిపోవటానికి ప్రధాన కారకుడు అతని బావ నాగప్రకాష్ అని, పామర్రు పోలీసులు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారని పేర్కొంది. నాగప్రకాష్ తనను అంతమొందిస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. స్పందించిన ఏఎస్పీ ఆమె ఫిర్యాదును పామర్రు సీఐకి బదిలీ చేశా బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ దుక్కిపాటి మధుసూదన్‌రావు

కంకిపాడు(పెనమలూరు): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ దుక్కిపాటి మధుసూదన్‌రావు సూచించారు. కంకిపాడు, పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పరీక్షించారు. ఆయా పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ, విద్యార్థుల హాజరుశాతం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీయాలన్నారు. అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంచాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి స్థాయి పెంపుదలకు, సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బట్టీ పట్టే విధానానికి పూర్తిగా స్వస్తి పలకాలని, అర్థం చేసుకుంటూ విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. అన్ని పాఠశాలల్లోనూ ఫిర్యాదుల పెట్టెలను విధిగా ఏర్పాటుచేయాలన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సుధారాణి, సూర్యకుమారి పాల్గొన్నారు.


కంకిపాడులో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న మధుసూదన్‌రావు

లైంగిక దాడి కేసులో యావజ్జీవ శిక్ష

తెనాలి రూరల్: బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం పెదరావూరు గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడిపై అదే గ్రామానికి చెందిన సయ్యద్ ఫిరోజ్, షేక్ దస్తగిరి, షేక్ సుభాని (తండ్రి కరిముల్లా), షేక్ సుభాని (తండ్రి ఖాసీంసాహెబ్) 2013 మార్చి, ఏప్రిల్ నెలల్లో లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలుడు అస్వస్థతకు గురవడంతో విషయం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. అప్పటి ఎస్‌ఐ షేక్ మౌలాషరీఫ్ పోక్సో, ఇతర ఐపీసీ చట్టాల కింద కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కేసు గుంటూరులోని పోక్సో కోర్టులో మంగళవారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కె.రామకృష్ణారావు నిందితులు నలుగురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.4 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ కె.శ్యామలాదేవి వాదించారు.

క్లుప్తంగా

కూచిపూడి నృత్యంలో శృతి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 26 వరకూ నిర్వహించిన జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో కూచిపూడి విభాగంలో కె.శృతి సమన్వి ప్రథమ బహుమతి సాధించింది. దీంతో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న శృతి సమన్వికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, సహచర విద్యార్థులు మంగళవారం అభినందనలు తెలియచేశారు.

డివైడర్‌లు ధ్వంసం... పర్యవేక్షణ శూన్యం



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని డివైడర్‌లు వాహనాల ధాటికి పగిలిపోతున్నాయి. మరీ ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహనాలు వీటిని ఢీకొట్టడం వల్ల పగిలిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పంటకాలువ రోడ్డు నుంచి కాటా వరకు ఈ పరిస్థితి నెలకొని ఉంది. వీటి పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ దుస్థితికి కారణం అంటున్నారు. అయితే వీటిని ధ్వంసం చేసిన వారిని గుర్తించడం గాని... గుర్తిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కాని లేవు. వంద అడుగుల రోడ్డులో ఎక్కడపడితే అక్కడ డివైడర్ పగిలి దర్శనమిస్తోంది. కొందరు డివైడర్‌లలో పాత వస్తువులను పడవేస్తున్నారు. దీని వల్ల మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిత్యం అక్కడ ట్రాఫిక్ జామ్‌లే!



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక శివాలయం రోడ్డులో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. జనశిక్షణ సంస్థాన్ రోడ్డు, శివాలయం రోడ్డు జంక్షన్‌లో వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతోనే ఈ సమస్య తలెత్తుతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం ఇక్కడ ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరుతున్నాయి. ఉదయం కార్యాలయాలకు, విద్యా సంస్థలకు వెళ్లే సమయం, సాయంత్రం ఉద్యోగులు, విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయంలో ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. జనశిక్షణ సంస్థాన్, శివాలయం రోడ్డు వెడల్పు ఉన్నదే ముప్పై అడుగులు. అందులోనే రోడ్డు పైనే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతోనే ఈ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.

రాఘవ కళాకేంద్రానికి గుర్తింపు

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన భారతీ రాఘవ నృత్య కేంద్రం నిర్వహించే నృత్య, కళాసేవలను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు ఉన్న ప్రాచీన కళాకేంద్ర తమ అనుబంధ సంస్థగా గుర్తించిందని ఈ మేరకు యూనివర్సిటీ అధికారుల నుంచి ధ్రువపత్రం అందిందని నిర్వాహకురాలు డీ అపర్ణా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాచీన కళాకేంద్ర స్థాపించి 52 సంవత్సరాలైందని పేర్కొన్నారు. ప్రతి ఏటా సంప్రదాయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, కథక్, మణిపురి, స్థానిక జానపద కళలు, శాస్త్రీయ సంగీతంలో వివిధ శాఖల పరీక్షలు కోర్సులను నిర్వహిస్తుందని వార్షిక పరీక్షలుంటాయని తెలిపారు. దానికి కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ గుర్తింపు ఉంటుందని తమ సంస్థ ద్వారా పరీక్షలకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 9347266 277లో సంప్రదించాలని కోరారు.

భర్త వేధింపులతో ఇల్లు వదిలి వెళ్లిన మహిళ

పాయకాపురం(విజయవాడరూరల్): భర్త వేధింపులు తాళలేక పిల్లలను వదిలివేసి నాగమణి అనే మహిళ వెళ్లినట్టు నున్న పోలీసు స్టేషన్లో మంగళవారం ఆమె తల్లి దుర్గ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు వాండే కాలనీకి చెందిన నాగమణికి ఆరు సంవత్సరాల క్రితం రాజరాజేశ్వరిపేటకు చెందిన బచ్చు మహేష్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లల సంతానం. ఆమె భర్త బాధలు పెడుతుంటే నాగమణి నాలుగు నెలల క్రితం పిల్లలతో ఫిర్యాది ఇంటికి వచ్చింది. నాగమణిని ఆమె అక్క ఇంట్లో(రాధానగర్లో) ఉండేది. భర్త అక్కడకు వచ్చి గొడవ చేయగా, సోమవారం పిల్లలను వదిలి నాగమణి వెళ్లిపోయిందని పోలీసు స్టేషన్లో ఆమె తల్లి ఫిర్యాదు చేసింది.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

గుణదల (విజయవాడతూర్పు): అణగారిన పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిత్యం పాటుపడుతున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. నగరంలోని నాలుగవ డివిజన్ పరిధిలో ఉన్న అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ రూపొందించి అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలు జన రంజకంగా ఉన్నాయని చెప్పారు.అన్ని వర్గాల ప్రజలను లబ్ధిదారులుగా చేస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు, ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం జగన్ సఫలీకృతమయ్యారని వివరించారు.

ఆ రెండు పార్టీలకు ఓటమి భయం

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ టీడీపీ, జనసేన పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని దేవినేని అవినాష్ ఎద్దేవా చేశారు.అందుకు ఇరు పార్టీల నేతలు తెరవెనుక కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో తమ ఓటుతో వారికి బుద్ధి చెబుతారని చెప్పారు. ఆయా పార్టీల నేతలు ఎన్ని కుట్రలు పన్నినా మరో మూడు దశాబ్దాల పాటు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందని దేవినేని అవినాష్ తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ ఇన్‌చార్జ్ గల్లా పద్మావతి, అంబేడ్కర్ కాలనీ వాసులు కోన శరత్, వినోద్, సునీల్, మీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న దేవినేని అవినాష్

మొబైల్ కోర్టులో పలువురికి జరిమానాలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో జనావాసానికి అవాంతరాలు కలిగించే విధంగా వ్యాపారాలు చేసినా, జంతువులను రోడ్లపై వదిలేసినా చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని మున్సిపల్ మొబైల్ కోర్టు జడ్జి యు.రామ్మోహన్ తెలిపారు. వీఎంసీ పరిధిలోని సత్యనారాయణపురం సర్కిల్-2 కార్యాలయంలో మంగళవారం ఆయన మొబైల్ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తున్న, రోడ్లపై పశువులను వదిలేస్తున్న పలువురికి రోడ్లపై చెత్త వేస్తున్న వారికి రూ.13వేలు జరిమానా విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్న వాటిని విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారిపై కూడా అధికారులు దృష్టి సారించాలని, నిత్యం ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ విక్రయించే షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు.



సర్కిల్-2 కార్యాలయంలో కక్షిదారులకు జరిమానాలు విధిస్తున్న జడ్జి రామ్మోహనరావు

రేపు టెక్‌స్పార్క్స్ 2కే 22

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డిసెంబరు 1వ తేదీన టెక్‌స్పార్క్స్ 2కే 22 పేరుతో రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. అందులో భాగంగా మంగళవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. టెక్‌స్పార్క్స్ 2కే 22లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఊర్మిళానగర్‌కు చెందిన ఇంటూరి ద్వారకేశ్వర్ ఆకాష్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం తలనొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పి కళాశాల మానేసి ఇంటివద్దే ఉన్నాడు. తండ్రి పనికి వెళ్లగా , తల్లికూడా ఉంటివద్దనే ఉంది. రాత్రి 10 గంటల సమయంలో తండ్రి ఇంటికి వచ్చి చూడగా ద్వారకేశ్వర్ కనిపించలేదు. చుట్టుపక్కల వారిని ఆరాతీయగా రాత్రి ఏడు గంటల సమయంలో బయటకు వెళ్లాడని చెప్పారు. కళాశాలలో ద్వారకేశ్వర్ స్నేహితులకు ఫోన్ చేసి అడిగినా ఆచూకీ తెలియకపోవడంతో అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం

నేడు ప్రారంభోత్సవం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ప్రారంభించనున్నారు. కానూరులో నూతనంగా 8 ఎంవీఈ ట్రాన్స్‌ఫారంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. మున్సిపాలిటీ దాదాపు 25 సెంట్ల స్థలం కేటాయించింది. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ సిద్ధం చేశారు. కేసీపీ కాలనీ, వికసితనగర్, పీవీపీ కాలేజీ ప్రాంతం, శ్రీరామ్‌నగర్, పోలీస్ స్టేషన్ ప్రాంతం, కామయ్యతోపు ప్రాంతాలకు ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది.

నేడు ప్రారంభం..

కానూరులో రూ.4 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మాజనార్దన్‌రెడ్డి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ అధికారులు, పలువురు పాల్గొంటారు.



కానూరులో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఘనంగా చేశారు. ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. స్వామివారిని పెళ్లి కుమారుని చేసి ఆలయ ప్రాంగణంలో మేళ తాళాలతో పల్లకీలో ఊరేగించారు. ఉదయం 10.30 గంటలకు శివసాధంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. భక్తులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి

నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా మంగళవారం విశేష పూజలు జరిగాయి. స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన పిమ్మట వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం జరిగింది. అర్చకులు సంపంద్రదాయ బద్ధంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవం పిమ్మట భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వ రస్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం శ్రీ క్షేత్ర హనుమత్‌పురంలో మంగళవారం సుబ్రమణ్య షష్ఠి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు కళ్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణంలో దంపతులు పీటలపై కూర్చుని ఫల పుష్పాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు వంశీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

పెనమలూరు: గంగూరు గ్రామంలో విజయ విఘ్నేశ్వర స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినం సందర్భంగా స్వామివారికి అభిషేకం చేసి అలంకరణ చేశారు. అనంతరం స్వామివారికి అత్యంత వైభవంగా ఆలయ అర్చకుడు వీరభోట్ల నరసింహ ప్రసాదశాస్త్రి స్వామివారి శాంతి కల్యాణం వేదమంత్రాలతో వైభవంగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. ఆలయ ధర్మకర్త ఈడుపుగంటి బుచ్చిబాబు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు ప్రధాన సెంటర్‌లో మంగళవారం దీక్షా పరులు నిర్వహించిన సుబ్రహ్మణ్య షష్ఠి కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాబు గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో అయ్యప్ప, భవానీ దీక్షాపరులు బుగ్గలకు శూలాలు గుచ్చుకోవడం, నిప్పుల గుండంలో నడవటం వంటి విన్యాసాలను ప్రదర్శించారు. గత 27 సంవత్సరాల నుంచి బాబు స్వామి సుబ్రహ్మణ్య షష్టిను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వాములు ప్రదర్శించే ఈ విన్యాసాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రామవరప్పాడుకు చేరుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూలు నిర్వహించారు.

ఆకట్టుకున్న విమాన కావిడి..

బాబు గురు స్వామి నిర్వహించిన విమాన కావిడి విన్యాసం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వీపునకు తాళ్లతో కూడిన ఇనుప హుక్కులను గుచ్చుకుని గాలిలో అటూ ఇటూ వేలాడుతూ అయ్యప్ప స్వామి చిత్ర పటానికి పూల మాలలు వేయడంతో వీక్షకులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. నిప్పుల గుండంలో పలువురు స్వాములు నడిచారు.



యనమలకుదురులో పల్లకీలో స్వామివారి ఊరేగింపు



చినకంచిలో సుబ్రహ్మణ్యస్వామికి పూజ చేస్తున్న భక్తులు



విమాన కావిడి నిర్వహిస్తున్న బాబు గురుస్వామి



చిక్కవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి

రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ సౌరబ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రౌండ్‌టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ సౌరభ్ పిలుపునిచ్చారు. అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్ వద్ద రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో అమృత హస్తం సహకారంతో పేదలకు మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేబుల్ ఇండియా దేశవ్యాప్తంగా 136 నగరాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రౌండ్‌టేబుల్ ఇండియా కిచెన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా పది రోజుల పాటు రోజూ 150 మందికి అన్నదానం చేయాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా నగరంలో అమృత హస్తం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ చైర్మన్ జి. హర్ష మాట్లాడుతూ అమృత హస్తం ట్రస్ట్‌కు రూ. 60 వేల అందించినట్లు తెలిపారు. పది రోజుల పాటు ఈ ట్రస్ట్ పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా నేషనల్ కో-ఆర్డినేటర్ కౌశిక్, లేడీస్ సర్కిల్ చైర్ పర్సన్స్ విమల, డాక్టర్ ప్రశాంతి, సంస్థ ప్రతినిధులు కాట్రగడ్డ మోహన్, తరణ్ దీప్ సింగ్ చలసాని బాబ్జి, పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల చట్టంపై అవగాహన అవసరం

పటమట(విజయవాడతూర్పు): వీధి వ్యాపా రుల సమస్యలు పరిష్కరించేందుకు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా(ఎన్ఏవీఎస్ఐ) కృషి చేస్తుందని, ఆ చట్టం గురించి వ్యాపారులందరికీ అవగాహన ఉండాలని సంస్థ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి నందిగామ శ్రీలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం స్టెల్లా కళాశాల సమీపంలోని ది మీటింగ్ హబ్‌లో నగరస్థాయి చర్చావేదిక నిర్వహించారు. వీధి వ్యాపారులు తమకున్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని, సమస్యలు, వాటి పరిష్కారాలు, అమలు చేయాల్సిన విధివిధానాలపై వివరించారు. ఈ సందర్భంగా నగరంలోని పటమట, బీసెంట్‌రోడ్డు, బందరు రోడ్డు, ఏలూరురోడ్డు, గవర్నర్‌పేట, కృష్ణలంక, కేపీనగర్ ప్రాంతాల్లోని వీధి వ్యాపారులకు ఉన్న అవకాశాలు, హక్కులను వివరించారు. అనంతరం టౌన్ వెండింగ్ కమిటీ, వీధి వ్యాపారుల చట్టం-2014, వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించేందుకు ఎదురయ్యే సవాళ్లు, మహిళా వీధివ్యాపారుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏవీఎస్ఐ ఢిల్లీ ప్రతినిధి రాజేంద్ర సింగ్, వీఎంసీ యూసీడీ(అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) నుంచి సీవో(కమ్యూనిటీ ఆర్గనైజర్) వి. కుమార్, మంజుల, నగరంలోని ఆయా ప్రాంతాల వీధివ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

యూటర్న్‌ల వద్ద పొంచి ఉన్న ప్రమాదం

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): బందరు రోడ్డులోని పలు యూటర్న్ జంక్షన్‌ల వద్ద ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల విద్యార్థులు ఇక్కడ రోడ్డు దాటి వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పలు పాఠశాలలు అధికంగా ఉన్నాయి. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో స్కూలు నుంచి వచ్చే విద్యార్థులు యూటర్న్‌ల వద్ద రహదారి దాటాలంటే గగనం అవుతోంది. చూద్దామన్నా ఒక్క ట్రాఫిక్ పోలీస్ కూడా ఉండటంలేదు. ఉదయం పూట కూడా ఇదే దుస్థితి నెలకొని ఉంటోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ గేట్ వరకు 5 యూటర్న్‌లు ఉన్నాయి. వీటి వద్ద స్టాపర్స్ కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకుని యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



స్వీట్ మ్యాజిక్ సమీపంలో యూటర్న్ వద్ద పరిస్థితి

ఆకట్టుకున్న సంగీత కచేరి

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 29వ జాతీయ సంగీత మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారుడు అభిషేక్ రఘురాం సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. వాగ్గేయకారుల కీర్తనలు చోటు చేసుకున్నాయి. వయోలిన్‌పై బి.అనంతకృష్ణన్, మృదంగంపై పత్రి సతీష్‌కుమార్ సహకరించారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ బుధవారం కార్యక్రమాలు ముగుస్తాయని సంగీత విద్వాంసుడు ఎన్‌సీహెచ్ జగన్నాథాచార్యులకు సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు జె. ప్రభాకర శాస్త్రి, బి.హరిప్రసాద్ పాల్గొన్నారు.



సంగీత కార్యక్రమంలో పాల్గొన్న అభిషేక్ రఘురాం, వాద్యసహకారం అందిస్తున్న బి.అనంతకృష్ణన్, పత్రి సతీష్

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- ఖర్చు ఎంతైనా భరిస్తా
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇప్పిస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. ఆయన మంగళవారం వణుకూరులో విలేకరులకు వివరాలు వెల్లడించారు. డిగ్రీ, ఇతర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులకు పోటీ పరీక్షలు గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పరీక్షలు రాసేవారికి కోచింగ్ ఉచితంగా ఇప్పిస్తానన్నారు. గుంటూరుకు చెందిన టార్గెట్ ఐఏఎస్ అకాడమీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నానని తెలిపారు. యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించటానికి ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తారని, శిక్షణకు సంబంధించి మెటీరియల్‌కు అయ్యే ఖర్చు తానే స్వయంగా భరిస్తానని అన్నారు. సివిల్స్‌కు కూడా శిక్షణ ఉచితంగా ఇప్పిస్తానని తెలిపారు. పోటీ పరీక్షలు రాసేవారు తన పీఏ జనార్దన్‌ను సంప్రదించాలని సూచించారు. నియోజకవర్గంలో యువతీ యువకుల భవిష్యత్తుకు తన వంతు దోహదపడతానన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

అవగాహన సదస్సులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ సువర్ణ

ఉయ్యూరు: పని ప్రదేశాల్లో, చదువుకునే ప్రాంతాల్లో మహిళలు అప్రమత్తంగా వ్యవహరించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ సూచించారు. ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెబితే నమ్మి మోసపోవద్దన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలను వినియోగించుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో మహిళలపై హింస, వివక్షతను రూపుమాపడంపై అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. పీడీ సువర్ణ మాట్లాడుతూ మహిళా చట్టాలను అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా సరే మహిళలను వేధింపులకు గురిచేసి, అసభ్యకరంగా ప్రవర్తిస్తే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. మహిళా చట్టాలు, బాలికల హక్కులు, ఐసీడీఎస్ సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరప్రసాద్, ఉయ్యూరు ప్రాజెక్టు సిడిపిఓ ఆరుద్ర, ఎంఈఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పీడీ సువర్ణ, వేదికపై అధికారులు

ఘాట్ రోడ్డు ఓంకారానికి ఎల్‌ఈడీ వెలుగులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఘాట్‌రోడ్డులోని ఓంకారానికి ఎల్‌ఈడీ లైట్లతో ఆధునికీకరించనున్నారు. రెండు రోజుల కిందట ఓంకారాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఎల్‌ఈడీ లైట్లను దేవస్థానానికి తరలించగా మంగళవారం ఉదయం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. రెండున్నర దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఈ ఓంకారానికి ఏర్పాటు చేసిన లైట్లు తరుచూ మరమ్మతులు గురవుతున్నాయి. దీనికి తోడు కొండపై ఉన్న కోతులు ఓంకారం పైకి ఎక్కి విద్యుత్ లైట్లతో పాటు వాటిని ఏర్పాటు చేసిన వైర్లను తరుచూ ధ్వంసం చేస్తున్నాయి.

ఓంకారానికి ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలని దేవస్థాన ఇంజినీరింగ్ విభాగం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లు పిలిచిన దేవస్థానం పనులకు దేవదాయ శాఖ అధికారులు ఆమోదం తెలిపారు. సుమారు రూ. 10 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. పగటి వేళ రేడియం వెలుగులో కనిపించే ఈ ఓంకారం రాత్రి వేళ ఎల్‌ఈడీ వెలుగులో ప్రకాశించనుంది. చెన్నై నుంచి విజయవాడ మీదగా నేషనల్ హైవేపై రాకపోకలు సాగించే వారితో పాటు రైళ్లలో విజయవాడ నుంచి చెన్నై వెళ్లే ప్రయాణికులు అమ్మవారి ఆలయంతో పాటు ఓంకారానికి నమస్కరించడం ఆనవాయితీ. డిసెంబర్‌లో జరగనున్న భవానీ దీక్ష విమరణ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఆలయ అధికారులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ఆలయ అర్చకులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఉభయదాతలు, భక్తులు అధిక సంఖ్యలో స్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు.



ఓంకారానికి మరమ్మతులు చేపట్టిన కార్మికులు

సుడిగాలి చుట్టేసింది..



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సుడిగాలి చుట్టేసిన ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. విభిన్న ప్రతిభావంతుల ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి క్రీడా పోటీలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో అకస్మాత్తుగా దుమ్మూధూళి గాలిలోకి లేచి సుడులు తిరగడం ఆరంభించింది. వలయాకారంలో దాదాపు ఐదు నిమిషాల పాటు తిరుగుతూ అందరి దృష్టిని ఆకర్షించింది.

– పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

టికెట్ చెకింగ్ సిబ్బందికి మెరిట్ సర్టిఫికెట్లు



టీటీఐలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసిన సీనియర్ డీసీఎం రాంబాబు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో అక్టోబర్ నెలలో కమర్షియల్ విభాగం సిబ్బంది నిర్వహించిన టికెట్ చెకింగ్ డ్రైవ్‌లు, స్క్వాడ్‌లు, ఆకస్మిక, రెగ్యులర్ తనిఖీల ద్వారా డివిజన్‌లో 70,273 కేసులు నమోదు చేయడం ద్వారా రూ.4.53 కోట్ల ఆదాయం సమకూరినట్లు సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు పేర్కొన్నారు. విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురు టికెట్ చెకింగ్ సిబ్బందికి సీనియర్ డీసీఎం రాంబాబు తన కార్యాలయంలో మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్న వారిలో టీటీఐ(ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టర్స్)లు ఆర్.శ్రీనివాసరావు, ఎ.సురేష్‌బాబు, ముకేష్‌కుమార్, ఎస్.వెంకటరావు, కె.శేషాద్రి, జి.జ్యోతి ఉన్నారు. కాగా, ఈ నెల 17న రైలు నంబర్ 13351 అలెప్పి–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రసవ నొప్పులతో బాధపడుతున్న ఒక మహిళకు సపర్యలు చేసి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంలో సహాయం చేసిన మహిళా టీటీఐ జి.జ్యోతిని ప్రశంస పత్రంతో సీనియర్ డీసీఎం ప్రత్యేకంగా అభినందించారు.

కొత్తగా నాలుగు పోలీసు బెటాలియన్లు

ఒక్కో బెటాలియన్ 1,007మందితో ఏర్పాటు

- ఆధునిక మౌలిక వసతుల కల్పన
- పోలీసు శాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా నాలుగు ఏపీఎస్పీ పోలీసు బెటాలియన్లు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా), రాజమహేంద్రవరం (తూర్పు గోదావరి జిల్లా), మద్దిపాడు (ప్రకాశం జిల్లా), చిత్తూరులో కొత్త బెటాలియన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు పోలీసు శాఖ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 8 పోలీస్ బెటాలియన్లు ఉన్నాయి. కాగా, రాష్ట్ర విభజన అనంతరం అవసరాలకు తగినట్లుగా కొత్తగా నాలుగు బెటాలియన్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. కానీ అప్పటి టీడీపీ ప్రభుత్వం కొత్త బెటాలియన్ల ఏర్పాటు అంశాన్ని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే కొత్తగా నాలుగు పోలీసు బెటాలియన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. భూములను కూడా గుర్తించింది. ఎచ్చెర్లలో 80 ఎకరాలు, రాజమహేంద్రవరంలో దాదాపు 30 ఎకరాలు, మద్దిపాడులో 95 ఎకరాలు, చిత్తూరులో దాదాపు 50 ఎకరాలను ఎంపిక చేసింది. మద్దిపాడులోని భూమిని ఇప్పటికే ఏపీఎస్పీ విభాగానికి అప్పగించారు. ఎచ్చెర్ల, రాజమహేంద్రవరం, చిత్తూరులోని భూములు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. వాటిని త్వరలోనే ఏపీఎస్పీ విభాగానికి అప్పగించాలని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశించారు. అనంతరం ఆ నాలుగు కేంద్రాల్లో బెటాలియన్ల ఏర్పాటు కోసం భవనాల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులను ఏపీఎస్పీ చేపడుతుంది. ఏడాదిలోగా నాలుగు బెటాలియన్ల ఏర్పాటు పూర్తి చేయాలని ఏపీఎస్పీ భావిస్తోంది.

పోలీసు వ్యవస్థ మరింత బలోపేతం

ఏపీఎస్పీ అధికారులు, జవాన్లతోపాటు కలిపి 1,007 మందితో ఒక్కో బెటాలియన్‌ను ఏర్పాటు చేస్తారు. ఒక్కో బెటాలియన్‌లో ఒక కమాండెంట్, ఒక అదనపు కమాండెంట్, నలుగురు అసిస్టెంట్ కమాండెంట్లు, 10మంది రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 24మంది రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 70మంది అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 177మంది హెడ్ కానిస్టేబుళ్లు, 630మంది కానిస్టేబుళ్లు ఉంటారు. వారితోపాటు మినిస్టీరియల్ స్టాఫ్ 26మంది, ఒక మెడికల్ యూనిట్ (8మంది వైద్య సిబ్బంది), 56 మంది ఇతర సిబ్బందిని నియమిస్తారు. ఆ విధంగా మొత్తం 4,028మందితో నాలుగు బెటాలియన్లను ఏర్పాటు చేస్తారు. 'కొత్తగా నాలుగు పోలీసు బెటాలియన్ల ఏర్పాటుతో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రకృతి విపత్తుల నిర్వహణ తదితర సేవలను మరింత సమర్థంగా అందించేందుకు అవకాశం కలుగుతుంది' అని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

భద్రతకు పెద్దపీట

సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్ 2022 విడుదల



సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్స్ 2022ను తాజాగా విడుదల చేసింది. విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, ట్రాన్స్‌కో, డిస్కం, కేంద్ర, రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వినియోగదారులకు భద్రతా ప్రమాణాలను నిర్దేశించింది. విద్యుత్ ప్లాంట్లకు ఐఎస్–18001 ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేసింది. ఉద్యోగుల భద్రత, ఆరోగ్యానికి ప్రత్యేక సూచనలు ప్రకటించింది. అందులో భాగంగా ఎలక్ట్రిక్ ప్లాంట్ల ఆపరేషన్, నిర్వహణ కోసం గుర్తింపు పొందిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లు ఉండాలని, భద్రతపై సిబ్బందికి శిక్షణనివ్వాలని చెప్పింది.

ఇవీ మార్గదర్శకాలు

- వినియోగదారులకు విద్యుత్ సర్వీసును అందించే క్రమంలో అన్ని విద్యుత్ లైన్లు, స్విచ్ బోర్డులు, స్విచ్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తింగ్, న్యూట్రల్ వైరింగ్‌ను తనిఖీ చేయాలి. సర్వీస్ లైన్లను ఏర్పాటు చేసే సమయంలో ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలి.
- అత్యవసర పరిస్థితుల్లో 100 డెసిబుల్ నుంచి 120 డెసిబుల్ వరకు శబ్దం చేసే సైరన్లను వినియోగించాలి. ప్రతిరోజూ డస్ట్ కలెక్షన్ ఎఫీషియన్సీ పరీక్షించాలి. కూలింగ్ టవర్లను ఏటా సివిల్ ఇంజినీర్లు పరిశీలించాలి.
- 250 ఓల్ట్స్ లోడ్ దాటిన చోట ఖచ్చితంగా స్థానిక భాషతో పాటు హిందీ, ఇంగ్లిష్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- విద్యుత్ సరఫరా లైన్లపై పనిచేసే సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీ ఈ)తో పాటు, రబ్బర్ తొడుగులు, రక్షణ చెప్పులు, బెల్ట్, హెల్మెట్, లైన్ టెస్టర్, ఓల్టేజ్ డిటెక్టర్ వంటి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలున్న భద్రతాపరికరాలు అందించాలి.
- జనరేటర్లు, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, డ్రిల్స్, స్ప్రేయర్స్, వెల్డింగ్‌సెట్స్ వంటి వాటికి ఫ్లెక్సిబుల్ వైర్లను వినియోగించడానికి వీల్లేదు.
- కేంద్ర పర్యావరణ, అటవీశాఖ జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించాలి.
- 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్న 48 గంటల్లోగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి సహేతుక కారణాలతో నివేదిక అందించాలి.
- ప్రమాదం సంభవించే పరిస్థితి తలెత్తినపుడు ముందస్తు హెచ్చరికలకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- ప్రతి రెండేళ్లకోసారి గుర్తింపు పొందిన సంస్థ ద్వారా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి, నివేదికను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి పంపాలి.
- వ్యర్థ జలాలు, రసాయనాల నిర్వహణ, దుమ్ము ధూళి అణచివేతకు ఎయిర్, వాటర్ చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలి. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల వద్ద పూర్తి సౌకర్యాలున్న అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలి.
- దుమ్ము, ధూళిలో పనిచేసే ఉద్యోగుల శ్వాసకోశ సంబంధ సమస్యలను గుర్తించడానికి ప్రతి ఆరు నెలలకోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలి.

ఆరోగ్యశ్రీతో అత్యున్నత వైద్యం

- ఐఎంఏ నూతన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ



ఐఎంఏ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జి.రవికృష్ణకు బాధ్యతలు అప్పగిస్తున్న సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తృతం చేసి అన్ని రకాల జబ్బులను ఆ పథకంలో చేర్చడం ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యున్నతస్థాయి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని ఐఎంఏ రాష్ట్ర నూతన అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ ప్రశంసించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రవికృష్ణ మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా వైద్యాన్ని ప్రజల దగ్గరికి తీసుకెళ్తున్నందుకు ఏపీ ఐఎంఏశాఖ తరపున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం మరింత ఎక్కువగా పట్టణ, గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఒకటి, రెండు స్పెషాలిటీలతో 20 పడకలున్న ఆస్పత్రులకు అనుమతివ్వాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ప్రవేశ పెట్టిన రాష్ట్ర మెడికల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను పటిష్టం చేయాలన్నారు. అప్పట్లో ఐదేళ్ల జైలు శిక్ష కేసులకు నాన్‌బెయిలబుల్ ఉండేదని, ఇప్పుడు నిబంధనలు మారడంతో దానిని ఏడేళ్ల జైలుశిక్షగా యాక్ట్‌ను పటిష్టం చేయాలన్నారు. అప్పుడే ఆస్పత్రులపై, వైద్యులపై దాడులు చేసిన వారిని నాన్ బెయిలబుల్‌గా అరెస్ట్ చేసే వీలుంటుందని చెప్పారు. విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్ వాడుతున్న గ్రామీణ వైద్యులపై నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అల్లోపతి విద్యను దేశమంతా ఇంగ్లిష్‌లోనే బోధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి పి.ఫణిదర్, ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవీంద్రనాథ్, ఎలక్ట్ అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరాజు, విజయవాడశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ బాక్సర్ మేరీకోమ్‌తో 'అమెరికన్ ఆంకాలజీ' భాగస్వామ్యం



మేరీకోమ్

భవానీపురం (విజయవాడపశ్చిమ): క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం, క్యాన్సర్ నిర్ధారణ గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు దిగ్గజ బాక్సింగ్ క్రీడాకారిణి మేరీకోమ్‌తో అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంస్థ దక్షిణాసియా గ్రూప్ సీఈవో డాక్టర్ జగ్రూప్ గుజ్రాల్ భాగస్వామ్య విషయాలను వెల్లడించారు. మన దేశంలో ఏటా 10 లక్షలమంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. స్టార్ బాక్సర్ మేరీకోమ్‌తో అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యం కీలకఘట్టంగా నిలుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆంధ్రప్రదేశ్ రీజనల్ సీఈవో ఎం.వి.మహేంద్రరెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని గుర్తించేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచారోద్యమాన్ని రూపొందించామని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని త్వరగా గుర్తించేలా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు మేరీకోమ్ స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు. తమ ఆస్పత్రి దక్షిణాసియాలో అగ్రగామి సంస్థగా 16 క్యాన్సర్ చికిత్సా కేంద్రాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఆధునిక వైద్య పరిజ్ఞానంతో అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్యాన్సర్లకు చికిత్స అందిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో ఆస్పత్రి విజయవాడ యూనిట్ మెడికల్ సూపరింటెండెంట్ రాజేష్ కోట, వైద్యులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కర్రసాము జాతీయ క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

విజయవాడ స్పోర్ట్స్: ప్రాచీన సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జాతీయ ట్రెడిషనల్ సిలంబం(కర్రసాము) పోటీల్లో పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులను మంగళవారం ఆయన అభినందించారు. ప్రాచీన యుద్ధ కళలలో ఒకటైన కర్రసామును రేపటి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన టోర్నీలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, యువతకు ఉద్యోగ అవకాశాలు ఈ ప్రభుత్వంలో అపారంగా లభిస్తున్నాయన్నారు. కర్రసాముతో ఏకాగ్రత, ధైర్యం, ఆరోగ్యం సిద్ధిస్తుందని, పిల్లలకు కర్రసాము శిక్షణ ఇప్పించేందుకు తల్లిదండ్రులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. జాతీయ పోటీల విజేతలైన ఎం.హియాజైన్, ఎస్.యశస్వి, కె.రిషికేష్, జి.ఆరుష్, ఎస్.కశ్యప్, బి.మేఘనా, రతన్, కారుణ్యలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కోచ్ సత్యశ్రీకాంత్, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మార్చి 28న కోటి రుద్రాక్ష అభిషేక అర్చన



రుద్రాక్షలతో డాక్టర్ గౌతంరెడ్డి, కమిటీ సభ్యులు



రుద్రాక్షలతో దండలు చేస్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం మార్చి 28న కోటి రుద్రాక్ష అభిషేక అర్చన నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. మందిరంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మార్చి 28వ తేదీన ఆలయకమిటీ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా జరగని విధంగా కోటి రుద్రాక్ష, అభిషేక అర్చన నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే నేపాల్ నుంచి 60లక్షల రుద్రాక్షలను తీసుకువచ్చి విశేషంగా అభిషేకం నిర్వహించి కోటి రుద్రాక్ష అభిషేకానికి సిద్ధం చేశామన్నారు. మిగిలిన 40లక్షల రుద్రాక్షలను కూడా త్వరలోనే తీసుకురానున్నామని చెప్పారు. కోటి రుద్రాక్ష అభిషేక అర్చనకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పాటు పలువురు పెద్దలను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామన్నారు. భక్తులు కోటి రుద్రాక్ష అభిషేక అర్చనలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అనంతరం కోటి రుద్రాక్ష అభిషేక అర్చన కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు.

నాడు–నేడు పెండింగ్ పనులపై దృష్టి

కృష్ణా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నాడు – నేడు పథకం రెండోదశ పెండింగ్ పనులపై అధికారులు దృష్టి సారించాలని కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా స్థల సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఎంతో ప్రోత్సహిస్తుంటే ఇప్పటి వరకు చాలా పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదన్నారు. మండల విద్యాశాఖాధికారులు శ్రద్ధ చూపి ఆ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు విద్యాశాఖాధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. పెనమలూరు, పెదపారుపూడి, నందివాడ, మొవ్వ, మోపిదేవి, పమిడిముక్కల, పామర్రు మండలాల విద్యాశాఖాధికారులు వారికి ఉన్న సమస్యలను ఏపీసీ శాఖ దృష్టికి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. టెలి కాన్ఫరెన్స్‌లో డీఈవో తాహెరాసుల్తానా, పంచాయతీరాజ్ ఈఈ టి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు స్వర్ణయుగం

భారీగా పీజీ సీట్ల పెంపు

- సిద్ధార్థ మెడికల్ కళాశాలకు 71 సీట్లు కేటాయింపు
- అభివృద్ధికి రూ.51.12 కోట్లు విడుదల
- అన్నీ క్లినికల్ సీట్లు రావడంపై వైద్యుల హర్షం
- సీఎం వైఎస్ జగన్ కృషి ఫలితమే అంటున్న సిబ్బంది



ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో ప్రభుత్వం మూడేళ్లుగా చేపట్టిన విప్లవాత్మక మార్పులు, అభివృద్ధితో మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు రాష్ట్రానికి వరదలా వచ్చాయి. వైద్య చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలలకు 630 పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. వాటిలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు 71 సీట్లు కేటాయించింది. అవన్నీ క్లినికల్ సీట్లే కావడం, ఒకేసారి అన్ని సీట్లు మంజూరు కావడంతో వైద్య వర్గాలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెరగడం అంటే ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు పీజీ చేసే అవకాశాన్ని కల్పించినట్లేనని వారు చెబుతున్నారు.

సీఎం వైఎస్ జగన్ చొరవతో..

ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు ఒకేసారి 71 పీజీ సీట్లు వచ్చాయంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషేనని వైద్యులు అంటున్నారు. మూడున్నరేళ్లలో సిద్ధార్థ వైద్య కళాశాల, అనుబంధ టీచింగ్ ఆస్పత్రి రూపురేఖలు మార్చేశారంటున్నారు. ఒక్క ఖాళీ కూడా లేకుండా పెద్ద ఎత్తున బోధనా వైద్యుల నియామకాలు చేపట్టడం, ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల ఇది సాధ్యమైందని వారు అంటున్నారు.

నిధులు విడుదల..

ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు కొత్తగా పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు మంజూరు చేయడంతో పాటు వాటికి అనుగుణంగా నిధులను సైతం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్తగా మంజూరైన 71 పీజీ సీట్లకు రూ.85.2 కోట్లు కేటాయించగా, వాటిలో 60 శాతం వాటాగా కేంద్ర ప్రభుత్వం రూ.51.12 కోట్లు నిధులు విడుదల చేసింది. మిగిలిన 40 శాతం వాటాగా రూ.34 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఇప్పటికే నాడు–నేడు ద్వారా రూ.175 కోట్లతో పనులు ప్రారంభించినందున కొత్తగా మంజూరైన సీట్లకు సరిపడా మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేసినట్లేనని వైద్యులు అంటున్నారు.

మంచి పరిణామం..



ప్రభుత్వ వైద్య కళాశాలకు ఒకేసారి 71 సీట్లు మంజూరు కావడం మంచి పరిణామం. ఎంతో మంది పేద విద్యార్థులు ఉచితంగా పోస్టు గ్రాడ్యుయేషన్ చేసే అవకాశం దక్కుతుంది. ముఖ్యమంత్రి వైద్య రంగానికి చేసిన కృషి ఫలితంగానే నేడు ఇన్ని సీట్లు వచ్చాయి. నేను ప్రిన్సిపాల్‌గా ఉండగా, ఇన్ని పీజీ సీట్లు రావడం చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ నత్తా శ్రీనివాస విఠల్‌రావు, ప్రిన్సిపాల్, సిద్ధార్థ వైద్య కళాశాల

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



ఒకేసారి ఇన్ని పీజీ సీట్లు రావడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ ప్రోత్సాహంతోనే దీనిని సాధించగలిగాం. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విఠల్‌రావు చొరవ తీసుకుని ఏ విభాగంలో ఎన్నిసీట్లు కావాలో తెలుసుకుని, నేషనల్ మెడికల్ కమిషన్‌కు ప్రజెంటేషన్ చేయడంలో సఫలీకృతం అయ్యారు. దానికి తోడు ప్రభుత్వం నిధులు కేటాయించడం, మ్యాచింగ్ గ్రాంట్ రిలీజ్ చేయడంతో పెద్ద సంఖ్యలో సీట్లు వచ్చాయి.

– డాక్టర్ కె. అప్పారావు, జనరల్ సర్జరీ విభాగాధిపతి

ఏ విభాగానికి ఎన్నంటే....

కొత్తగా మంజూరు చేసిన 71 పీజీ సీట్లలో జనరల్ సర్జరీ 12, అనస్థీషియా10, పల్మనాలజీ 3, పిడియాట్రిక్స్ 4, పాథాలజీ 9, మైక్రోబయాలజీ 6, గైనకాలజీ 11, ఈఎన్‌టీ 3, ఆప్తమాలజీ 3, న్యూరాలజీ(డీఎం) 5, న్యూరోసర్జరీ 5(ఎంసీహెచ్) సీట్లు వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి కాగా, వచ్చే ఏడాది అడ్మిషన్లకు ఈ సీట్లను పరిగణనలోకి తీసుకోనున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎలైన్‌మెంట్‌ను పూర్తి చేయండి

ఎన్టీఆర్ జిల్లా జేసీ శ్రీవాస్ నుపూర్



జక్కంపూడిలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి మ్యాప్ పరిశీలిస్తున్న జేసీ నుపూర్

విజయవాడరూరల్: విజయవాడ–భద్రాచలం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన ఎలైన్‌మెంట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ కుమార్ ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి–30కి సంబంధించి విజయవాడ రూరల్ మండలంలోని జక్కంపూడి, వేమవరం గ్రామాలలో రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి మంగళవారం ఎలైన్‌మెంట్ ప్రక్రియను జేసీ పరిశీలించారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తయినందున నిర్మాణానికి సంబంధించి ఎలైన్‌మెంట్‌కు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విజయవాడ రూరల్ మండలం పి.నైనవరంలోని బహుళ ప్రయోజన కేంద్రం (ఎంపీఎఫ్‌సీ) నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు.

విస్తృత తనిఖీలు..

విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలను జేసీ నుపూర్ అజయ్ పరిశీలించారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని వాటిని నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. సచివాలయంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలన్నారు. రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అందిస్తున్న వివిధ రకాల సేవలను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో విజయవాడ రూరల్ తహసీల్దార్ శ్రీనివాసనాయక్, సర్వేయర్ రమేష్ ఉన్నారు.

రేపు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్–14, అండర్–18 బాలబాలికల జట్లను డిసెంబర్ ఒకటో తేదీన గన్నవరంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ నందు ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగం సతీష్‌బాబు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు పొందిన పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ సామగ్రితో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు 94907 98909, 9553528888ను సంప్రదించాలన్నారు.

ఏపీఎన్జీవో నగర శాఖది ఘన చరిత్ర

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్



మాట్లాడుతున్న విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ విజయవాడ నగర శాఖకు ఘన చరిత్ర ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు విజయవాడ వేదికగా నిలిచిందన్నారు. మంగళవారం ఏపీ ఎన్జీవో హోంలో నగర శాఖ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఏ. విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యమాలను విజయవంతం చేయడంలో నగర శాఖ ముఖ్య భూమికను పోషిస్తోందన్నారు. ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పట్ల నిరంతర కార్యాచరణ చేస్తోందని కొనియాడారు. నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జె.స్వామి, కె. సంపత్‌కుమార్ మాట్లాడుతూ మూడేళ్లుగా కార్యవర్గం చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికను సమర్పించి జమ ఖర్చుల వివరాలను ప్రకటించారు. నగర శాఖ సహా అధ్యక్షులు బీవీ రమణ, కోశాధికారి ఎస్‌కే నజీర్ పాల్గొన్నారు.



సౌరభ్‌కు నాలుగు వికెట్లు... ఆధిక్యంలో భారత్ ‘ఎ’

బంగ్లాదేశ్ ‘ఎ’ జట్టుతో తొలి టెస్టులో మొదటి రోజు భారత్ ‘ఎ’కు ఎనిమిది పరుగుల ఆధిక్యం దక్కింది. కాక్స్ బజార్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లు సౌరభ్ కుమార్ (4/23), నవదీప్ సైని (3/21) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 120 పరుగులు చేసింది. యశస్వి (61 బ్యాటింగ్), ఈశ్వరన్ (53 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



తొలిసారి టాప్-20లోకి గాయత్రి జోడీ

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మహిళల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ క్రీడాకారిణి పుల్లెల గాయత్రి తన భాగస్వామి ట్రెసా జాలీ (కేరళ)తో కలిసి కెరీర్ బెస్ట్ 19వ ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం రెండు స్థానాలు పురోగతి సాధించి భారత నంబర్‌వన్ జోడీగా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ రెండు స్థానాలు ఎగబాకి మరోసారి కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు.

విజయంతో ముగిస్తారా!

- నేడు కివీస్‌తో భారత్ చివరి వన్డే
- గెలిస్తే సిరీస్ సమం
- మ్యాచ్‌కు వర్షం ముప్పు
- ఉదయం గం.7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో ప్రత్యక్ష ప్రసారం


ధావన్
విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: టి20 వరల్డ్ కప్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత రోహిత్, కోహ్లి వంటి స్టార్లు లేకుండా భారత జట్టు న్యూజిలాండ్ గడ్డపై అడుగు పెట్టింది. టి20 సిరీస్‌లో ఒక మ్యాచ్ రద్దు, మరో మ్యాచ్ ‘టై’తో సిరీస్ 1-0తో భారత్ ఖాతాలో చేరింది. ఇప్పుడు వన్డేల్లోనూ దాదాపు అదే స్థితి. ఒక మ్యాచ్ రద్దు కాగా, మరో మ్యాచ్ ఓడిన టీమిండియా 0-1తో వెనుకబడి ఉంది. ఇప్పుడు ఈ పర్యటనలో చివరి పోరులో నెగ్గి సిరీస్ సమం చేస్తుందా లేక చేజార్చుకుంటుందా చూడాలి. మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించే అవకాశం ఉండటంతో ఒకవేళ రద్దు అయినా సిరీస్ కివీస్ ఖాతాలో పడుతుంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే మూడో వన్డే కోసం ఇరు జట్లు సన్నద్ధమయ్యాయి.

సామ్సన్‌కు మరో చాన్స్...

రెండో వన్డే వర్షంతో 12.5 ఓవర్లకే పరిమితమైంది. సాధారణంగా అయితే ఇదే జట్టును మూడో మ్యాచ్‌కూ ఎంచుకోవాలి. అయితే తొలి వన్డేలో రాణించినా గత మ్యాచ్ నుంచి సామ్సన్‌ను తప్పించడం తీవ్ర విమర్శలపాలైంది. ఈ నేపథ్యంలో అత డిని మళ్లీ తీసుకొని హుడాను పక్కన పెడతారా అనేది ఆసక్తికరం. టాప్-5 అంతా పూర్తి స్థాయి బ్యాటర్లే ఉండటంతో హుడా ఆల్‌రౌండర్‌గా బౌలింగ్‌లో అదనపు ప్రయోజనం ఇస్తాడనేది జట్టు ఆలోచన.

అదే జట్టుతో...

న్యూజిలాండ్ తుది జట్టు విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. అలెన్, కాన్వే, కెప్టెన్ విలియమ్సన్‌లతో టాపార్డర్ పటిష్టంగా ఉంది. తొలి మ్యాచ్ హీరో లాథమ్‌తో పాటు మిచెల్, ఫిలిప్స్ మిడిలార్డర్ భారం మోస్తారు. నీషమ్ గాయం నుంచి కోలుకున్నా, అతనికి చాన్స్ లభించడం కష్టం. ముగ్గురు పేసర్లు టిమ్ సౌతీ, హెన్రీ, ఫెర్గూసన్ తమ స్వింగ్‌తో భారత్‌ను కట్టడి చేయగల సమర్థులు. ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లు సాన్‌ట్నర్, బ్రేస్‌వెల్ కూడా రాణిస్తే సొంతగడ్డపై న్యూజిలాండ్‌కు అదనపు ప్రయోజనం దక్కుతుంది.

20 ఏళ్ల తర్వాత...

- ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించిన సెనెగల్
- చివరి లీగ్ మ్యాచ్‌లో ఈక్వెడార్‌పై 2-1తో విజయం
- కీలక గోల్‌తో గెలిపించిన కెప్టెన్ కులిబాలి


రెండో గోల్ చేశాక కెప్టెన్ కులిబాలి సంబరం

దోహా: రెండు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ సెనెగల్ జట్టు ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో రెండోసారి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘ఎ’ చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో సెనెగల్ 2-1 గోల్స్ తేడాతో ఈక్వెడార్ జట్టును ఓడించింది. ఆరు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి తదుపరి దశకు అర్హత పొందింది. సెనెగల్ తరఫున ఇస్మాయిల్ సార్ (44వ ని.లో), కెప్టెన్ కలిదు కులిబాలి (70వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఈక్వెడార్‌కు మోజెస్ కైసెడో (67వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. మూడోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న సెనెగల్ తొలిసారి బరిలోకి దిగిన 2002లో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత వరుసగా మూడు ప్రపంచకప్‌లకు అర్హత పొందలేకపోయింది. మళ్లీ 2018లో రెండోసారి ఈ మెగా ఈవెంట్‌లో ఆడిన సెనెగల్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. ఈసారి సమష్టిగా రాణించి తొలి అడ్డంకిని అధిగమించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తప్పనిసరిగా గెలిస్తేనే నాకౌట్ దశకు చేరే అవకాశం ఉండటంతో సెనెగల్ ఆటగాళ్లు ఆద్యంతం దూకుడుగా ఆడారు. ‘డ్రా’ చేసుకున్నా నాకౌట్ దశకు చేరే చాన్స్ ఉండటంతో ఈక్వెడార్ కూడా వెనక్కి తగ్గలేదు. సాధ్యమైనంత ఎక్కువసేపు తమ ఆధీనంలో బంతి ఉండేలా ఈక్వెడార్ ఆటగాళ్లు ప్రయత్నించారు. సెనెగల్ ఆటగాళ్లను మొరటుగా అడ్డుకునేందుకు వెనుకాడలేదు. ఈ క్రమంలో 44వ నిమిషంలో ‘డి’ ఏరియాలో సెనెగల్ ప్లేయర్ ఇస్మాయిల్ సార్‌ను ఈక్వెడార్ డిఫెండర్ హిన్‌కాపి తోసేశాడు. దాంతో రిఫరీ మరో ఆలోచన లేకుండా సెనెగల్‌కు పెనాల్టీ కిక్‌ను ప్రకటించాడు. పెనాల్టీని ఇస్మాయిల్ సార్ గోల్‌గా మలిచాడు. దాంతో విరామ సమయానికి సెనెగల్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో ఈక్వెడార్ స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. 67వ నిమిషంలో లభించిన కార్నర్‌ను ప్లాటా ‘డి’ ఏరియాలోకి కొట్టాడు. దానిని టోరెస్ హెడర్ షాట్‌తో ఒంటరిగా ఉన్న మోజెస్ కైసెడో వద్దకు పంపించగా అతను గోల్‌గా మలిచాడు. దాంతో స్కోరు 1-1తో సమం అయింది. అయితే ఈక్వెడార్‌కు ఈ ఆనందం మూడు నిమిషాల్లోనే ఆవిరైంది. 70వ నిమిషంలో సెనెగల్ జట్టుకు లభించిన కార్నర్‌ను గుయె ‘డి’ ఏరియాలోకి కొట్టగా ఈక్వెడార్ ప్లేయర్ టోరెస్‌కు తగిలి బంతి గాల్లో లేచింది. అక్కడే ఉన్న కెప్టెన్ కులిబాలి బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పంపించి సెనెగల్‌కు 2-1తో ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత సెనెగల్ చివరివరకు ఆ ఆధిక్యాన్ని కాపాడుకుంది.

నెదర్లాండ్స్ 11వసారి...


గాక్పో

మరోవైపు ఆతిథ్య ఖతర్ జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-0తో గెలిచి ఏడు పాయింట్లతో గ్రూప్ ‘ఎ’ టాపర్‌గా నిలిచి 11వసారి ప్రపంచకప్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. నెదర్లాండ్స్ తరఫున కొడి గాక్పో (26వ ని.లో), ఫ్రాంకీ డి జాంగ్ (49వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఈ టోర్నీలో గాక్పోకిది మూడో గోల్ కావడం విశేషం.

గ్రూప్ ‘ఎ’ పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
నెదర్లాండ్స్	3	2	1	0	5	1	7
సెనెగల్	3	2	0	1	5	4	6
ఈక్వెడార్	3	1	1	1	4	3	4
ఖతర్	3	0	0	3	1	7	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, చే.గో-చేసిన గోల్స్, ఇ.గో-ఇచ్చిన గోల్స్, పా-పాయింట్లు

పోర్చుగల్ ముందుకు...

వరుసగా రెండో విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి రొనాల్డో జట్టు


రెండు గోల్స్ చేసిన సహచరుడు బ్రూనోను అభినందిస్తున్న పోర్చుగల్ కెప్టెన్ రొనాల్డో

దోహా: అందని ద్రాక్షగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్‌ను సాధించాలనే లక్ష్యంతో ఖతర్‌కు వచ్చిన క్రిస్టియానో రొనాల్డో బృందం తొలి అడ్డంకిని దాటింది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన గ్రూప్ ‘హెచ్’ మ్యాచ్‌లో రొనాల్డో నాయకత్వంలోని పోర్చుగల్ జట్టు 2-0 గోల్స్ తేడాతో గతంలో రెండుసార్లు విశ్వవిజేతగా నిలిచిన ఉరుగ్వే జట్టుపై గెలిచింది. పోర్చుగల్ తరఫున నమోదైన రెండు గోల్స్‌ను బ్రూనో ఫెర్నాండెజ్ (54వ ని.లో, 90+3వ ని.లో) సాధించాడు. వరుసగా రెండో విజయం సాధించిన పోర్చుగల్ జట్టు ఆరు పాయింట్లతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

గత ప్రపంచకప్‌లో ఉరుగ్వే చేతిలో 1-2తో ఓడిపోయిన రొనాల్డో జట్టు ఈసారి ఈ మాజీ విజేత జట్టును తేలిగ్గా తీసుకోలేదు. ముఖ్యంగా రొనాల్డో ముందుండి జట్టును నడిపించాడు. పలుమార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్ దిశగా వెళ్లి లక్ష్యంపై గురి పెట్టాడు. మరోవైపు ఉరుగ్వే కూడా దూకుడుగానే ఆడింది. కానీ ఆ జట్టును కూడా ఫినిషింగ్ లోపం వేధించింది. విరామ సమయం వరకు రెండు జట్లు ఖాతా తెరువలేకపోయాయి. ఎట్టకేలకు 54వ నిమిషంలో బ్రూనో ఫెర్నాండెజ్ సంధించిన క్రాస్ షాట్ నేరుగా ఉరుగ్వే గోల్‌పోస్ట్‌లోనికి వెళ్లడంతో పోర్చుగల్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. బ్రూనో కిక్‌ను గాల్లోకి ఎగిరి రొనాల్డో హెడర్ ద్వారా అందుకునే ప్రయత్నం చేసినా బంతి రొనాల్డో తలకు తగలకుండానే గోల్‌పోస్ట్‌లోకి వెళ్లింది. ఉరుగ్వే తరఫున బెంటాన్‌కర్, గోమెజ్ కొట్టిన షాట్‌లు గోల్‌పోస్ట్‌కు తగిలి బయటకు వెళ్లాయి. స్టాపేజ్ సమయంలో ‘డి’ ఏరియాలో ఉరుగ్వే ప్లేయర్ జిమినెజ్ చేతికి బంతి తగలడంతో రిఫరీ పోర్చుగల్‌కు పెనాల్టీ కిక్ ఇచ్చాడు. బ్రూనో ఈ పెనాల్టీని గోల్‌గా మలిచాడు. చివరి సెకన్లలో బ్రూనో కొట్టిన షాట్ గోల్‌పోస్ట్‌కు తగిలి బయటకు వెళ్లింది. లేదంటే అతని ఖాతాలో హ్యాట్రిక్ చేరేది.

ప్రపంచకప్‌లో నేడు

డెన్మార్క్ X ఆస్ట్రేలియా
రాత్రి గం. 8:30 నుంచి

ఫ్రాన్స్ X ట్యునీషియా
రాత్రి గం. 8:30 నుంచి

అర్జెంటీనా X పోలాండ్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

మెక్సికో X సౌదీ అరేబియా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

రెండో స్థానంలో హంపి



కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో తొలి రోజు మూడో రౌండ్ గేమ్‌లు ముగిశాక మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక... ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ రెండు పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నారు. తొలి రౌండ్‌లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్)పై 30 ఎత్తుల్లో నెగ్గిన హంపి... అనా ఉషెనినా (ఉక్రెయిన్), మరియా (ఉక్రెయిన్)లతో జరిగిన తదుపరి రెండు గేమ్‌లను ‘డ్రా’ చేసుకుంది. వైశాలితో తొలి గేమ్‌ను ‘డ్రా’ చేసుకున్న హారిక... రెండో గేమ్‌లో ఒలివియా (పోలాండ్)పై గెలిచి, మూడో గేమ్‌ను ఉషెనినాతో ‘డ్రా’గా ముగించింది. అర్జున్ తొలి గేమ్‌లో 38 ఎత్తుల్లో నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్)పై గెలిచి, విదిత్, గుకేశ్ (భారత్)లతో గేమ్‌లను ‘డ్రా’గా ముగించాడు. బుధవారం మరో మూడు రౌండ్‌లు, గురువారం మరో మూడు రౌండ్‌లు జరుగుతాయి. తొలిసారి ఈ టోర్నీలో ఓపెన్, మహిళల విభాగాల్లో సమాన ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు.

రోజర్ బిన్నీపై ‘కాన్‌ఫ్లిక్ట్’ ఆరోపణలు



ముంబై: బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ పరస్పర విరుద్ధ ప్రయోజనాల (కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్) ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘానికి చెందిన సంజీవ్ గుప్తా ఈ విషయంపై బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ వినీత్ శరణ్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో డిసెంబర్ 20లోగా వివరణ ఇవ్వాలంటూ బిన్నీకి వినీత్ నోటీసు జారీ చేశారు. భారత్‌లో బీసీసీఐ మ్యాచ్‌ల ప్రసార హక్కులు ఉన్న స్టార్ స్పోర్ట్స్‌లో రోజర్ బిన్నీ కోడలు మయంతి లంగర్ పని చేస్తోందని... ఇది కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్ కిందకే వస్తుందని గుప్తా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత్ తరఫున 27 టెస్టులు, 72 వన్డేలు ఆడిన బిన్నీ ఇటీవలే బోర్డు అధ్యక్షుడిగా ఎంపికయ్యారు.

సినిమా


ప్రభాస్

ఇక ప్రాజెక్ట్ కెతో బిజీ

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘ప్రాజెక్ట్ కె’. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, దిశా పటానీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కొన్ని రోజులుగా హైదరాబాద్ శివార్లలో ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. అయితే ప్రభాస్ లేని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని తెలిసింది. డిసెంబరు 2 నుంచి ప్రభాస్ ఈ సినిమా షూటింగ్‌తో బిజీ అవుతారని సమాచారం. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ కూడా పాల్గొంటారట. ప్రభాస్, అమితాబ్ కాంబినేషన్ సీన్స్‌ను ప్లాన్ చేశారట నాగ్ అశ్విన్. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024లో రిలీజ్ కానుంది.


మహేశ్‌బాబు

యాక్షన్ ప్లాన్

యాక్షన్ మోడ్‌లోకి వెళ్లనున్నారు మహేశ్‌బాబు. ‘అతడు’(2005), ‘ఖలేజా’ (2010) చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మూడో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న చిత్రం ఇది. కాగా రెండు నెలల క్రితం మహేశ్ తల్లి ఇందిరా దేవి మరణం, ఇటీవల తండ్రి కృష్ణ హఠాన్మరణం ఈ చిత్రం షూటింగ్‌కి బ్రేక్ పడేలా చేశాయి. తాజాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ డిసెంబరు 8న ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ముందు ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట త్రివిక్రమ్.

అలా అయితే ఏడాదికో హిట్ సినిమానే తీయాలి!

– శైలేష్ కొలను



‘‘హిట్ 2’ చిత్రం థ్రిల్లర్ జానర్ అయినప్పటికీ కుటుంబ ప్రేక్షకులు కూడా కనెక్ట్ అయ్యేలా కథ రెడీ చేశాను. ఇందులో ప్రేమకథ కూడా కావాలని పెట్టింది కాదు. ఓ కేసును పోలీసాఫీసర్ టేకప్ చేస్తే ఆయన వ్యక్తిగత జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయి? అనేది చూపించాం’’ అన్నారు డైరెక్టర్ శైలేష్ కొలను. అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా తెరకెక్కిన చిత్రం ‘హిట్ 2’. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ శైలేష్ కొలను చెప్పిన విశేషాలు.

- నేను సిడ్నీ నుంచి వచ్చినప్పుడు నానీగారితో సినిమా తీయాలనుకున్నాను. ఆయనకు ‘హిట్’ కథ చెబితే, ‘నేను నటించను కానీ నిర్మిస్తా’ అన్నారు. అలా విశ్వక్ సేన్‌తో ‘హిట్ ది ఫస్ట్ కేస్’ తీశాం. ‘హిట్ ది సెకండ్ కేస్’కి అడివి శేష్ అయితే బాగుంటుందనుకున్నాను. నానీగారికి చెప్పగానే ఓకే అన్నారు. సినిమా గురించి మా ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటాయి. అడివి శేష్‌కి ‘హిట్ ది సెకండ్ కేస్’ కథ చెప్పినప్పుడు స్వతహాగా తను కూడా రైటర్ కావడంతో ఎన్నో ప్రశ్నలు అడిగారు. ఐదారు సిట్టింగ్స్ తర్వాతే ఓకే చెప్పారు.
- ‘హిట్’ ఫ్రాంచైజీని కొత్తగా ప్లాన్ చేశాం. ఒక్కో భాగంలో ఒక ఆఫీసర్‌ను పరిచయం చేస్తూ.. చివరకు అందరు ఆఫీసర్లను కలిపి ఓ సినిమా చేద్దామని ఫిక్స్ అయ్యాను.
- నా సినిమాలు ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఇందుకు ఎంతో పరిశోధన చేస్తాను. ‘హిట్ ఫస్ట్ కేస్’ సమయంలో దిశ ఘటన జరిగింది. సెకండ్ కేస్ సమయంలో మళ్లీ ఇలాంటి (శ్రద్ధా వాకర్) ఘటన జరిగింది. అలాంటి క్రిమినల్స్ సమాజంలో ఉన్నారు. క్రిమినల్స్ ఎందుకు ఇలా మారతారు? అనే చర్చ మా సినిమాలో ఉంటుంది. ‘హిట్’ సీజన్ క్రియేట్ చేయమని రాజమౌళిగారు ఇచ్చిన సలహా మాకు నచ్చింది. ఇందుకు నానీగారు, ప్రశాంతిగారు ఓకే అంటే నేను ప్రతి ఏడాది ఇక హిట్ సినిమానే తీయాల్సి వస్తుంది(నవ్వుతూ).
- ‘హిట్ సెకండ్ కేస్’ తెలుగులో రిలీజయ్యాక హిందీలో డబ్ చేస్తాం. హిట్ ఫ్రాంచైజీ కాకుండా నా దగ్గర మూడు బౌండ్ స్క్రిప్టులు రెడీగా ఉన్నాయి.

గ్లామరస్ రోల్స్ అంటేనే ఇష్టం


కావ్య శెట్టి

‘‘గుర్తుందా శీతాకాలం’లో మూడు ప్రేమ కథలు ఉంటాయి. అయితే రొటీన్ లవ్‌స్టోరీస్‌లా కాకుండా ప్రేక్షకుల మనసులను తాకేలా ఉంటాయి. ఈ సినిమా చూసిన వారికి ప్రేమకథలు గుర్తుకొస్తాయి. మా చిత్రం ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతుంది’’ అని హీరోయిన్ కావ్య శెట్టి అన్నారు. సత్యదేవ్ హీరోగా తమన్నా, కావ్య శెట్టి, మేఘా ఆకాష్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం ‘గుర్తుందా శీతాకాలం’. ఈ చిత్రం ద్వారా కన్నడ దర్శకుడు, నటుడు నాగశేఖర్ తెలుగు పరిశ్రమకు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. చినబాబు. ఎం, సుబ్బారెడ్డి సమర్పణలో చింతపల్లి రామారావు, భావన రవి, నాగశేఖర్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కావ్య శెట్టి మాట్లాడుతూ– ‘‘నాది కర్నాటక. కన్నడంలో దాదాపు 15 సినిమాలు చేశాను. తమిళ్‌లో 3, మలయాళంలో ఒక చిత్రంలో నటించాను. తెలుగులో ‘గుర్తుందా శీతాకాలం’ నా తొలి చిత్రం. ఈ మూవీలో అమ్ములు అనే కాలేజ్ గర్ల్ పాత్రలో కనిపిస్తాను. వినోదాత్మకంగా సాగే నా పాత్రని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. నేను డీ గ్లామర్ పాత్రలో ఒక సినిమా చేశాను. కానీ, నాకు గ్లామర్ రోల్స్ అంటేనే ఎక్కువ ఇష్టం. కన్నడ నుండి వచ్చిన అనుష్క, పూజా హెగ్డే, రష్మిక, నేహా శెట్టి, కృతీ శెట్టిలను ఆదరించినట్లే నన్ను కూడా ఆశీర్వదించాలని తెలుగు ప్రేక్షకులను కోరుకుంటున్నాను. ప్రస్తుతం కన్నడంలో మూడు సినిమాలు, ఒక వెబ్ సిరీస్ చేస్తున్నాను’’ అన్నారు.

ఆ పేరును తొలగించాం

– శివలెంక కృష్ణప్రసాద్


మోహన్‌రావు, శివలెంక కృష్ణప్రసాద్

‘‘యశోద’ సినిమాలో చూపించిన సరోగసీ ఆస్పత్రికి ‘ఈవా’ అని పేరు పెట్టాం. దీనిపై ‘ఈవా ఐవీఎఫ్’ ఫెర్టిలిటీ ఆస్పత్రి వారు అభ్యంతరం చెప్పడంతో మా సినిమా నుంచి ‘ఈవా’ పేరును తొలగించాం’’ అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. సమంత టైటిల్ రోల్‌లో హరి, హరీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘యశోద’. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలైంది. ఈ చిత్రంలో ఉపయోగించిన ‘ఈవా’ పేరుపై హైదరాబాద్‌లోని ‘ఈవా ఐవీఎఫ్’ ఫెర్టిలిటీ ఆస్పత్రి వర్గాలు కోర్టుకు వెళ్లాయి. వాళ్లతో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడి, సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ‘‘ఒకరిని బాధ పెట్టే ఉద్దేశంగానీ, ఇతరుల మనోభావాలను కించపరిచే ఆలోచనగానీ మాకు లేదు. అందుకే భవిష్యత్తులో ‘యశోద’ సినిమాలో ఎక్కడా ‘ఈవా’ పేరు కనిపించదని ‘ఈవా ఐవీఎఫ్’ యాజమాన్యానికి చెప్పాం’’ అన్నారు. ‘‘ఈవా ఐవీఎఫ్’ ఎండీ మోహన్ రావు మాట్లాడుతూ– ‘‘యశోద’ సినిమాని ఆదివారం నాకు చూపించారు నిర్మాత. అందులో ‘ఈవా’ పేరుకు సంబంధించినవన్నీ తొలగించారు. ఆ మార్పులతో సంతృప్తిగా ఉన్నామని, కేసును ఉపసంహరించుకుంటామని సోమవారం కోర్టుకు తెలిపాం.. మా అభ్యర్థనను కోర్టు ఆమోదించింది. ఇరు వర్గాల అంగీకారంతో కేసు విత్ డ్రా అయింది’’ అన్నారు.

చంద్రముఖిగా...


కంగనా రనౌత్

వెండితెరపై లేటెస్ట్ చంద్రముఖిగా కనిపించనున్నారు కంగనా రనౌత్. రజనీకాంత్, జ్యోతిక, ప్రభు, నయనతార ప్రధాన పాత్రల్లో పి. వాసు దర్శకత్వంలో 2005లో వచ్చిన ‘చంద్రముఖి’ ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘చంద్రముఖి 2’ను తెరకెక్కిస్తున్నారు పి. వాసు. అయితే లీడ్ రోల్‌ను రాఘవా లారెన్స్ చేస్తున్నారు. కాగా అప్పటి ‘చంద్రముఖి’లో జ్యోతిక చేసిన చంద్రముఖి పాత్రకు సీక్వెల్‌లో కంగనాను తీసుకున్నారని తెలిసింది. ‘దర్శకులు పి. వాసుగారితో వర్క్ చేయనుండటం హ్యాపీగా ఉంది’ అని పేర్కొన్నారు కంగనా రనౌత్. డిసెంబరు తొలి వారంలో చెన్నైలో జరగనున్న ‘చంద్రముఖి 2’ చిత్రీకరణలో కంగనా పాల్గొంటారని టాక్.

ఈ సినిమా నాకో సవాల్


ఐశ్వర్యా లక్ష్మీ

‘‘తెలుగు సినిమాలకు గొప్ప ఆదరణ లభిస్తోంది. ఇండియాలో టాలీవుడ్ బిగ్గెస్ట్ ఇండస్ట్రీగా ఎదిగింది. తెలుగు ప్రేక్షకులకు సినిమాలపై ఉన్న ప్రేమాభిమానాలే ఇందుకు కారణం’’ అన్నారు హీరోయిన్ ఐశ్వర్యా లక్ష్మీ. విష్ణు విశాల్, ఐశ్వర్యా లక్ష్మి జంటగా చెల్లా అయ్యావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘మట్టి కుస్తీ’. విష్ణు విశాల్‌తో కలిసి రవితేజ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఐశ్వర్యా లక్ష్మీ మాట్లాడుతూ– ‘‘మూడేళ్ల క్రితమే ‘మట్టి కుస్తీ’ స్క్రిప్ట్ నా దగ్గరకు వచ్చింది. అయితే హీరోయిన్ పాత్ర సవాల్‌తో కూడుకున్నది. అందుకే ఓకే చెప్పలేదు. కానీ ఆశ్చర్యకరంగా మళ్లీ ఈ కథ నా వద్దకే వచ్చింది. ఈ గ్యాప్‌లో కొన్ని సినిమాలు చేసి, ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకున్నాను. దాంతో ఈసారి ఓకే చెప్పాను. ఈ సినిమా ఎందుకు సవాల్‌గా అనిపించిందంటే నాకు టఫ్‌గా అనిపించే కామెడీని డీల్ చేయాల్సి వచ్చింది. ఇగో, వినోదం, ఎమోషన్స్ అన్నీ ఉన్న ఫ్యామిలీ డ్రామా ‘మట్టి కుస్తీ’. ఇక కథల ఎంపికలో నాకు తొందర లేదు. ప్రేక్షకులు నన్ను గుర్తు పెట్టుకునే పాత్రలే చేయాలనుకుంటున్నాను’’ అన్నారు.

రైతు పోరాటం


భరత్ పారేపల్లి

సుదీప్ మొక్కరాల, అనుస్మృతి సర్కార్ హీరో హీరోయిన్లుగా భరత్ పారేపల్లి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘నాగలి’. పావని మొక్కరాల సమర్పణలో రూపొందింది. ‘‘తపస్సు(1995) తర్వాత ఇప్పుడు ఈ ‘నాగలి’లో నటించాను. ఇందులో రైతు పాత్రలో కనిపిస్తాను. రైతుల ఆత్మహత్యలు, పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. జనవరిలో ఆడియోను, ఫిబ్రవరిలో సినిమాను రిలీజ్ చేస్తాం’’ అన్నారు భరత్ పారేపల్లి .

ప్రేమ.. స్నేహం


సిద్ స్వరూప్

సిద్ స్వరూప్, కార్తికేయ, ఇందు ప్రియ, ప్రియ వల్లభి ప్రధాన తారాగణంగా సూర్య నారాయణ అక్కమ్మ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ‘దోస్తాన్’. ఈ చిత్రం డిసెంబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సూర్య నారాయణ అక్కమ్మ మాట్లాడుతూ – ‘‘సిద్ స్వరూప్ అందించిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశాను. ఎమోషన్, ప్రేమ, స్నేహం.. ప్రధానంగా ఈ మూడు అంశాలతో రూపుదిద్దుకున్న ఈ సినిమా అందరికీ నచ్చే విధంగా ఉంటుంది’’ అన్నారు.

క్లుప్తంగా

ఆయుష్ కమిషనర్‌గా నివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఆయుష్ కమిషనర్‌గా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు మంగళవారం వైద్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు కమిషనర్‌గా ఉన్న రాములు ఆయన మాతృ శాఖకు వెళ్లిపోయారు.

క్రీడా విజేతలకు రూ.1.25 కోట్ల నగదు ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి ప్రత్యేక సాయం అందిస్తోంది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడా పోటీల్లో పతక విజేతలకు రూ.1.25 కోట్ల నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. వ్యక్తిగత విభాగాలతో పాటు టీమ్ ఈవెంట్‌లో గెలుపొందిన జట్టు సభ్యులందరు కలిపి మొత్తం 35 మందికి నగదు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. బంగారు పతకానికి రూ.5లక్షలు, రజతానికి రూ.4 లక్షలు, కాంస్య పతకానికి రూ.3 లక్షల చొప్పున ప్రకటించింది. రాష్ట్రానికి జాతీయ క్రీడల్లో మొత్తం 16 పతకాలు లభించాయి. ఇందులో రెండు బంగారు, 9 రజతం, 5 కాంస్య పతకాలు ఉన్నాయి.

వివిధ పతక విజేతలకు క్రీడల వారీగా ప్రోత్సాహకం ఇలా..

ఆర్చరీ మహిళా జట్టుకు (రజతం)రూ.16 లక్షలు, అథ్లెటిక్స్ జట్టుకు (రెండు బంగారు, మూడు రజతం, ఒక కాంస్యం) రూ.25 లక్షలు, బీచ్ వాలీబాల్ జట్టు (రజతం) రూ.8లక్షలు, జిమ్నాస్టిక్స్ (రజతం)రూ.4లక్షలు, రోలర్ స్కేటింగ్ (రజతం, కాంస్యం) రూ.7లక్షలు, లాన్ టెన్నిస్ (రజతం) రూ.6లక్షలు, సాఫ్ట్‌బాల్ జట్టుకు (కాంస్యం) రూ.48 లక్షలు, వెయిట్ లిఫ్టింగ్‌లో (రెండు రజతం, కాంస్యం) రూ.11 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందించింది.

రేపటినుంచి మోస్తరు వర్షాలు

- రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో తేలికపాటి వానలు
- ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో దిగువస్థాయి నుంచి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో మళ్లీ వర్షాలు మొదలు కానున్నాయి. గురువారం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులకు కూడా ఆస్కారం ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాలో మాత్రం పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపింది. మరోవైపు డిసెంబర్ నాలుగో తేదీన దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం విలీనం కానుంది. తరువాత అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది.

కలిసికట్టుగా పనిచేయండి

ఏపీసీసీ నేతలకు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో కమిటీ సభ్యులు మంగళవారం ఢిల్లీలో ఖర్గేని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సీనియర్లు, జూనియర్లు అందరూ కలిసి పార్టీ బలోపేతానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్లాలని నిర్దేశించారు. అనంతరం రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ ఏపీకి యువ నాయకత్వాన్ని నియమించారని తెలిపారు. కమిటీలో అందరూ 50-55 ఏళ్ల వయసుగల నాయకులున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం కోసం పనిచేస్తామని చెప్పారు. యువత, విద్యార్థి, మహిళా కాంగ్రెస్ అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తామన్నారు. అనుబంధ విభాగాల సభ్యత్వ నమోదు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్‌వలి, గౌతమ్, రాకేశ్‌రెడ్డి, పద్మశ్రీ, ఇతర నాయకులు ఉన్నారు.

నగర పార్కులకు నయా లుక్

రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లోని పార్కులను సరికొత్తగా తీర్చిదిద్దేందుకు ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీయూజీబీసీ) చర్యలు చేపట్టింది. గతంలో మొక్కలు, చెట్లకే పరిమితమైన పార్కులను ఆనందానికి, ఆహ్లాదానికి అనువుగా మారుస్తోంది. ప్రస్తుతం ఏడు పట్టణ ప్రాంతాల్లో పార్కుల పనులు చేపట్టారు. ఆయా పార్కుల్లో ప్రాణవాయువు ఎక్కువగా విడుదల చేసే మొక్కలను నాటనున్నారు. పిల్లలకు ఆట పరికరాలు, పెద్దలకు వాకింగ్ ట్రాక్‌తో పాటు అవుట్ డోర్ ఫిట్‌నెస్ జిమ్ పరికరాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఉదయం నడకకు వచ్చేవారికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ చెబుతోంది. ఆయా పట్టణాలకు అనువైన రీతిలో డిజైన్లు సైతం రూపొందించారు. ఒక్కో పార్కును కనీసం రూ. 13 లక్షల నుంచి రూ. 1.70 కోట్ల వరకూ ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నారు.
-సాక్షి, అమరావతి

పార్కుల్లో మరింత పచ్చదనం, ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు

ఆనందంగా గడిపేందుకు ఓపెన్ ఆడిటోరియాలు	పిల్లల కోసం ఆట వస్తువులు, పెద్దల కోసం జిమ్ ఏర్పాటు	తొలివిడతలో ఏడు పట్టణాల్లో నిర్మాణం	పనులు చేపట్టిన ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్



తొలి దశలో సిద్ధమవుతున్న పార్కులు

పార్కు	విస్తీర్ణం (ఎకరాల్లో)	వ్యయం (రూ. లక్షల్లో)
ధర్మవరం(రామ్‌నగర్)	1.90	73.96
కడప(బయోడైవర్సిటీ)	6.00	115.00
పులివెందుల	4.27	25.75
ఇచ్ఛాపురం	1.66	13.63
నర్సరావుపేట	0.72	19.92
కడప(ఎస్వీసీ వ్యూపార్కు)	1.70	171.00
తిరుపతి	10.00	160.00

ఎక్కువ ఆహ్లాదకరంగా..

సందర్శకులకు పూర్తిస్థాయిలో ఆహ్లాదాన్ని పంచేలా పార్కులను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఆ మేరకు డిజైన్ల రూపకల్పన, పార్కుల నిర్మాణంతో పాటు, పాతవాటిని పునరుద్ధరించే పనులను ఏపీ యూజీబీసీ చేపట్టింది. తొలివిడతలో ఏడు పట్టణాల్లో పార్కులను సరికొత్తరీతిలో నిర్మిస్తున్నారు. పార్కుల్లో 250 మంది కూర్చునేలా ఓపెన్ ఆడిటోరియాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వీటిలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, సందర్శకుల ప్రతిభను ప్రదర్శించేలా స్టేజీలను నిర్మిస్తున్నారు. పిల్లల కోసం 14 రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. 10 రకాల జిమ్ పరికరాలను బిగిస్తున్నారు. ఉదయం వేళల్లో వచ్చేవారికోసం వాకింగ్ ట్రాక్‌ను కూడా నిర్మిస్తున్నారు.

సందర్శకులు మెచ్చేలా ఏర్పాట్లు



పార్కులు అంటే గతంలో పూలమొక్కలు, నీడనిచ్చే చెట్లు మాత్రమే అనుకునేవారు. ఇప్పుడు సందర్శకుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా వాటిని నిర్మిస్తున్నాం. మొదటి దశలో 7 పార్కులను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే మచిలీపట్నంలోని వైఎస్సార్ పార్కు దాదాపు సిద్ధమైంది. అందులో పిల్లలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇంకా కడప, ధర్మవరం, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల్లో ఇదే తరహా పార్కులను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. పులివెందుల మినహా మిగతావాటిల్లో మొక్కలతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, జిమ్ పరికరాలు, బహిరంగ ఆడిటోరియాలను కూడా అందుబాటులోకి తెస్తున్నాం. ప్రత్యేకంగా కడపలో 6 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కును తీర్చిదిద్దుతున్నాం. ఇందులో వాకింగ్ ట్రాక్‌కు ప్రాధాన్యం ఇచ్చాం.
– డాక్టర్ బొమ్మిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎండీ, ఏపీయూజీబీసీ

రేంజ్‌లు, జిల్లాలవారీగా పోలీసు పోస్టుల భర్తీ

- పోలీసు రేంజ్‌లవారీగా ఎస్‌ఐ సివిల్ పోస్టులు
- ఉమ్మడి పోలీసు యూనిట్లవారీగా కానిస్టేబుల్ సివిల్ పోస్టులు
- ఏపీఎస్పీ పోస్టులన్నీ కొత్త బెటాలియన్లకే
- వెల్లడించిన పోలీసు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తాజాగా చేపట్టిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులను పోలీసు రేంజ్‌ల వారీగా పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. ఎస్‌ఐ సివిల్ 315 పోస్టులను రాష్ట్రంలోని నాలుగు పోలీసు రేంజ్‌లవారీగా, కానిస్టేబుల్ సివిల్ 3,580 పోస్టులను జిల్లాల పునర్విభజనకు ముందు ఉన్న 18 పోలీస్ యూనిట్ల వారీగా కేటాయించారు. ఎస్‌ఐ ఏపీఎస్పీ 96 పోస్టులు, కానిస్టేబుల్ ఏపీఎస్పీ 2,520 పోస్టులను కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎచ్చెర్ల, రాజమహేంద్రవరం, మద్దిపాడు, చిత్తూరు బెటాలియన్లకే కేటాయించారు. ఈ బెటాలియన్లకు 24 వంతున ఎస్‌ఐ పోస్టులను, 630 చొప్పున కానిస్టేబుల్ పోస్టులను కేటాయించారు.

రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ప్రకారం ఎస్‌ఐ సివిల్, కానిస్టేబుల్ సివిల్ పోస్టుల కేటాయింపు ఇలా ఉంది.

ఎస్‌ఐ పోస్టులు

రేంజ్	పోస్టులు
విశాఖపట్నం	50
ఏలూరు	105
గుంటూరు	55
కర్నూలు	105
మొత్తం	315



కానిస్టేబుల్ పోస్టులు

పోలీస్ యూనిట్	పోస్టులు
ఉమ్మడి శ్రీకాకుళం	100
ఉమ్మడి విజయనగరం	134
విశాఖపట్నం సిటీ	187
ఉమ్మడి విశాఖపట్నం రూరల్	159
ఉమ్మడి తూర్పు గోదావరి	298
రాజమహేంద్రవరం అర్బన్	83
ఉమ్మడి పశ్చిమ గోదావరి	204
ఉమ్మడి కృష్ణా	150
విజయవాడ సిటీ	250

కానిస్టేబుల్ పోస్టులు

ఉమ్మడి గుంటూరు రూరల్	300
ఉమ్మడి గుంటూరు అర్బన్	80
ఉమ్మడి ప్రకాశం	205
ఉమ్మడి నెల్లూరు	160
తిరుపతి అర్బన్	110
ఉమ్మడి చిత్తూరు	240
ఉమ్మడి వైఎస్సార్	325
ఉమ్మడి కర్నూలు	285
ఉమ్మడి అనంతపురం	310
మొత్తం	3,580

'జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' తో సత్ఫలితాలు

కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ అలోక్ ప్రేమ్‌నగర్

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఏపీలో భూమి కలిగిన ప్రతి ఒక్కరికి మేలు చేసే విధంగా ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష ద్వారా రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందని, దీనివల్ల బ్రిటీష్ కాలం నాటి రికార్డులకు స్వస్తి పలికి వివాదాలను పరిష్కరించవచ్చని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ అలోక్ ప్రేమ్‌నగర్ అన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడి సచివాలయ పరిధిలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి మంగళవారం పరిశీలించారు. రీ సర్వేను ఏ విధంగా చేశామనేది ప్రేమ్‌నగర్‌కు కలెక్టర్ వివరించారు. చింతలపూడి సచివాలయంలో భూసర్వేపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని కలెక్టర్‌తో కలసి ప్రేమ్‌నగర్ పరిశీలించారు. అలోక్ ప్రేమ్‌నగర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా స్వామిత్వ యోజన ద్వారా అన్ని గ్రామ కంఠాల రీ సర్వే జరుగుతోందని, ఏపీలో మాత్రం గ్రామ కంఠాలతో పాటు పంటపొలాలు కూడా రీ సర్వే చేస్తున్నారని, గ్రామంలో జరిగిన రీ సర్వే ప్రక్రియను పూర్తిస్థాయిలో పరిశీలించానని, అన్ని ప్రక్రియలు సక్రమంగా కొనసాగుతున్నాయని చెప్పారు. దీని ద్వారా గ్రామ కంఠాలకు పూర్తిస్థాయిలో రికార్డు ఏర్పడటంతో పాటు గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రీ సర్వే విధానాన్ని ఇతర రాష్ట్రాలలో కూడా తెలియజేస్తామని చెప్పారు.



భూ రీసర్వే ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అలోక్ ప్రేమ్‌నగర్, కలెక్టర్ తదితరులు

జీపీడీపీ రూపకల్పనపై అధికారులకు శిక్షణ...

అందుబాటులో ఉన్న నిధులన్నింటినీ సద్వినియోగం చేసుకుంటూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపకల్పనలో అందరూ భాగస్వామ్యం కావాలని అలోక్ ప్రేమ్‌నగర్ సూచించారు. వచ్చే ఆర్థిక ఏడాదికి సంబంధించి ఏపీలోని అన్ని గ్రామ పంచాయతీల జీపీడీపీల రూపకల్పనపై వర్చువల్ విధానంలో జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 9 రకాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో రెండు నుంచి మూడింటిని ప్రతి గ్రామ పంచాయతీ ఎంపిక చేసుకొని ఆయా అంశాలపై లక్ష్యం చేరుకునే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

ఎగుమతులకు అనుమతులు ఇక ఈజీ

- విశాఖలో ఎపెడా ప్రాంతీయ కార్యాలయం
- సీఎం వైఎస్ జగన్ చొరవతో మంజూరు చేసిన కేంద్రం
- వచ్చేనెలలో ప్రారంభానికి సన్నాహాలు

సాక్షి, అమరావతి: వ్యవసాయ, ఆహారశుద్ధి ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎపెడా) కార్యకలాపాలు రాష్ట్రంలో ప్రారంభం కాబోతున్నాయి. విశాఖపట్నంలో ఎపెడా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీంతో ఎగుమతులు ఊపందుకోవడమేగాక అనుమతులు కూడా చకచకా రానున్నాయి. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఎపెడాకు హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా 15 ప్రాంతీయ కార్యాలయాలున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటివరకు దాదాపు ఎనిమిదిన్నరేళ్లుగా రాష్ట్రానికి చెందిన ఎగుమతిదారులు, ఈ రంగంపై ఆధారపడిన వారు ప్రతి అవసరానికి హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏపీలో ప్రాంతీయ కార్యాలయం కోసం గత ప్రభుత్వం కనీస ప్రయత్నం కూడా చేయలేదు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్ ఎపెడా ప్రాంతీయ కార్యాలయం అవసరాన్ని గుర్తించి దానికోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏపీ నుంచి ఏటా ఆహార, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఏపీలో ఎపెడా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రానికి లేఖ రాశారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఫలితంగా ఏపీకి ప్రాంతీయ కార్యాలయం మంజూరు చేస్తూ ఇటీవలే కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖ సిరిపురం జంక్షన్‌లో ఒక భవనాన్ని కార్యాలయం ఏర్పాటుకు తీర్చిదిద్దుతున్నారు. సిబ్బందిని కూడా నియమించారు. వచ్చేనెలలో ఈ కార్యాలయ సేవలు అందుబాటు లోకి రానున్నాయి.



ఎపెడా కార్యకలాపాలు..

ఎపెడా కార్యాలయం పండ్లు, కూరగాయలు, మాంసం, మాంసపు ఉత్పత్తులు, పౌల్ట్రీ, పాల ఉత్పత్తులు, పచ్చళ్లు, జామ్‌లు, చాక్లెట్లు, బిస్కెట్లు, తేనె, తీపి వస్తువులు, ఆల్కహాల్ ఉన్న, లేని పానీయాలు, చిరుధాన్యాలు, వేరుశనగ, వాల్‌నట్స్, జీడిపప్పు, కోకో, హెర్బల్, పూలు తదితర ఉత్పత్తుల ఎగుమతులను పర్యవేక్షిస్తుంది. ఆహారశుద్ధి పరిశ్రమలకు ఆన్‌లైన్‌లో అనుమతులిస్తుంది. ఎలక్ట్రానిక్ చెల్లింపులు, ఆన్‌లైన్ సర్టిఫికెట్ల జారీ, వీడియో పద్ధతిన వ్యాపార ప్రదర్శనలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంది. స్లాటర్ హౌస్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, నిల్వ ప్రాంగణాలతో పాటు మాంసం, మాంస ఉత్పత్తులను తనిఖీ చేస్తుంది. ప్యాకేజింగ్ వ్యవస్థను మెరుగుపర్చడం, అవసరమైన ఆర్థికచేయూత అందించడం, ఆహార ఉత్పత్తుల పరిశ్రమల అభివృద్ధి, ఎగుమతిదారుల గుర్తింపు, నమోదు వంటి ప్రక్రియలను నిర్వహిస్తుంది. ఎగుమతి ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తుంది. ఎగుమతులకు అవసరమైన సర్టిఫికేషన్స్ జారీచేస్తుంది.

ఎగుమతిదారులకు ఎంతో ఉపయోగకరం

విశాఖపట్నంలో ఎపెడా ప్రాంతీయ కార్యాలయం వచ్చే నెలలో అందుబాటులోకి రానుంది. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం. ఇది ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– యు.ధర్మారావు, రీజనల్ హెడ్, ఎపెడా విశాఖ ప్రాంతీయ కార్యాలయం

ఏపీహెచ్‌ఏఏ కార్యవర్గం చట్ట విరుద్ధం

- కాల పరిమితి ముగిసినా ఎన్నికలు నిర్వహించడంలో బార్ కౌన్సిల్ విఫలం
- తేల్చిచెప్పిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్
- ఎన్నికలు పెట్టకపోవడంపై ఇచ్చిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వండి
- తదుపరి విచారణ డిసెంబర్ 1కి వాయిదా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్‌ఏఏ) ప్రస్తుత కార్యవర్గం ఎన్నికల విషయంలో హైకోర్టు మంగళవారం తీవ్రంగా స్పందించింది. ప్రస్తుత కార్యవర్గం కాల పరిమితి ముగిసినప్పటికీ, అది ఇప్పటికీ చట్టవిరుద్ధంగా, అనధికారికంగా కొనసాగుతోందని హైకోర్టు తేల్చిచెప్పింది. ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ దారుణంగా విఫలమైందని హైకోర్టు ఆక్షేపించింది. ఎన్నికలు నిర్వహించకపోవడంపై సంఘం సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత కార్యవర్గం గడువు ఈ ఏడాది మార్చి 31నే ముగిసినప్పటికీ, ఎన్నికలు నిర్వహించేందుకు బార్ కౌన్సిల్ చర్యలు తీసుకోలేదని, ఈ విషయంలో తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటూ న్యాయవాది ఎస్. విజయభాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ దేవానంద్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చాపర్ల సీతారాం వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల నిర్వహణకు బార్ కౌన్సిల్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై.. కేంద్ర ప్రభుత్వపు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎస్.హరినాథ్‌ను న్యాయమూర్తి వివరణ కోరారు. ఈ విషయంలో తమకె లాంటి పాత్రలేదని, ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు. దీంతో న్యాయమూర్తి స్పందిస్తూ.. న్యాయవాదుల సంక్షేమం కోసం న్యాయవాదుల చట్టాన్ని కేంద్రమే తీసుకొచ్చిందని, ఈ చట్టం కిందే బార్ కౌన్సిల్ ఏర్పాటైందని గుర్తుచేశారు.

ఆ అధికారం బార్ కౌన్సిల్‌కు ఎక్కడిది?

పాలకవర్గం కాల పరిమితిని పొడిగించినట్లు ఏపీహెచ్‌ఏఏ తరఫున సర్వ సత్యనారాయణ ప్రసాద్ కోర్టుకు నివేదించారు. ఇలా పొడిగిస్తూ తీర్మానంచేసే అధికారం బార్ కౌన్సిల్‌కు ఎక్కడిదని.. పిటిషనర్ ఫిర్యాదుపై బార్ కౌన్సిల్ ఏం చర్యలు తీసుకుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. గడువునిస్తే పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతానని నివేదించారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 1కి వాయిదా వేశారు.

● తెలంగాణ

షర్మిల అరెస్టు.. బెయిల్





షర్మిల కారును క్రేను సాయంతో ఎస్‌ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు. కారులోనే షర్మిల

- తనకు న్యాయం చేయాలంటూ ప్రగతి భవన్ ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు .. కారు దిగేందుకు ససేమిరా..
- క్రేన్ సహాయంతో ఆమెతో పాటు కారు ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- వివిధ సెక్షన్ల కింద పంజగుట్ట పీఎస్‌లో కేసు.. అరెస్టు
- నాంపల్లి కోర్టులో హాజరు పరిచిన పోలీసులు
- వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు

సాక్షి, హైదరాబాద్: వరంగల్ జిల్లా నర్సంపేటలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పాదయాత్ర సందర్భంగా సోమవారం టీఆర్‌ఎస్ శ్రేణులు దాడికి దిగడం, ఫ్లెక్సీలు తగులబెట్టడం, ఆమె కారవాన్‌కు నిప్పంటించడం తదితర సంఘటనల నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త వాతావరణం..హైదరాబాద్ వేదికగా మంగళవారం కూడా కొనసాగింది. దాడికి నిరసన వ్యక్తం చేస్తూ, తనకు న్యాయం చేయాలని కోరుతూ.. దాడిలో ధ్వంసమైన కారును స్వయంగా నడుపుకుంటూ షర్మిల ప్రగతిభవన్ ముట్టడికి ప్రయత్నించారు. అయితే పోలీసులు షర్మిలను అడ్డుకుని.. ఆమె లోపల ఉండగానే కారును మధ్యాహ్నం 1.30 గంటలకు క్రేన్ సాయంతో ఎస్సార్ నగర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా కారు దిగేందుకు షర్మిల అంగీకరించలేదు. దీంతో పోలీసులు బలవంతంగా డోర్ తీసి.. ఆమెను ఠాణా లోపలకు తీసుకువెళ్లారు. ఈలోగా షర్మిలకు సంఘీభావం తెలపడానికి వైఎస్ విజయమ్మ బయలుదేరుతున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆమెను లోటస్ పాండ్‌లోనే గృహ నిర్బంధం చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ, షర్మిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విజయమ్మ అక్కడే నిరాహార దీక్ష చేపట్టారు. కాగా, పలు సెక్షన్ల కింద పంజగుట్ట పోలీసులు షర్మిలపై కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు 20 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. షర్మిల సహా ఐదుగురిని అరెస్టు చేశారు. అనంతరం ఆమెను నాంపల్లిలోని 14వ ఏసీఎంఎం ఎదుట హాజరు పరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఈ విషయం తెలియడంతో వైఎస్ విజయమ్మ దీక్ష విరమించారు. అంతకు ముందు షర్మిలను పరామర్శించేందుకు ఆమె భర్త అనిల్ ఎస్సార్‌నగర్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యకర్తలపై లాఠీచార్జి

షర్మిల అరెస్టు వార్తతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఎస్సార్ నగర్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కొందరు యువకులు స్టేషన్ ఎదురుగా ఉన్న భవనంపైకి ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరికొందరు కార్యకర్తలు స్టేషన్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇదిలా ఉండగా షర్మిల ప్రజా ప్రస్థానం పాదయాత్రకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. పాదయాత్రను నిలిపివేయాలంటూ వరంగల్ పోలీసులు ఇచ్చిన నోటీసులను రద్దు చేసింది. భవిష్యత్తులో పాదయాత్ర చేయాలనుకుంటే మళ్లీ పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొంది.

● ఉత్సాహంగా నేవీ డే రిహార్సల్స్

డిసెంబరు 4వ తేదీన నేవీ డే సందర్భంగా మంగళవారం విశాఖ సాగరతీరంలో తూర్పు నౌకాదళం నిర్వహించిన రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. తీరంలో బాంబుల మోత మోగింది. ఉగ్రవాదుల నుంచి బందీలను నేవీ కమాండర్స్ కాపాడే విధానం గగుర్పాటుకు గురిచేసింది. తీరంలో అనుమానంగా ఉన్న నౌకలను బాంబులతో పేల్చే దృశ్యం, తీరంలో ఉగ్రవాదుల స్థావరాలపై బాంబుల దాడి ఉత్కంఠకు గురిచేశాయి. సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ ద్వారా ఎలా రక్షిస్తారో కళ్లకుకట్టినట్లు చూపించారు. చివరిగా మిగ్ విమానాలు, యుద్ధ విమానాలు హైస్పీడ్‌తో దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించాయి. సందర్శకులు ఈ ప్రదర్శనలను ఎంతో ఆసక్తిగా తిలకించారు.





– బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు)

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.